# ప్రజా చైతన్యగీతాలు

## కవితలు, పద్యాలు, నినాదాలు

బి.ఏ. నారాయణరావు

ప్రచురణ

సావిత్రిబాయి ఫూలే ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు

విశాఖపట్నం

2015

# ప్రజా చైతన్యగీతాలు

**కవితలు, పద్యాలు, నినాదాలు**

**బి.ఏ. నారాయణరావు**

**ముద్రణ : 2015**

**వెల : రూ. 80/-**

**ప్రచురణ**

సావిత్రిబాయి ఫూలే ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు

**ప్రతులకు**

**బి.ఏ. నారాయణరావు**
డోర్ నెం. 2-14-18, ఫ్లాట్ నెం. MIG-1 A/7
సెక్టర్ - 6, ఎంవిపీ కాలనీ, విశాఖపట్నం -17.
Cell : 88974 66582, 9059 544377

**మరియు**

సావిత్రిబాయి ఫూలే ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు
డోర్ నెం. 1-225, సుసర్ల కోలనీ, బాజీ జంక్షన్,
గోపాలపట్నం, విశాఖపట్నం-530 027
ఫోన్లు : 0891-2716225, 9393813648

**బుక్ మేకింగ్**

**ముద్రణ**

Visakha Covers ‘n’ Crafts, Visakhapatnam.

**(For) Samata Impressions**

Adivivaram, Visakhapatnam - 28, Phone : 9492244586
e-mail : samataimpressions@gmail.com

# రెండు మాటలు?

**మొదటిది :** ఎక్కువ చదువుకోనినాకు, సాహిత్య పరిజ్ఞానంలేకపోయినప్పటికీ, నాచేత, ప్రజాసమస్యలపై, పాటలు రాయగలశక్తీ, చైతన్యమూ, నాకందించినది, ప్రగతిశీల భావజాల పునాదులపై ఏర్పడి, ప్రజల సమస్యలను గుర్తించి, ప్రజలతో మమేకమై, ప్రజల తరపున గళం విప్పి, కలం కదిపి, గజ్జెకట్టి, శ్రమదోపిడిపై ధ్వజమెత్తి, జనంలో చైతన్యం రగిల్చి, ఉద్యమాన్ని ఉరకలెత్తించి, దోపిడీదారుల గుండెల్లో దడపుట్టించి, మహాకవి శ్రీశ్రీతో ప్రశంసలందిన, ప్రగతిశీల, ప్రజాసాంస్కృతిక సంస్థ ఐన, ప్రజానాట్యమండలిదే ఈ శక్తీ, ప్రతిభా. ఈ సాంస్కృతిక సంస్థలో భాగస్వామినైయే అవకాశం లభించినందునా, ఆ సంస్థతో కల్సి నాలుగడుగులు నడిచి జనం సమస్యల్ని ఆకళింపు చేసుకునేశక్తి కలిగినందునా, ఆ స్ఫూర్తితోనే, ఈ పాటలూ, కవితలూ, పద్యాలూ, నినాదాలూ, రాయగలిగినందున, మా ప్రజానాట్యమండలికి, నా మొదటి ప్రణామాలు. ఇక అడుగడుగునా, నన్ను పాటలు రాయమని ప్రోత్సహించిన మిత్రులు, కా॥ పెంటకోట రామారావుగారికి, నా రెండవ వందనం. నా పాటల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, నేను రాసియిచ్చిన వెంటనే, తన అద్భుత జ్ఞాపకశక్తితో, కంఠస్థంచేసేసి, తన శ్రావ్యమైన గొంతుతో, జనంలో పాడి, ప్రచారంచేసి, గాయకుడికీ, రచయితకీ కూడా, ప్రశంసలు సంపాదించిపెట్టిన, మా పందిరిరాముగారికి, నా మూడో వందనం. నా పాటల్ని విన్నవెంటనే స్పందించి, ప్రశంసించి, ఇవి తప్పకుండా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళాల్సిన అవసరముందనీ, ఈ పాటల్నీ, సాహిత్యాన్నీ ప్రజలకు చేరువచేసి, వారిలో చైతన్యం రగల్చాలనీ, ఇందుకు మార్గంగా, దీన్ని పుస్తకరూపంలో తీసుకురాకతప్పదనీ, అందుకు అవసరమైన ఆర్ధిక సహకారంతోబాటు, అన్ని సహాయ సహకారాలూ, ఎన్ని ఇబ్బందులున్నా అవన్నీ భరిస్తూనే తమ, సావిత్రబాయి పూలే ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అందించేందుకు, సాహసంతో ముందుకు వచ్చిన ప్రజలమనిషీ, బహుముఖ సేవాపరాయణురాలూ, దేహదాన సంఘం కన్వీనర్ అయిన, మా సీతామహాలక్ష్మిగారికి, సర్వదా కృతజ్ఞుణ్ణి. నా పాటల్ని పుస్తకరూపంలో, అచ్చొత్తటమేగాక, అనేకవిధాల సూచనలూ, సలహాలూ యిచ్చి సహకరించిన సమతా ఇంప్రెషన్స్‌వారికీ నా అభినందనలు. చివరిమాట – ప్రజలకూ, పాఠకులకూ నా ప్రత్యేక విన్నపం ఏమంటే, పెద్దగా చదువూ, సాహితీ పరిజ్ఞానం నాకు లేనందున, నా రచనల్లో పునరుక్తులు దొర్లితే, మన్నించమనీ అలాగే, అందులో, ఏ సంస్థనైనా, పార్టీలనైనా విమర్శిస్తే – అవన్నీ, నా ధర్మాగ్రహంగానే పరిగణించమనీ, అన్యథా భావించవద్దని మనవి చేసుకుంటున్నాను.

**రెండోమాట :** చాలామంది రచయితలూ, కవులూ, తమ పుస్తకాలకి, కొంతపేరూ ప్రఖ్యాతులూ వున్న, రచయితలతోనో? విమర్శకులతోనో? సాహితీవేత్తలతోనో? ముందుమాట వ్రాయిస్తుంటారు. కానీ....ఆ సాంప్రదాయాన్ని అనుసరించటంనాకు ఇష్టంలేదు. ఎందుకంటే, నా అభిప్రాయం ప్రకారం, ముందుమాటంటేనే ఒక చిన్నసైజు రికమెండేషన్. 'నిర్విమర్శతో కూడిన మద్దత్తే!' అంటే ఒకరకంగా పొగడ్తే తప్ప, విమర్శ అరుదు. గనుక, ఇలాంటి ముందుమాటలు, రచనకి సమర్ధనా, మద్దత్తే తప్ప పొరపాట్లూ తప్పులూ ఎత్తిచూపించే సాహసం, ముందుమాటలు వ్రాసేవారు చెయ్యకపోవటం చూస్తూనేవున్నాం. ఆ అభిప్రాయంతోనే ఏ మాటైనా, పాఠకులువారి చైతన్య స్థాయితో చేసే, న్యాయ నిర్ణయమే గీటురాయిగా భావించి, వారికే ఒదిలేయాలనేదే నా అభిప్రాయం. అయితే ముందు మాటకి అనుమతించనినేను, ఆవిష్కరణ సందర్భంగా ఆవిష్కర్తా, ఇతర వక్తలూ, రచననీ, రచయితతనీ అభినందిచటం జరుగుతుంది కదా, ఇది కూడా ఆ ముందుమాట కోవలోకి రాదా? అనిపించవచ్చు. ఈ విషయంలో పాఠకులతో ఏకీభవించకపోవటానికి కారణం, ఆవిష్కరణ వక్తలూ, ఇతర వక్తలూ, పొగడ్తలైనా తెగడ్తలైనా, ఆ వేదికతోనే అవి ఆగిపోతాయి. అవి పుస్తక పాఠకులకు చేరవు. కానీ పుస్తకంపై రాసిన ముందుమాటలు, పుస్తకం వున్నంతకాలమూ వెన్నంటే వుంటాయి. అదీ కూడా నిర్విమర్శతో కూడిన మద్దత్తే! అందువలన ఆవిష్కరణ సందర్భంగా జరిగిన కొన్ని గంటల కార్యక్రమంలో, వివిధ వక్తల అభిప్రాయాలు, అవి **పొగడ్తగాగానీ, తెగడ్తగాగానీ** వుండే అవకాశమూ వుంటుంది. గనుక, వాటిని ముందుమాటతో సరిపోల్చలేముకదా. అసలు నా సాహిత్యానికి ఆవిష్కరణల ఆర్భాటం చేద్దామన్న అభిప్రాయంగానీ, నా సాహిత్యానికి అంత స్థాయి వుందనిగానీ, నేను భావించలేదు. గనుక, ఆవిష్కరణ జోలికిపోకూడదనుకున్నాను. కానీ..మిత్రుల ప్రోద్భలంతో, నిర్వహించకతప్పలేదు. గనుక, దీనికీ, నేను పూర్తిగా బాధ్యత వహించలేనని మనవి చేస్తూ, సహృదయంతో పాఠకులు వీటిని అర్ధం చేసుకోగలరని ఆశిస్తూ.....

**రచయిత**
**బి.ఏ.నారాయణరావు**
**(సెల్ : 9059544377**
**88974 66582)**


పాటలు

# 1. మీరెటువైపోయీ?

కవిగాయకనటులారా - ఎటువైపోయీ
మీరెటువైపోయీ
కలిమిబలిమిగలవైపా - కష్టజీవికిరువైపా
తేల్చుకునే సమయమిదే - పోరుసల్పుతరుణమిదే ॥కవి॥

కవితంటే జడత్వాన్ని - ఒదిలించాలోయ్
కవితంటే చైతన్యం - రగిలించాలోయ్
కవితంటే వాస్తవాల్ని - వివరించాలోయ్
కవితంటే పీడితులను - కదనానికి లేపాలోయ్ ॥కవి॥

కండలు కరిగించినోళ్ళు - పండించిన పంటజూడు
పందికొక్కులాగ మేసి - పండుకునేదొరలజూడు
తనువూమనసూకట్నం - తగురీతిలొధారపోసి
మంటలలో మాడిపోయె - మగువల ఘోషలు వినవోయ్ ॥కవి॥

నీపాటే జనహృదిలో - జలపాతం కావాలీ
నీపాటే ఉద్యమాల్ని - ఉరకలు ఎత్తించాలీ
నీపాటే పోరాటపు - పోటెత్తీ లేవాలీ
పేదవాడెనీ అస్త్రం - పదవోయీ ఓ నేస్తం ॥కవి॥

కవి ధరించవలసిందీ - కలమేకానీ...
కత్తికూడ దూయాలోయ్ - సమయం ఒస్తే
కార్మిక కర్షకులతోడ - కలవాలో యీ
ఇక శ్రామికరాజ్యం - మనదని చాటాలోయీ ॥కవి॥

# 2. ఓ మహాత్మా - జాతి ఆత్మా

ఓ మహాత్మా - జాతి ఆత్మా
ఓ జ్యోతిరావుపూలే - మా జాతినేతనీవే
మాఅణగారినప్రజలందరి - హృదయానివినీవే, మారథసారధినీవే ॥ ఓ ॥

కులంపేర మతంపేర - ప్రజలను బానిసలు జేసి
అంటరానివారమంటు - విద్యనందకుండజేసి
ఊడిగాలుచేయించీ - ఊరవతలకెళ్ళగొట్టి
భూసురులనిచెప్పుకొనీ - మాఉసురునుదీసినారు ॥ ఓ ॥

కులంకుళ్ళుకడిగేసీ - మతంగుట్టువిప్పేసీ
మడిబట్టలమాయలన్ని - విడమర్చీచెప్పినావు
నిమ్నజాతులందరికీ - నిజందెలిపినిగ్గుదేల్చి
మాకోసమెదేశంలో - మొదటిస్కూలు బెట్టినోడ ॥ ఓ ॥

మూఢనమ్మకాలనన్ని - మూలతోయమన్నావూ
విద్యనేర్చివివేకాన్ని - హద్దుతెలియమన్నావూ
కలంపట్టికవితచెప్పి - గళంవిప్పినిజంజెప్పి
మానవులంతా ఒకటని - మహనీయా చాటినావు ॥ ఓ ॥

దళితజాతినుద్ధరించ - జనియించినమహావీర
జ్ఞానసూర్యుడానీకివె - వేనవేల వందనాలు
నీతోడుగనీసతినీ - జాతిసేవకర్పించిన
త్యాగధనుడనిన్నుగన్న - భరతమాతధన్యురాలు ॥ ఓ ॥

జ్యోతిరావుమాజీవన - జ్యోతినివెలిగించినావు
పూలేమాబతుకుల్లో - పూలబాటవేసినావు
నీలాంటీజ్యోతిమాకు - ఈనాడూ ఒక్కరుంటె
లోకానా చీకటులను - పారదోలెవారముకద ॥ ఓ ॥

# 3. అమ్మా మా సావిత్రీ

అమ్మా మా సావిత్రీ - దళితజాతిజనయిత్రీ
త్యాగంలో నీకుసాటి - లేరమ్మా ఈధరిత్రి
మహాత్మునికి సతివయ్యా - మహాజనుల తల్లివయీా
అనాధలకు అభాగ్యులకు - అండగనిల్చిన తల్లీ
జ్యోతిరావుసహచరివై - జ్ఞానజ్యోతిపొందినావు
నిమ్నజాతి అంతటికీ - విద్యవెలుగునింపినావు ॥ అమ్మా ॥

అవమానం హింసలెన్నొ - అనుభవించినాగానీ
అదరకుండబెదరకుండ - అడ్డంకులనధిగమించి
అడుగుముందుకేసినావు - జనంకొరకునిలిచినావు ॥ అమ్మా ॥

ప్రాణాలను హరియించే - రోగాలకు భయపడకా
ప్రజలసేవలో బ్రతుకును - నైవేద్యంచేసినావు
నీలాంటిస్త్రీమూర్తులు - ఈనాటికికనబడరే
తారలువున్నంతవరకు - నీత్యాగంమరువములే ॥ అమ్మా ॥

నినునిత్యంతలచుకుంటు - నీదారిలోపయనిస్తూ
నిర్భాగ్యులకన్నీళ్ళను - తుడిచేందుకు కృషిచేస్తాం
స్త్రీజాతిని చిదిమేసే - ఈజాతిని నిరసిస్తూ
మహిళాశక్తినిచూపి - మానవతను నిలబెడతాం ॥ అమ్మా ॥

# 4. బలికావద్దోయ్ మనం!

మనుషులంత కలిసిమెలిసి సాగేదేమతమూ - అదే మానవతమూ
ఒకరినొకరు హతమార్చుటకాదోయీ హితమూ -
అదికాదోయ్ సమ్మతమూ ॥మను॥

హిందువైన ముస్లిమైన క్రైస్తవుడే అయినా ॥క్రై॥

ఆకలి నిద్రామరణం - అందరికీ ఒకటే - మనకందరికీ ఒకటే
కూడుగూడులేకజనం - గోడుగోడుమంటుంటే
అయోధ్యలో సయోధ్యకే - అగ్గిపెట్టినారదిగో ॥మను॥

అండపిండ బ్రహ్మాండం నిండియుండెనంటూ
అయోధ్యలో పుట్టాడని - వాదులేలమీకూ
ఆవాదులేలమీకూ - రాముడైనరహీమైనదేవుడొక్కడేనైతే
రాముడినేరాజకీయపావునిజేయుట తగునా ॥మను॥

మానవసేవే మాధవసేవయనీ చాటగా
మనుషులంత ఒకటేనని - మహనీయులమాటగా
మానవునీ మాధవునీ - మంటలలోద్రోసీ
దానవులుగ మారినారు దారుణాలూజేసీ ॥మను॥

భరతమాత బానిసత్వ - బంధనాలుద్రెంచగా
హిందువులూ ముస్లిములూ అందరమూ గలిసీ
మనమందరమూగలిసీ
స్వాతంత్ర్యపుమహోద్యమం - సాగించిన సోదరులం
స్వార్థపరులగాలానికి బలికావద్దోయ్ మనం ॥మను॥

తిండిలేకబట్టలేక - వుండడానికిల్లులేక
ఇండియాలోపేదలంత - ఇబ్బందులుపడుతుంటే
దండిగధనమున్నవాడు - మెండుగబలమున్నవాడు
అధికారంకోసం సాగించు - స్వార్థకుట్రఇదీ ॥మను॥

# 5. కెరటాలోయ్ కెరటాలూ

కెరటాలోయ్ కెరటాలూ - ఆనందాల కెరటాలూ
ఆరాటాల కెరటాలూ - ఆవేశాల కెరటాలూ
ఆ గంగాతల్లీ ఒడిలోబెట్టీ - ఉయ్యాలూపు కెరటాలూ ॥ కెర ॥

ఎయిరాఎయ్యా తెడ్డులుఎయ్యా - నడుములు ఒంచీ ఒడిగాఎయ్యా
గాలీవాటం చూసీఎయ్యా - తూరుపుదిక్కుకి జోరుగ ఎయ్యా
ఎగురూతున్నా చేపలుజూడూ - దిగులే లేదూ పడవేనిండూ ॥ కెర ॥

అదిగదిగదిగోకొమ్మూకోనేం - ఇవిగివిగివిగో ఒంజీరాలూ
పండూమొయ్యలపరుగేజూడూ - సందూవాలా సందడిజూడూ
మాగారాజులపోగేజూడూ - సొర్రాచేపలగుంపేజూడూ ॥ కెర ॥

ఏటాబాగాపూటుగసాగీ - పడవానిండా సేపలుపడితే
అమ్మికినేనూ కమ్ములుకొంటా - బాబుకినేనూ బట్టలుకొంటా
ఆలికిమెడలోతాడునుకొంటా - గాలీవానకి దండామెట్టి
గంగాతల్లికి పండగజేస్తా ॥ కెర ॥

జోరుగవలనే ఇసిరీనాడూ - ఒడుపుగపట్టీలాగీనాడూ
సందూవాలూసక్కగబెట్టీ - పండూమొయ్యలుపదిలంజేసీ
నిండీపోయిన వలనేజూసీ - పొంగీపోయెనుజాలారన్నా ॥ కెర ॥

పట్టాలేనీ ఆనందంతో - పడవా యింటికి తిప్పీనాడూ
అంతాలోనే మబ్బులువేసే - పట్టాపగలే చీకటికమ్మే
టిక్కూటిక్కూ సినుకులురాలీ - భోరునవానాజోరుగకురిసే ॥ కెర ॥

నైరుతిదిక్కున గాలేవీచీ - తాడీఎత్తున కెరటంలేచే
గిరగిరగిరగిర పడవనుదిప్పే - విరిగినకెరటం పడవనుముంచే
పడవొక దిక్కూ మనిషొకదిక్కూ - కనబడకుండా కనుమరుగయ్యే
పడవాదరికీ చేరాలేదూ - జాలారన్నా జాడేలేదూ
జాలారమ్మకుదారేలేదూ - గంగాతల్లికి జాలేలేదూ
కాలీపడవే కబురే తెచ్చే - కన్నీళ్ళే కెరటాలలొగలిసే ॥ కెర ॥

# 6. రైతు గుండె రగిలిందా?

నాగరికతలో పుట్టిందీ నాగలిలో
మానవ మానుగడవుందీ సేద్యంలో
ఆ సేద్యంలో శ్రమనూ నైవేద్యంచేసినట్టి రైతు గుండె రగిలిందా
రైతు గుండె రగిలిందా - రాజ్యం పని గోవిందా ॥ నా ॥

చిత్తూరు జిల్లాలో చిత్రాలను చూసారా? ॥చిత్రా॥
మేలైన టమాటాలు వేలెకరాల్ పండించీ ॥వేలె॥
దళారీల దుకాణాల్లో దారిలేక అమ్మబోతే ॥దారి॥
రైతుకేమొ రూపాయట - ప్రజలకు పది రూపాయ్‌లట! ॥ నా ॥

ప్రపంచాన ప్రజలలోన - పేరొందిన ఎరుపుకాయ ॥పేరొ॥
గూబ గుయ్యిమనిపించే - గుంటూరూ మిరపకాయ ॥గుం॥
బస్తాలతో బళ్ళమీద - బజారులో అమ్మబోతె ॥బజా॥
రైతుకేమొ ఐదంటా - ప్రజలకు ఏభై అంటా! ॥ నా ॥

విదేశాలలో సైతం - విజేతగా నిలిచినట్టి ॥విజే॥
కర్నూలూ వుల్లి చూడు - వుల్లికాదు తల్లిర అది ॥వుల్లి॥
మార్కెట్టులొ రేటుజూస్తే - మతిబోయెను రైతన్నకు ॥మతి॥
రైతుకేమొ రూపాయీ - ప్రజలకు ఇరవయ్యంటా! ॥ నా ॥

కొండలు గుట్టలు దిగుతూ - రాళ్ళూ ముళ్ళూ దాటుతు ॥రాళ్ళూ॥
చింతపల్లి గిరిజనులూ - చింతపండు మోసుకొస్తె ॥చింత॥
మారుబేరగాళ్లంతా - కూడి ఒక్కటయ్యారూ ॥కూడి॥
కావిడి చింతాపండుకి - సావడపరిగిచ్చారూ ॥ నా ॥

అరకులోన కొండోళ్లూ - అల్లం కావిళ్లు దెస్తే ॥అల్లం॥
సుక్రవారం సంతలోన - సూసినారు సావుకార్లు ॥సూసి॥
ఎగాదిగా ఎత్తి దించి - ఏమాత్రం ధర లేదని ॥ఏమా॥
బెల్లం చేతిలొబెట్టీ - అల్లమెత్తుకెళ్లారూ ॥ నా ॥

సీతంపేట సవరోళ్లూ - సీతాఫలములు దెస్తే ॥సీతా॥
తట్టెడు చెమటను కార్చీ - బుట్టలతో పళ్లు తెస్తే ॥బుట్ట॥
కన్నుగీటి గిరాకీలు - కనబడలేదని జెప్పీ ॥కన॥
బుట్టడు పళ్లుకి రెండూ - సుట్టలిచ్చి పంపినారు ॥ నా ॥

సముద్రాన మత్స్యకార్ల - సంగతి ఇటుసూడండీ ॥సంగ॥
ఒంజరాలు సందువాలు - ఒడుపుగ వేటాడిదెస్తే ॥ఒడుపు॥
వేటకెళ్లి రొయ్యలన్ని - పూటుగ బోటును నింపితె ॥పూటు॥
పూట తిండి గ్లాసు మందు - గోచి పాతె మిగులుతుంది ॥ నా ॥

అమ్మబోతె అడివాయే - కొనబోతే కొరివాయే ॥కొన॥
పదిమందికి బువ్వబెట్టు - రైతు బతుకు చితికిపోయె ॥రైతు॥
బతకలేక మెతుకులేక - పల్లెనొదిలి ఇల్లునొదిలి ॥పల్లె॥
వలసబాట పట్టినారు - వలవలవల ఏడ్చినారు ॥ నా ॥

రైతులనూ ఆదుకోని - రాజ్యమేమి రాజ్యమూ ॥రాజ్య॥
మహిళలనూ కాపాడని - మనుషులేమి మనుషులూ ॥మను॥
బాలల బాధలు చూడని - దేశమేమి దేశమూ ॥ దేశ॥
వృద్ధుల సంగతి పట్టని - పెద్దలు కాదోయ్ గద్దలు ॥ నా ॥

మేధావుల నాదుకోని - నాయకులొక నాయకులా? ॥నాయ॥
విద్యార్థుల విస్మరించు - పాలకులొక పాలకులా? ॥పాల॥
యువతరాన్ని గుర్తించని - ప్రభుత వుండి దండగే ॥ప్రభు॥
సమతా మమతలు లేని - సమాజమే నరకంరా ॥ నా ॥

# 7. రాగమయి

కోకొకటిరైకొకటి – కొప్పులోపువ్వొకటి
ముక్కునానత్తొకటి – మురిపాలనవ్వొకటి
కాటుకెట్టొచ్చిందిరా ఆ పిల్ల – కనకమై మెరిసిందిరా !!

చెట్టుపై ఉడతోలె – చెరువులో చేపోలె
తోటలో చెట్టోలె – నీటిలోపడవోలె
చేనులో వెన్నోలె – చెంగల్వపువ్వోలె
పున్నమీ వెలుగయ్యెరా ఆ పిల్ల – పుత్తడీ బొమ్మాయెరా !! ఆ

నవ్వయ్యి పువ్వయ్యి – నటరాజుమువ్వయ్యి
హంసయ్యి జింకయ్యి – హరివిల్లు ఒంపయ్యి
మరుమల్లె మొగ్గయ్యెరా ఆ పిల్ల – మరునిచేతిలో సిలకరా !!

బుగ్గ పై సుక్కుంది – సుక్కల్లొ సక్కంది
సక్కనోళ్ళకికూడా – దక్కనూ పొమ్మంది
మక్కువతొ నా పైన – మనసు పారేసింది
మనువాడుమంటోందిరా ఆ పిల్ల – సనువిచ్చి వెళ్లిందిరా !!

ఏటిస్తానాలాడి – ఎలిగెలిగిపోతుంది
నడకలో నాజూకు – కులుకులే ఒంపింది
కడకంట సూసిందిరా ఆ పిల్ల – కలకలం రేపిందిరా !!

పగడాల పెదవులతొ – పగలబడి నవ్వింది
వగలమారీపిల్ల – సెగలు పుట్టించింది
పగలు రాతిరితెలవకా – నామనసు పలవరింతలుజేస్తదీ !!

చెరుకుబాణంవాడూ – చురుకు పుట్టించాడు
కరుకుమనసులొ దూరి – వలపు రేపించాడు
మబ్బుల్లొ పిల్లనీ – మాయమే జేసాడు
కలత కలిగించాడురా – నాగుండెకదిపి కుదిపేసాడురా !!

తోటల్లో ఎదికాను - తోపుల్లో సూశాను
ఎన్నెల్లో సీకట్లో - ఎంతెంతొ తిరిగాను
కనుసూపు మేరలోనా ఆ పిల్ల - కానరాకేపోయెరా !!

అలిసిసొలిసినేను - అదమరిసి నిదరోతె
పక్కలో సేరింది - టక్కరీ కునుకంది
కితకితలుపెట్టిందిరా ఆపిల్ల - కిలకిలా నవ్విందిరా !! ॥కోకొకటి॥

జామురేతిరికాడ - జాతరకురమ్మంది
సుక్కురోరంనాడూ - సంతలోకలమంది
మాటనమ్మినేను - ఏటిదారికి ఎలితే
మాయమైపోయిందిరా ఆపిల్ల - మంచెపై వెలిసిందిరా !!

సిక్కనీ సీకట్లో - ఒక్కరితివున్నపుడు
పక్కనేనున్నట్టూ - నన్నిడిసిపోనట్టూ
రాటనేపడుతుందిరా ఆ పిల్ల - పాటపాడూతుందిరా !!

సరసాలు సరదాలు - సక్కగా ఆడింది
అందుకుందామంటె - తొందరొద్దంటుంది
అందాక ఆగమందీ ఆ పిల్ల - ఆ రోజు వస్తదందీ !!

ఎందాక ఈ ఎడము - ముందు చెప్పామంటె
పదిమంది మద్యనా - పందిరెయ్యామంది
పల్లకిలొ ఊరేగి - పల్లె తిరగాలంది
మూడుముళ్ళేసినాకే - ఆపైన ముచ్చటే తీరునందీ !!

ఎనకజనములోన - ఎవరిమోకాదంది
ఏడు జనమలనుండి -జోడు మనదేనంది
కలకాలముండునందీ మన జంట కమ్మగా బతుకునందీ !!

(ఈ పల్లె పిల్లకున్న నిగ్రహం, ఈనాటి నగర పిల్లలకుంటే పోలీసుస్టేషన్లకి పోవాల్సిన అవసరం రాకపోను. అందుకే ఈ 'రాగమయి' రాసాను)

# 8. దేవుళ్లకె చెల్లు!

ఆలోచించనివాడూ - జంతువుతోసమమే
అదేమనీ అడగనోడు - అడివిలోని మృగమే
పేదరికానికి మూలం - శ్రమదోపిడీయేరా
ఆ గుట్టు తెలియకున్నవారె - గుడులచుట్టు తిరుగూ ॥ఆ గుట్టు॥

పాముపైన పవళించే - పరమాత్ముని జూడూ
ఆ పరమాత్మునిబొడ్డులోన -పువ్వుపుట్టె చూడూ
ఆ పువ్వులోన పుట్టినట్టి - ముసలిబ్రహ్మ చూడూ
ఆతండ్రికంటె కొడుకు - ముసలి అయ్యేనెట్టు అడుగూ ॥ఆతండ్రి॥

ముసలి బ్రహ్మముఖంనుండి - పుట్టారట బ్రాహ్మలూ
ఆభుజాల్నుంచె రాజులంత - పుట్టారట చూడూ
కడుపునుండి కోమటోల్ని - కాళ్ళనుండి శూద్రపోల్ని
కన్నాడట ఆ బ్రహ్మ - విన్నారా మీరూ
మరిపంచముడేలాగపుట్టె - వంచకుల్నె అడుగూ ॥మరి॥

నలుగుపిండితోబాలుని - చేయుటనగుబాటూ
ఆ బాలుడినేకాపలాగ - పెట్టుటయేచేటూ
ఆ స్నానాలాగదిలోకీ -సాగుటయే నేరం
అది కూడదన్నపసిబాలుని - కూల్చుటయే క్రూరం ॥అది॥

బొమ్మని బాలునిచేసిన - అమ్మకుమతిలేదా
ఆ బాలుని తలవుండగానె - ఏనుగు తలఏలా
ఈ తెలివిలేని పనులన్నీ - దేవుళ్లకె చెల్లూ
ఆ దేవుళ్ళనిదేబిరించె - మనవుడామళ్ళూ ॥ఆ దేవుళ్ల॥

# 9. ఎహే ఎంకీ రావే ఏటో ఎన్నికలంటా

ఎహే ఎంకీ రావే ఏటో ఎన్నికలంటా ॥ఎహే॥

ఏంది ఏందినీ మావా ఎన్నికల్లామావా
ఆ ఎన్నికల్లో కల్లమాట - లెన్నెన్నో విన్నానూ ॥ఎంకీ॥

కిర్రు చెప్పూలోళ్లూ - బుర్రమీసాలోళ్ళూ
గళ్ళకోటూవేసీ - తెల్లటోపీ పెట్టీ
తెల్లకారూలోనా - నల్లడబ్బే తెచ్చే
మనం ఓటులు వేసామంటే - నోటులు ఇస్తారంటా! ॥ఎంకీ॥

వాళ్ళ నోటులకోసం - మనం ఓటులువేస్తే
మనకు కూటిలోమట్టే - వాళ్ళు కోటలుగట్టే
వాళ్ళు సీటు ఎక్కగానె - మనకు రేటులు పెంచేస్తారూ ॥ఎంకీ॥

కిలో రూపాయ్ బియ్యం - బలేగిస్తున్నారే
ఏడుగంటల విద్యుత్ - ఊరకిస్తున్నారే
పావలావడ్డీకే - వేలకోట్లిస్తారే
వాళ్ళు మళ్ళీ గద్దెక్కారా - సెల్లుఫోనులిస్తారే! ॥ఎంకీ॥

ఉప్పుపప్పులుపెంచీ - నూనెబియ్యంపెంచీ
వంద విద్యుత్ బిల్లూ - వెయ్యి రూకలుజేసీ
పావలా వడ్డీలూ - గావుకేకలెసుమ్మీ
వాళ్ళ సెల్లుఫోన్లకోటేస్తే - సిల్లుపడును మన బతుకులు! ॥ఎంకీ॥

అమ్మో నొప్పనగానే - కుయ్యికుయ్యీమంటూ
నూట ఎనిమిదిబండీ - నీటుగొచ్చేస్తాదే
ఆసుపత్రికి నిన్నూ - మోసుకెళిపోతాదే
నీకు ఏరోగం ఒస్తైనేమి - ఆరోగ్యశ్రీని బెట్టే ॥ఎంకీ॥

ఆళ్ళనూటెనిమిదికే - పూటబత్తెములేకా
రోడ్డుమీదనెబండీ - ఆపివేస్తారండీ
ఆసుపత్రికిబోతే - ఆపరేషనులేదూ
ఆపరేషనుజేస్తే - మందుబిళ్ళేలేదు ॥ఎంకీ॥

ఇళ్ళుకడతారంటే - భూములిస్తారంటే
రోడ్లువేస్తారంటే - తారుపూస్తారంటే
దొడ్లు కడతారంటే - బుడ్లుయిస్తారంటే
వాళ్ళుకట్టెతోనెకైలాసం - ఇట్టే పంపిస్తారట ॥ఎంకీ॥

ఇళ్ళు కడతాననీ - ఒళ్ళుకుళ్లాబొడిచి
భూమియిస్తామని - వున్నదీలాగేసీ
రోడ్లువేస్తామనీ - రాడ్లుతీస్తున్నారూ
వాళ్ళుబొందిలోన ప్రాణాలను- బొందపెట్టి ఒదిలినారు ॥ఎంకీ॥

# 10. ఏనాటికి మారుతుంది?

ఏనాటికి మారుతుంది ఈలోకం ఇక ఏనాటికి తీరుతుంది ఈశోకం
ఒకడినొకడు దోచుకునే సకల దురాగతములతో
అరువదేళ్ళ స్వాతంత్ర్యం కరువు దరిద్రం స్వార్థం ॥ఏనాటికి॥

అవినీతీ అధికధరలు - హత్యలు కార్పణ్యాలూ
పదవులకై పోట్లాటలు - ఓటులకై చీట్లాటలు
జనంధనందోచుకెళ్ళి - విదేశాల్లో దాచుకునే
పాలకులాపాపాలూ - చీలికలయ్యేదెన్నడు ॥ఏనాటికి॥

పట్టెడు మెతుకులకోసం - పుట్టెడు శ్రమధారబోసి
సత్తువనంతా రగిల్చి - సంపద సృష్టించినోళ్ళు

ఆత్మహత్య చేసుకుంటె - ఆకలిచావులు ఛస్తే
ప్రాణాలకు వెలకట్టీ - ప్రజల మోసగించుతారు ॥ఏనాటికి॥

కాలంతోబాటు నువ్వు - కాలుముందు కెయ్యకుంటె
కాలుకింద నేలజారి - బోర్లపడక తప్పదురా
జడంవద్దు ఎండవద్దు - జనతాదారి మరువవద్దు
అందరమొక్కటైతేనే - ఐకమత్యమే బలమోయ్ ॥ఏనాటికి॥

సావుబతుకూ రెండూ - సమానమే అన్నోడికి
సావుసలాం చేసిందీ - బతుకు గులామయ్యిందీ
జనంకొరకు రణంచేసి - మరణానికి భయంనేర్పి
చీకటులను పెకలించీ - వేకువవై వెలగాలీ ॥ఏనాటికి॥

ధనవంతులు బలవంతులు - భగవంతులు పొగముంతలు
పెట్టిపుట్టలేదను - ఆకట్టుకథలకపటాల్నీ
గుట్టుదెలిసి బాణాన్నీ - గురిపెట్టూ దోపిడిపై
దగాకోర్ల గుండెల్లో - దడపుట్టించగ రావోయ్ ॥ఏనాటికి॥

ఆకాశం దద్ధరిల్లు ఆవేశంకావాలీ - సాగరమై ఉప్పొంగే సాహసాలు చేయాలీ
ప్రళయభయదవర్తునులై - విలయనాట్యమాడాలి
బ్రతుకు దీపమార్పేసిన - భడవాలే జడవాలీ ॥ఏనాటికి॥

త్యాగధనులు మానధనులు - సాధించిన స్వాతంత్ర్యం
మేధావులు వీరులంత - ఛేదించిన పరతంత్రం
త్రాచులు మారీచులు - ఈ నీచుల చేతిలోచిక్కి
భరతమాత భంగపడెను - సమతదారి నడవండీ ॥ఏనాటికి॥

# 11. నిజం తెలిసి తిరగబడితే..

సాంబయ్య బాబూ - నువ్ సల్లంగున్నావటయ్య సాంబయ్యబాబూ
ఏంబాగురన్నా - నువ్వెరగనిదే ముందిరన్నా ॥ఏం॥

ఏడాదీ పంటంతా - ఏటిలోగలిసీపోయే
ఇంటిలోన గింజలేదు - చిల్లిగవ్వ చేతలేదు ॥ఏం॥

అటుకిందట ఏడాదీ - అయిదొందలప్పుజేసే
ఆ అనుములు జల్లానూ - ఆ మినుములు జల్లానూ
ఆ దుక్కుదున్నినామూ - ఆ మొక్క నాటినామూ
మా బలంధారబోసీ - ఆ పొలం పనిజేస్తే
ఆ పైరు బాగపెరిగీ - అది పంటకొచ్చువేళా
టిక్కాని సినుకులేకా - సుక్కైన నీరులేకా
ఆ మొక్క జచ్చిపోయీ - ఆ మోడులేమొ మిగిలే
ఆ పైరు ఎండిపోయే - మా బతుకు మండిపోయే ॥ఏం॥

ఈ ఏడుపంటకోసం - ఇతనాలకప్పుచేసీ
మా ఆలిబిడ్డలుగలిసీ - ఏడాదిగ పనిజేస్తే
అయి మొలకలెత్తినాయీ - అయి మొక్క పెరిగినాయీ
ఆ పంట బాగపండీ - అది ఇంటికొచ్చువేళా
ఆ ఉరుములు ఉరిమాయీ - ఆ మెరుపులు మెరిసాయి
ఆ భోరుమంటువానా - అది జోరుగ కురిసిందీ
ఆ యేరుగెడ్డలన్నీ - అయి ఏకమ్మైనాయీ
మా పంటలన్ని మునిగిపోయి - కంటనీరే మిగిలినాది ॥ఏం॥

రెండేళ్ళ పంటబోయీ - తిండానికేమి లేకా
మాపొట్ట చేతబట్టీ - పట్టాణమొచ్చినామూ
ఇంటిల్లిపాది కలిసీ - ఇటికల్ని మోసినామూ

ఆ పదిరోజులు పనిచేసిన - పైసలివ్వడు కాంట్రాక్టరు ॥ఏం॥

అరె సాంబయ్య సత్తిమయ్య - చందరయ్య వెంకటయ్య
బంగారమ్మ మంగయ్యమ్మ - సర్సయమ్మ నారాయణమ్మ
పల్లెనొదిలి ఇలునొదిలి - భూమినొదిలి పుట్టనొదిలి
పట్నమొచ్చి కష్టపడిన - పస్తులేమొ తప్పదాయె ॥ఏం॥

బువ్వలేదు భుక్తిలేదు - ఎవ్వడునిన్నాదుకోడు
నీ కష్టం దోచినోడు - నిన్ను మోసగించినోడు
దోచుకునీ దాచుకునే - దోపిడోళ్ళ దేశమిదీ
నిజం తెలిసి తిరగబడితే - నీదే ఈ సంపదరా ॥ఏం॥

# 12. బదులు చెప్పవేతల్లీ!

అమ్మామా భరతమాత - అడుగుతాముచిన్నమాట
ఎదలో దొలిచేప్రశ్నకు - బదులు చెప్పవేతల్లీ ॥అమ్మా॥

అవినీతీ అక్రమాలు - ఆకలిశోకం, హింసా -
అరవైఏడేళ్ళచరిత అంతులేనిదురంతాలె
త్యాగధనుల బలిదానాల్ - ఈరీతిగ మార్చేసీ
నల్లవాడి కంటెనయం - తెల్లవాడు అనిపించిన
ఎవరమ్మా ఆ క్రూరులు - వివరంగా తెలుపమ్మా ॥అమ్మా॥

వీధికొక్క వినాయకుడు - గల్లీకొకగణాచారి
ఊరికొక్క పేరిగాడు - జిల్లాకొక జిత్తులోడు
రాష్ట్రంలో రాబందులు - దేశంలో కామందులు
నాలుగులక్షల కోట్లను - నంచుకు తినివేసినారు
వారేనోయ్ ఆ క్రూరులు - మాతృభాతృ హంతకులు ॥అమ్మా॥

మతంపేర ఖతంచేసి – మానవతను మాయజేసి
కులంపేర కుంగదీసి – జనం నుండి వేరుజేసి
స్త్రీజాతిని బానిసగా – చేసి అణగద్రొక్కెనెవరు
మూఢనమ్మకాలలోన – జాతిని ముంచేసెనెవరు ॥అమ్మా॥

కులంపేరుతో కొందరు – బలగం సమకూర్చుతారు
మతం పేర మరికొందరు – మందబలం చేర్చుతారు
స్త్రీజాతిని కుటిలనీతితో – క్రిందికి త్రొక్కినారు
ఓట్లుతోడ సీట్లు ఎక్కి – కోట్లుకోట్లు కూడబెట్టి
అసమానతలన్నిటినీ – పెంచి ప్రజలవంచించిన
వారే ఆ నీచులు – మారీచుని వంశాంకురాలు ॥అమ్మా॥

ఇంత జరుగుతున్నగాని – కొంచమైన చలించనీ
బానిస భావం యింకిన – భారతీయ ప్రజలలోన
ఎదురుతిరిగి ప్రశ్నించే – పదునులేని యువతరాన్ని
నిదురలేపి నిజంతెలిపి – కదనానికి కదిలించే
ఏదో ఒకదారి చూపి – ఆదుకొనుము ఓ తల్లీ ॥అమ్మా॥

మూఢనమ్మకాలనన్ని – మురికిగుంటలో విసిరీ
గుడులలోని సంపదతో – బడుగులనే బాగుచేసి
కాజేసిన భూములన్ని – భూమిలేని రైతుకిచ్చి
జనంసొమ్ము దోచినోళ్ళు – ధనం ప్రజలముందుబెట్టి
శ్రమజేసిన వాళ్ళంతా – సమానంగా పంచుకునీ
సమతదారి నడిసొస్తే – సమసమాజమదేనోయి ॥అమ్మా॥

# 13. మా విశాఖ!

మా విశాఖమహామంచివిశాఖా - ప్రశాంతమైనామహావిశాఖా
జనులందరినీ అక్కునజేర్చి - ఆనందంగా ఆదరించేది ॥మా॥

రష్యావారూ జపానువారూ - ఇటలీబ్రిటీషుఅమెరికవారూ
ఎవ్వరొచ్చినా రమ్మంటుందీ - ఎందరొచ్చినా స్వాగతమందీ
నాలుగుదిక్కుల వున్న ప్రజలనూ - నావారేనని ఆహ్వానించీ
విశాలహృదయపు విస్తరివేసీ - నాయకులుగ నిలబెట్టిందీ ॥మా॥

ఎండలు మండవు - వరదలు ముంచవు
దుండగులకు ఇట - చోటేలేదు
సమతకు మమతకు - లోటేలేదు
బతుకుతెరువుకీ - బాధేలేదు
కళలకు కవులకు నెలవైనాదిరా - విజ్ఞానానికి ఇది నిధి అయినదిరా
మహాకవికికి ఇది పుట్టినిల్లురా - మరోకవికి ఇది మనసైనదిరా ॥మా॥

మతకలహాలా మాటాలేదు - అన్నిమతాలకు సమానస్థానం
అందుకుసాక్ష్యం అదిగోనండీ - చర్చిమసీదు దేవాలయమూ
లక్షల ప్రజలూ నగరంలున్నా - కక్షలు కార్పణ్యాలేలేవు
అందరు కలిసీ ఆనందంగా - హాయిగ బతికేసుందరనగరం ॥మా॥

డాల్ఫిన్‌నోసూ నేవలుబేసూ - ఉక్కుఫ్యాక్టరీ ఓడరేవులూ
షిప్పుయార్డులూ పాలిమర్సులూ - సముద్రతీరపు సౌందర్యాలూ
ఓడలు బళ్ళూ తయారుఅయినా - యుద్ధనౌకలూ రిపేరులైనా
పరిశ్రమలకిది పట్టుగొమ్మరా - ప్రశాంతతకు ఇది ప్రతిరూపంరా ॥మా॥

విశాఖపై ఒక మహాకావ్యమే - రాస్తానని వాగ్దానం చేసిన
శ్రీశ్రీ కీర్తిశేషుడాయెనూ - ఆరుద్రే ఆవేదన చెందెను
రాచకొండ మన ఉత్తరాంధ్రకీ - రావిచెట్టుగా నిలిచాడండీ
మహాకవుల అపురూపశిల్పాలు - సముద్రతీరపు సందర్శనమే ॥మా॥

విశాలమైనా విశాఖనగరం - మహోన్నతులకూ మహానిలయమూ
త్యాగమూర్తులకు వీరయోధులకు - జన్మనిచ్చినా పుట్టినిల్లురా
దీని గొప్పతనమందించేటీ - సమర్థతంతా లేనివాడనూ
సమగ్రరూపం చూపలేనినా - అసమర్థతకూ మన్నించండీ ॥మా॥

మాధవధారలో స్నానంచేసీ - సింహాచలమూ కొండనెక్కితే
భీమిలి ఎర్రని దిబ్బలుచూసీ - కైలాసగిరీ సందర్శిస్తే
రవీంద్రు హృదయంద్రవింపజేసిన - ఆంధ్రవిశ్వవిద్యాలయం అందం
జనమందరితో జేజేలందిని - మన విశాఖకు జై అందామూ ॥మా॥

# 14. రాయెరాయె నాఎనకా

జారుజారుకొండలకీ పుల్లలకెళదామా - రాయెరాయె నాఎనకా మరదలమంగమ్మా
ముళ్లున్నాయంటావూ రాళ్ళున్నాయంటావూ
కాలుజారితే బతుకూ కాలవపాలంటావూ
నేనెక్కలేను మావా ఆ దిక్కుమాలి కొండా
నేనడవలేనుమావా ఈ మాయదారిఎండా! ॥రానురాను॥

బంతిపువ్వులున్నాయే - చేమంతులువున్నాయే
సంపెంగలు వున్నాయే - సన్నజాజులున్నాయే
మల్లెపువ్వులుచూసావా - ఒళ్లుపుకరిస్తాదే
కల్లమాటకాదేఇది - సల్లగనా ఎనకరాయె! ॥జారు॥

బంతిలాంటిసిన్నదాన్ని - బంతిపువులునాకెందుకు
చారెడేసికళ్లదాన్ని - చేమంతులు నాకెందుకు
మల్లిపువ్వులిష్టమైన - ముళ్ళదారినడవలేను ॥నేనెక్కలేను॥

లేడిపిల్లలుంటాయే - నెమిలిపిట్టలుంటాయే
కౌజుపిట్టలుంటాయే - మైనగోరలుంటాయే
ఛెంగుఛెంగునాఎగిరే - చెవలపిల్లులాంటాయే! ॥రానురాను॥

గుంటనక్కలుంటాయీ - గుడ్డులురిమిచూస్తాయీ
ఎలుగుబంటులుంటాయీ - ఎంటదగిలివస్తాయీ
కొండసిలువలుంటాయీ - కండలుసీలేత్తాయీ
పెద్దపులీ సూసిందా - ఇద్దరినీ మింగుతాది! ॥నేనెక్కలేను॥

గుంటనక్కలొస్తే - నేనెంటబడీ తరిమేస్తా
ఎలుగుబంటిలొస్తే - నేనెలుగుసూపిబెదిరిస్తా
కొండసిలువలొస్తే - నేబండతీసిబాదేస్తా
పెద్దపులేఒచ్చిందా - గుద్దుకుసంపేత్తానే! ॥నేనెక్కలేను॥

దాహ మేమేసినాదంటే - నీళ్లులేకసత్తానూ
ఆకలేసినాదంటే - కేకలేసిసత్తానూ
నిద్దరొచ్చినాదంటే - తూగిపోయిపడతానూ
ముళ్లురాళ్ళుచూస్తే - నా ఒళ్లుఝల్లుమంటాదోయ్ ! ॥నేనెక్కలేను॥

దాహమేస్తేనీకూ - నేదానిమ్మాపళ్లుదెస్త
ఆకలేసినాదంటే - అరిటిపళ్లుదినిపిస్త
నిద్రరొచ్చినాదంటే - నా ఒడినేపడకజేస్త
ముళ్లురాళ్లుగుచ్చుకుండ - సల్లగనిన్నెత్తుకుంట! ॥రావె॥

అబ్బా ఓ పిల్లా నువురానంటే ఎల్లా
నాగుండవుతది గుల్లా
నామనసవుతది డొల్లా
నీవురాననకే పిల్లో - నా రంగులహరివిల్లా
నువుతోడులేకపోతే నా బతుకవుతది కల్ల! ॥రావె॥

# 15. జాలారన్నా జాలారన్నా!

జాలారన్నాజాలారన్నా – జాలీగుండేనీదోరన్నా
ఏలినవారీమాటలునమ్మి – కాలేకడుపుతోపడుకున్నావా
మాయామర్మంతెలియని – వాడవురో ఓ జాలారన్నా
మాయాగాళ్ళా – పాలేబడ్డావా – మా జాలారన్నా! ॥జాలా॥

సందువాలూ – హైలేసా – ఒంజారాలూ – హైలేసా
కండావాలూ – హైలేసా – మండాపీతలు – హైలేసా
పండూగప్ప – హైలేసా – మాగారాజూ – హైలేసా
సొర్రాచేపా – హైలేసా – సూరాచేపా – హైలేసా
టైగరురొయ్య – హైలేసా – తెల్లారొయ్యా – హైలేసా
బ్రౌనూరొయ్యా – హైలేసా – అరెభామారొయ్యా – హైలేసా! ॥జాలా॥

పసుపూపారా – హైలేసా – మెత్తనిపారా – హైలేసా
కానాగడదా – హైలేసా – కవ్వలపరిగీ – హైలేసా
పెద్దాచేపలురెయ్యాలన్నీ – హైలేసా – పెద్దాఓడాపట్టుకుపోయే – హైలేసా! ॥జాలా॥

పడవామీద ఏటాకెలితే – హైలేసో హైలేసా – పట్టీసావడదొరకాలేదూ – హైలేసా హైలేసా
తెప్పామీదాఏటాకెలితే, హైలేసా హైలేసా – పిత్తాపరిగీపత్తాలేదు – హైలేసా – హైలేసా
గేలాముతో ఏటాకెలితే – హైలేసా హైలేసా – వాలూగైనాచిక్కాలేదు
బిక్కాముఖమూఏసూకోని – హైలేసా హైలేసా – బిక్కూమంటూఇంటీకొస్తే – హైలేసా హైలేసా
బువ్వాలేక బుజ్జీగాళ్ళూ – హైలేసా హైలేసా – భోరూభోరునగోలాపెడితే – హైలేసా హైలేసా
బుర్రాచెదిరీబుడ్డీకొట్టావా – హైలేసా – ఓ జాలారన్నా
దొంగాకొడుకుల – పాలాబడ్డావా నా జాలారన్నా ॥జాలా॥

ఓడారేవూకడతామంటూ – జాలరిపల్లెను కాళీజేసీ హైలేసా హైలేసా
ఉద్యోగాలూ ఇస్తామంటూ హైలేసా హైలేసా – ఊరించీ గెంటేసారూ హైలేసా హైలేసా
తట్టాబుట్టానెత్తినబెట్టీ హైలేసా హైలేసా – పడవాఒడ్డునకట్టేసేసీ హైలేసా హైలేసా
గంగానొదిలీగట్టునపడ్డావా – నా జాలారన్నా
ఆలీపిల్లలగోలేవింటావా – నా జారాలన్నా ॥జాలా॥

పల్లేనొదిలీపట్టణమొచ్చీ - కూలీచేసీబతుకుదమంటే హైలేసో
ఇంటీఅద్దెకి చాలకపోయే - ఒంటీపూటాతిండికి లేదే
ఉద్యోగాలా ఊసేలేదూ - ఉపాధికేమీ హామీలేదు
ఇదేమిన్యాయం అన్నారంటే - పదండి జైలుకి అంటున్నారు
అన్యాయానికి ఎదురుతిరిగితే - అందనిలోకం పంపించేరా
అందరినొదలిఎల్లీపోయావా - మా నూకారాజూ
అందనిలోకంకెళ్ళీపోయావా - మా నూకారాజు ॥జాలా॥

# 16. మృగాలు దిగాలుపడెనే!

ఇది మానవ సమాజమేనా - ఇది మనుషుల ప్రపంచమేనా?
ఇది వేదభూమి అంటారా - మరివేదన భూమంటరా! ॥ఇది॥

పాలుగారు పసిపాపలనైనా - కామంతో కాటేసే
ఈ నీచులు త్రాచులు - మానవజాతికి
మచ్చలురా - తుడిచేసెయ్ ॥ఇది॥

నాతిచరామీ నాలోసగమని - నీతులువల్లిస్తాడూ
చేతలలోనా జీవితమంతా - రోతను పుట్టిస్తాడూ ॥ఇది॥

ప్రేమించానని ప్రాణం నీవని - ప్రమాణాలు చేస్తాడూ
పెళ్లి చేసుకొనరమ్మంటే - అదివల్లకాదు అంటాడూ ॥ఇది॥

అగ్నిసాక్షిగా ఆలూమగలం - కడవరకూనంటాడూ
కట్నంకోసం అగ్గిలోత్రోసీ - కాల్చిపారవేస్తాడూ ॥ఇది॥

తనువూ మనసూ సమస్తమంతా - తనదేనంటాడమ్మా
తగువొచ్చిందా తన్నితగిలేసి - తలుపేసెస్తాడమ్మా
నీ కష్టానికి లెఖ్ఖలుకడితే - తీరని రుణమేనమ్మా
నీ ఇష్టానికి విలువేలేదా - తీరని నష్టమెసుమ్మా
మృగాలతో ఈ మగాళ్ళపోల్చితె - మృగాలు దిగాలుపడెనే
ఏ యుగాన కూడా నేరం చేయని - మృగాలు మనిషెటులౌనే ॥ఇది॥

# 17. కళావాణి పిలుస్తోంది!

కళావాణి పిలుస్తోంది - కదలిరా
మన కళాకారులందరికది జననిరా
కళలు జనంకోసమనీ - గళమెత్తి పాడరా ॥కళా॥

సుద్దాలాహనుమంతూ - గరికపాటిరాజాజావ్
పెన్నాగన్నాపట్టిన - సుబ్బారావ్‌పాణిగ్రాహి
వంగపండు గద్దరు - మనచెరబండా భూమయ్యా
ప్రజలకొరకె తమకళనూ - ధారపోసితరించారు ॥కళా॥

కొడూరూఅచ్చయ్యా - ఎంకన్నా అందెశ్రీ
ప్రజాకళాకారులంత - ప్రవాహమైఉరకలెత్తి
ఈవిషసంస్కృతిపైనా - విల్లుఎక్కుపెట్టారే ॥కళా॥

బుర్రకథలుహరికథలూ - జముకులకథకోలాటం
తప్పెటగుళ్ళూభజనలు - పిట్టలదొరవేషాలూ
రకరకాలకళారూప - కాంతులు వెలిగించండీ
ఆ కాంతిలొ దోపిడీని - అసలు గుట్టువిప్పండీ ॥కళా॥

పాటేపీడనపై - పోరాటమయీ దూకాలీ
ఆటే అవినీతిపైన - అంకుశమై పొడవాలీ
మాటే మంటలురేపీ - తుంటరులను తరమాలీ ॥కళా॥

ఆకలితో అలమటించు - జనమంతా జ్వాలలయీ
దగాపడిన సహోదరులు - మహాశక్తులై రగిలీ
ఇంకానా ఈ దోపిడి - ఇకపై సాగదటంచూ
సమరశంఖమూదాలీ - సమతదారి నడవాలీ ॥కళా॥

# 18. పాలోమనీ ఓట్లువేసి అలోమనీ..

అన్నలార అక్కల్లార - తల్లుల్లార చెల్లెల్లార
వందో ఏభయ్యోడబ్బుకోసమో - మందోవిందో తిండికోసమో
బూర్జువాలజెండాలను - భుజాలపై మోస్తుంటే
బతుకు తీరుమారునెట్లు - బాధలన్ని తీరునెటులా ॥అన్న॥

ఏడుకొండలెక్కుతావు - ఎంకన్నకు మొక్కుతావు
గుండును గొరిగించుకోని - గుడులచుట్టు తిరుగుతావు
బండరాళ్ళు నీ బతుకుకి - ముందుదారి చూపుతాయా
పోరుబాట పడితేనే - మారుతుంది నీ బతుకూ ॥అన్న॥

నేరగాళ్ళు రాజకీయ - బేరగాళ్ళు కలుస్తారు
దౌర్జన్యం డబ్బుతోడ - దర్జాగా గెలుస్తారు
అవకాశం అదునుచూసి - అటోఇటో మారతారు
లాభసాటి యాపారం - జోరుగ సాగిస్తారూ ॥అన్న॥

కరువు కొంపకాల్చుతున్నా - బరువుబతుకు కూలుతున్నా
కులం మతం కుళ్ళుతున్నా - అబలల హతమార్చుతున్నా
పరులసొమ్ముకురకలెత్తు - పరువులేని బేహారులు
సొంతలాభముకి తల్లిని - సంతలో అమ్మే ద్రోహులు ॥అన్న॥

అదిచేస్తాం ఇది చేస్తాం - అవినీతిని అణిచేస్తాం
తొందరలో ధరలన్నీ - కిందికి దించేస్తామని
గప్పాలను తెగకొట్టే - తిప్పగాళ్ళనే నమ్మి
పాలోమనీ ఓట్లువేసి - అలోమనీ ఏడకండి ॥అన్న॥

శ్రమజీవులహక్కులకై - నిరతము పోరును జేసీ
జనంకొరకు జీవితాన్ని - రణంలోన పణంబెట్టి
సమసమాజస్థాపనకై - సమరం సాగించుతున్న
సామ్యవాద మార్గంలో - మనమంతా నడవాలీ ॥అన్న॥

# 19. తలవంచకు మళ్లీ!

వరకట్నపుకోరలలో నలిగే నా చెల్లీ
ప్రేమోన్మాదుల చేతిలొ బలిఅయినా తల్లీ
నరకానికి చెల్లూచీటిరాయాలిక లేచిరా
క్రూరాత్ముల తీరుమార్చ పోరుసల్ప కదలిరా ॥వర॥

పుత్తడిబొమ్మంటి నిన్ను - చూస్తాడో పురుగూ
ప్రేమించక తప్పదంటు - వెంటబడీతిరుగూ
ప్రేమంటే అంగడిలో - దొరుకు సరుకుకాదోయ్
నినుప్రేమించనుపొమ్మంటే - అంతం చేస్తాడూ ॥వర॥

అందంచదువూబుద్దీ - ఆరోగ్యంవున్నా
కుందనబొమ్మైనగానీ - తెమ్మనెకట్నాలూ
వేలూలక్షలు కట్నం - చెల్లించినగానీ
చాలదింక తెమ్మంటూ - సావజంపుతాడూ ॥వర॥

తినమరిగినవాడు నిన్ను - తల్లివి అంటాడూ
సలహాలిచ్చేందుకునిను - మంత్రి అనెనుచూడూ
దివ్యసుఖాలిచ్చేనిను - దేవవేశ్యవంటాడూ
చాకిరీలు చేసేందుకు - నౌకరినీవమ్మా ॥వర॥

ఆకాశంలోన సగం - అబద్ధమేతల్లీ
భూమిమీద మగవారితొ - సమానమే చెల్లీ
పుచ్చిన నీతులునమ్మి - తలవంచకుమళ్లీ
ఇది పురుషులునీకై అల్లిన - చావు 'వలే'తల్లీ ॥వర॥

పాలిచ్చి పెంచినట్టి - తల్లినైనవాడూ
గెంజినీళ్ళు పోయకుండ - గెంటివేసెనేడూ
పెంచి పెద్దజేసినట్టి - తండ్రినైనవాడూ
వంచనతో రోడ్డుపాలు - జేసెను ఈనాడూ ॥వర॥

# 20. లేస్తే దోషికి శాస్తే!

మహామహుల త్యాగఫలం - మనదేశం స్వాతంత్ర్యం
లంచాలా పాలకులా -వంచనలో నలుగుతుంటె
చూస్తూ వూరుకుందురా - మీరంతా లేస్తే ప్రగతినందరా ॥చూస్తూ॥

భరతజాతి జన్మహక్కు - భావ ప్రకటనాస్వేచ్ఛని
నడివీధిని ప్రజలగొంతు - నలిపివేయ చూస్తుంటే ॥చూస్తూ॥

ఆయుధాల కొనుగోళ్ళే - ఆమ్యామ్యాలందాయని
సీ.ఏ.జీ. ఛీ అన్నా - సీటు ఒదిలిపెట్టకుంటె ॥చూస్తూ॥

ఎన్నికలకు ముందువారు - ఎన్నొకల్లమాటలాడి
కోటీశ్వరులనుపెంచీ - కూటికిలేకుండజేస్తే ॥చూస్తూ॥

భరతదేశ రక్షణకై - ప్రాణమొడ్డి పోరాడే
వీరులచేతిలో తుపాకి - విలువలేనిదైపోతే ॥చూస్తూ॥

మోసాలతొ వేషాలతొ - ఎంతకాలమీపాలన
వంచకులకు చోటులేదు - దించండిక గద్దెనుంచి
చూస్తే మనపనినాస్తే - లేస్తే దోషికి శాస్తే!

# 21. ఎన్నాళ్ళని ఎన్నేళ్ళని..

ఉత్తరాంధ్ర జనాలకూ - ఉత్తి చెయ్యిచూపినారు
ఇన్నాళ్ళుగ అన్యాయం - ఈరీతిగ జేసినారు
ఆ పాపం మీదేనోయ్ - పాలకులారా ॥ ఛల్ ॥

ఆ లోపం మీదోనోయ్ - ఏలికలారా ॥ఉత్త॥

హక్కులకై ఏనాడూ - అడగలేదుమిమ్మలినీ
చిక్కులెన్ని ఎదురైనా - ఎక్కలేదు రోడ్డులీ
కరువుకాటకాలొచ్చిన - కలవలేదుమిమ్మలినీ
ఖర్మంటూ కడుపులోన - కాళ్ళుపెట్టిపడుకున్నం ॥ఉత్త॥

తాగునీరు సాగునీరు - తగినంతగ లేనేలేదు
ప్రోజెక్టులు కట్టమనీ - పోరు మేము చేయలేదు
గోదావరిక్రిష్ణవంటి -జీవనదులు లేవుమాకు
వానపడితె తప్పమాకు - చేనుపండె దిక్కులేదు ॥ఉత్త॥

ఎన్నాళ్ళని ఎన్నేళ్లని - ఈ బానిసబతుకులనీ
కళ్ళు తెరిచి పేదరికపు - కారణాలు తెలుసుకొనీ
ఉత్తరాంధ్ర ప్రజలంతా - ఉరుములయీ ఘర్జించీ
కార్మికకర్షకులంతా - కదంతొక్కి కదిలినారు ॥ఉత్త॥

(15.1.11)

# 22. ఓ కళాకారులారా!

కళాకారులారా - ఓ కళాకారులారా
దీనజనమనోరంజిత - సుధాకారులారా
కళ అన్నది కాసులతో - వెలకట్టగలేనిదనీ
శ్రమజీవులబాధలన్ని - ఎలుగెత్తిచాటాలీ! ॥కళా॥

ఆకలితోశోకంతో - అణగారినఅనాధలకు
యుగయుగాలఅజ్ఞానపు - అంధకార చాందసులకు
నరనరాన మతమౌఢ్యం - ప్రవహించే మూర్ఖులకూ
జ్ఞానప్రభలనేపంచీ - సమతవెలుగునింపాలీ! ॥కళా॥

మీ ఆటలు మీ పాటలు - మీ కవితలు మీ కళలూ
మీ హావం మీ భావం - మీ వాయిద్యపునాదం
పీడితులకు తాడితులకు - దగాపడినసోదరులకు
అంకితమైపోవాలీ - అండదండ కావాలీ! ॥కళా॥

నిరుద్యోగయువకులకూ - నిరుత్సాహయువతులకూ
వరకట్నపుజ్వాలలో - ఆహుతయే అబలలకూ
వెన్నుతట్టిదన్నునిలిచి - వెతలకారణాలుతెలిపి
సమసమాజస్థాపనకై - సహచరులైనిలవాలీ! ॥కళా॥

# 23. స్వాములోర్లమండీ!

స్వాములోర్లమండీ - మాసంగతి మీరెరగరండి ॥స్వా॥

ప్రజలు చేయుపాపాలను - ఒదలగొట్ట వచ్చినాము
బొందితోనె కైలాసం - పొందుదారి చూపుతాము ॥స్వా॥

ఐపీలను పెట్టేసీ - ఆలిపిల్లల్నొదిలేసీ
కాషాయం కట్టేసీ - కాశీకి చెక్కేసీ
కామాన్నీ క్రోధాన్నీ - కత్తులతో నరికేసీ
సంసారం ఒదిలిపెట్టి - సన్యాసులమైనామూ ॥స్వా॥

హిమాలయాలెల్లినాము - మహిమలెన్నొపొందినాము
గజకర్ణాగోకర్ణా - టక్కుటమారపు విద్యలు
చిటికెలోనె నేర్చినాము - శివుని కూడ చూసినాము ॥స్వా॥

యాగాలను జరిపిస్తాం - యజ్ఞాలను చేయిస్తాం
హెూమాలను జరిపించీ - దోమలహతమార్చుతాము
భంభమ్మని అన్నామా - బంగారమెవస్తుందీ
అబ్రకదబ్రన్నామా - అదిరిపోవుదెయ్యాలే ॥స్వా॥

మంత్రించీ బూడిదిస్తె - మంత్రి పదవి ఒస్తుందీ
పూజచేసి పండిస్తే - పుత్రులెపుడతారండీ
తావీజుకొటిచ్చానా - రోగమొదిలిపోతుందీ
దీవించానంటే - శ్రీదేవి కూడా వరిస్తుంది ॥స్వా॥

గాలిని భోంచేస్తామూ - నీళ్ళను ఒదిలేస్తామూ
చెప్పులేవిలేకుండా - నిప్పులపై నడిచామూ
పాదసేవ చేసుకోండి - పాపాలను కడుగుకోండి
పాలుపళ్ళు పరమాన్నం - నేతిగారెలిచ్చుకోండి ॥స్వా॥

పాదపూజకైతే - పాతికవేలే చాలండీ
పడకపూజకైతే - పదివేలైనా చాలండీ
ఇంటికి వచ్చామంటే - ఇరవైవేలేనండీ
కన్నెసేవకైతే - ఇకకాసుల పనిలేదండీ ॥స్వా॥

మీ ఆకలిదరిద్రాలు - పూర్వజన్మపాపాలూ
ఖర్మఫలితమెవ్వరినీ - కనికరించి ఒదలదండి
స్వాములపాదాలె మీకు - స్వర్గానికి ద్వారాలూ
కాళ్ళపైన సాగిలపడి - కళ్ళుమూసి మొక్కండీ ॥స్వా॥

# 24. తెలిసికూడ వూరుకుంటె..

భయంలేదు భయంలేదు సోదరా
ఇక జయంమనది జయంమనది కదలిరా
ఈ నీతిలేని సమాజాన్ని మార్చగా
ఇక భీతిలేదు జాతిని మేల్కొలపరా ॥భయం॥

త్యాగధనులు సాధించిన ఫలితమూ
ఈ భోగఘనులు భోంచేసే వైనమూ
నీవు తెలిసికూడ వూరుకుంటె ద్రోహమూ
అది జాతిజనులకే తీరని శాపమూ ॥భయం॥

టీవీసినిమాలె నేటి యువతనూ
పెడత్రోవపట్టు మార్గాలే నేర్పునూ
ఆ తారల ఆరాధకులుగ మారితే
మీ జీవితాలు చీకటి అయితీరునూ ॥భయం॥

ఆకలి అజ్ఞానములో దేశమూ
ఈ దోపిడి స్వార్థములో మన సంఘమూ
కారణాలు తెలియని ఈ లోకమూ
రాతిబొమ్మలకే చేతులెత్తి దండమూ ॥భయం॥

జీనుప్యాంటు సూటుబూటు వేషమూ
ఆ దేవుడికొక రంగు గుడ్డ రూపమూ
టెంకాయల లంచాలతొ బేరమూ
నీకొరిగేదేమీ లేదోయ్ నేస్తమూ ॥భయం॥

మానవతను మంచిని స్థాపించగా
నీజారుతున్న కంటినీరు తుడుచుకో
ఇకదారిలేదు సంగ్రామమె మార్గమూ
ఆ సమరంలో మనదేనోయ్ విజయమూ ॥భయం॥

(18/8/12)

# 25. అనగనగా..

అనగనగా ఒక గొప్పదేశమూ - అశోకుడేలిన దివ్యదేవమూ
భరతుడేలినాభవ్యదేశమూ - బుద్ధుడుపుట్టిన పవిత్రదేశం
భారతదేశం దానిపేరురా - భావిపౌరులారా వినండీ ॥ భావి ॥

ఆ దేశానికి రాజధానిగా - ఢిల్లీనగరం పేరు గాంచెరా
ఢిల్లీ పేరూ విన్నవారికీ - గుండె గుభిల్లుమనుటే ఖాయం
దోపిడీలకూ దొంగతనాలకు - మానభంగాలు మగువలహత్యలు
అన్యాయాలకు అక్రమాలకూ - నిలయము యీ అలజడిరేగేరా
రాజులు ఏలిన రోజులుపోయీ - ప్రజాస్వామ్యమే ఒచ్చిందంటా
ప్రజాస్వామ్యమనుపేరేగాని - ప్రజలకు స్వామ్యం శూన్యమేనటా
ప్రజాస్వామ్యమును - ప్రభుస్వామ్యంగా మార్చివేసినారో నాయినా ॥ అ ॥

భారతదేశపు తొలిప్రధానిగా - నెహ్రూగారిని ఎంచుకున్నరట
నెహ్రూకూతురు ఇందిరగాంధీ - ఇందిర కొడుకు రాజీవ్‌గాంధీ
రాజీవ్ కొడుకూ రాహులుగాంధీ - రాహులు తల్లీ సోనియాగాంధీ
వారసత్వపూ తీరునుజూడూ - హస్తంపాలనరో నాయినా ॥ అ ॥

తోలుబొమ్మలా మంత్రులజూడూ - దేశందోచే ప్రభువులజూడూ
సోనియగాంధీ నడిపించే - ఆ కీలుబొమ్మ మన్మోహనుజూడూ
మహాత్మగాంధీ మళ్ళీవస్తే - మన్మోహనుడీ పాలనజూస్తే
రైతులకంటే తానేముందుగ - గంగలోన దూకో నాయినా ॥ భావి ॥

గాంధీ పేరుతొ బ్రాందీలమ్మే - గాడ్సేగాళ్ళ ఘరానజూడూ
నోటులతోనూ ఓటులుకొంటూ - అడ్డదారిలో అందలమెక్కి
పేదసాదలాపొట్టలుగొట్టీ - కోట్లకు కోట్లూ కూడబెట్టుకుని
ప్రజాస్వామ్యమును ఖూనీచేసిన - రజాకారులండో నాయినా ॥ అ ॥

# 26. ఎంతకాలం చింతబతుకులు?

భరతదేశం భగ్గుమంటోందీ మా అన్నలారా
బతుకురోజా నరకమౌతుందీ ఓ చెల్లెలారా ॥భరత॥

నరుల రక్తం రోడ్డుమీదా వరదలయ్యీ పారుతుంటే
నవ్వుతూ పైకెళ్ళినోడూ దివ్వెలాగా ఆరిపోతే ॥భరత॥

కంటికీరెప్పల్లెసాకీ - పెంచిపెద్దను జేసినామూ
అప్పుసప్పూజేసినామూ - గొప్ప సదువులు నేర్పినామూ
పెద్ద ఉద్యోగాలు జేసీ - ఉద్ధరిస్తాడనూకుంటే
ముద్దులానా కొడుకునేమో - మూటగట్టీ పంపినారూ ॥భరత॥

ఆకలేసీ హొటలుకెళ్లీ - అల్పహారం తినగబోతే
ఢాం అంటూ బాంబుపేలే - గోళీలాగా ఎగిరిపోయే
ఒళ్ళుతూట్లై చిల్లులైతే - ఒల్లకాటికి పయనమైతే
తల్లడిల్లిన తల్లిగుండె - ఝుల్లుమంటూ ఆగిపోయే ॥భరత॥

మతముమత్తూ తలకుఎక్కీ - మానవత్వం మంటగలిపీ
దారుణాలకు పూనినారూ - దాడులెన్నో జేసినారూ
కల్లకపటం ఎరగనోళ్లీ - మాయమర్మం తెలియనోళ్లీ
మతంపేరిట ఖతంజేసీ - మనుషులను హతమార్చినారూ ॥భరత॥

మంత్రులొచ్చే వింతజూసే - సానుభూతీ చాలజూపే
ప్రాణములకే వెలనుగట్టీ - ప్రకటనల్నే జేసినారూ
క్రూరులను వేటాడిపట్టి - ఘోరశిక్షలువేస్తమంటూ
భీరములు ఎన్నెన్నో పలికీ - నేరుగా ఢిల్లీకి జారే ॥భరత॥

దినముదినమూ గండములతో - క్షణము క్షణమూచచ్చి బతుకుతు
ఎంతకాలం చింతబతుకులు - ఈడ్చుకుంటూ వేగుతాము
ఏలినోళ్ళా ఆగడాలను - ఎత్తిచూపీ ఎదురునిల్చీ
భారతీయా పౌరులారా - వేగుచుక్కై వెడలిరండీ ॥భరత॥

# 27. అరరే మనువాదులారా!

అరరే మనువాదులారా - మానవతకు మచ్చలార
అంటరానివాడినంటె - మంటరగులుతుందిరో
అరే ఒరే అంటెనాకు - అగ్గిరాజుతుందిరో
అంబేద్కరు వారసులూ - అడుగుతుంటె బదులేదీ ॥అరరే॥

పెంటదినే కుక్కనేమొ - సంకనెత్తుకుంటారూ
అన్నంతిను మనిషినేమొ - అవతలుండమంటారూ
చదువుకు దూరంజేసీ - తెలివికి తలుపులు మూసీ
విద్యలేని పశువునని - బుద్ధిలేని పలుకులేల! ॥అరరే॥

ముసలిబ్రహ్మకొకనాడూ - ప్రసవం అయినాదంటా
ముఖంనుండి బాపనోళ్ళు - భుజంనుండి రాజుగోర్లు
కడుపునుండి కోమటోళ్ళు - కాళ్ళనుండి శూద్రపోళ్ళు
పంచములేలాగపుట్టె - వంచకులారా దెల్పుడు ॥అరరే॥

మూతికొక్కముంతగట్టి - చేతికొక్కచిప్పయిచ్చి
వీధిచివర అరిచేటీ - వింత జంతువును జేసీ
వెనకతాటి ఆకుగట్టి - పూరవతల కెళ్ళగొట్టి
భూమి నంతదోచి మమ్ము - బుగ్గిపాలు జేసినారు ॥అరరే॥

మీపొలములో పనిజేసీ - మీ పైరుకి ఎరువువేసి
గరిసెలకొలదీ ధాన్యం - రాసులు ఇంటిలోపోస్తే
గెంజికొరకు మీ వాకిట - గింజుకునే బతుకుజేసే ॥అరరే॥

మీ మురికిని ఎత్తినాము - మీకుళ్ళును కడిగినాము
కాళ్ళకి చెప్పులు జేసీ - ఇళ్ళకు కప్పులు వేసీ
కంటికి నిద్దురాలేకా - సంపద కాపాడినాము
కాటికెళ్ళి నాపిదపా - నీ కట్టెను కాల్చినాము ॥అరరే॥

# 28. మర్మం చెబుతాను రార?!

అప్పారావు అన్నయో, ఆంథోనీ తమ్ముడా
అబ్దులు ఖాదరు భాయీ, అందరు ఇటురండిరో ॥అప్పా॥
హలంపట్టి దున్నినోడ పొలం నీకు లేదురో ॥పొలం॥
పంటలు పండించినోడ పస్తులుందువేమిరో ॥పస్తు॥
గింజలు పోగెట్టినోడ గెంజినీకులేదురో ॥గెంజి॥
ఖర్మరాబాబు మా ఖర్మరా బాబూ
ఖర్మంకాదుర దానీ మర్మం చెబుతాను రార ॥అప్పా॥
కారులన్ని జేసినోడ కాలినడకె నీకురో ॥కాలి॥
ఇంజనులూ దిప్పినోడ ఇబ్బందులు ఏలరో ॥ఇబ్బ॥
మేడలన్ని గట్టినోడ గూడు నీకు లేదురో ॥గూడు॥
ఖర్మరాబాబు మా ఖర్మరా బాబూ
ఖర్మంకాదుర దానీ మర్మం చెబుతాను రార ॥అప్పా॥
బట్టలన్ని నేసినోడ కట్ట గుడ్డలేదురో
బంగారం జేసినోడ క్రుంగిపోయినావురో ॥క్రుంగి॥
సంపద సృష్టించినోడ చతికిలబడ్డావురో ॥చతికిల॥
ఖర్మరాబాబు మా ఖర్మరా బాబూ
ఖర్మంకాదుర దానీ మర్మం చెబుతాను రార ॥అప్పా॥
కులంలేదు అంటావూ మతం లేదు అంటావూ
ఖర్మం కాదంటావూ మర్మమున్నదంటావూ
మర్మమేదొ చెప్పవయ్యా మంచిదారి చూపవయ్య
మార్క్సిస్టూ సోదరా నువ్ మర్మమేదో తెలపరా ॥అప్పా॥
రేయ్ ! భూమినంతదోచినోళ్ళు బుగతలు అయ్యారురో
బుగతలుకాలం మారీ బూర్జువలయ్యారురో
బూర్జువాల భూస్వాముల బూజుదులపరండిరో
భూమికొరకు భుక్తికొరకు భుజం భుజం కలపరో
కూడులేని గూడులేని కూలన్నలు ఏకమైతే
కూలిపోవు నీ ఖర్మం తెలిసిపోవు నా మర్మం ॥అప్పా॥

( బి.ఏ. నారాయణరావు )

# 29. ఏందిర ఎంకన్నా!

ఎగాదిగా చూస్తావూ - ఏందిర ఎంకన్నా
సగం చిక్కిపోయావూ - సంగతి ఏందన్నా
దిగులు ముఖంపెడతావూ - దిక్కులు చూస్తుంటావూ
దేవుడిపై భారమేసి - బావురుమంటుంటావు ॥ఎగా॥

ధాన్యం ధర పెంచమంటె - శూన్యం చూపించినారు
బియ్యం ధర పెంచి ప్రజకు - భయ్యం కలిగించినారు
పప్పుల ధర పెంచమంటె - నిప్పులు కురిపించినారు
పప్పు ధరలు పెంచి ప్రజల - తిప్పలెన్నొ పెట్టినారు ॥ఎగా॥

ఉల్లిపాయల ధరలుపెంచి - కల్లోలం రేపినారు
చెరుకుధరను పెంచమంటె - కరుకుదనం జూపినారు
పంచదార ధరలు పెంచి - వంచనెంతో జేసినారు ॥ఎగా॥

నీదగ్గర పదికికొనీ - ప్రజలకు ఏభైకమ్మితె
నిలువుగుడ్లు వేసుకొని - నిశ్చేష్టుడవైనావూ
రైతుకు ధర యివ్వమంటె - రైఫిళ్ళను పేల్చినారు
దళారులా రాజ్యంలో - దగా నీకు తప్పదన్నా ॥ఎగా॥

ఎరువుల ధరజూస్తుంటే - తిరుగుతాయి కళ్ళునీకు
పురుగులమందేనీకూ - పరమాన్నం అవుతుందీ
తడిసిపోయి ధాన్యమంత - మొలకలెత్తిపోతుంటే
ముక్కిపోయి గోధుమలూ - మూలనుపారేస్తుంటే
పేదలకూ పంచమనీ - పెద్దవారు చెపుతున్నా
అన్యాయపు పాలకులూ - అసలు కుదరదన్నారూ ॥ఎగా॥

రైతులనూ చంపేటీ - రాజ్యమేమి రాజ్యమూ
నేతన్నల హతమార్చే - నేతలేమి నేతలూ
పేదలనూ రుపుమాపె - పెద్దలేమి పెద్దలూ
ఎదిరించి నిలవకుంటె - ఎవ్వరిమీ మిగలమోయ్ ॥ఎగా॥

# 30. జంభైలో జాలారన్నా..

జంభైలోజాలారన్నా - కష్టమంతా కడలీపాలే
పొద్దూదూరకముందూ నువ్వూ - హైలెస్సో హైలెస్సా
నిద్రానుండీ లేచీపోయి ॥హై॥ పడవాతెడ్లూవేసుకోనీ ॥ హై ॥

చేపలు నువ్వూ పట్టాబోతే ॥ సంద్రంలోనా చేపాలన్నీ
మరపడవల వాళ్ళేరుకుపోతే ॥హై॥
ఉసూరుమంటూ పరిగెలతోనే ఊరికి తిరిగీ ఒచ్చీనావా ॥ హై ॥

తెచ్చిన పరిగలు బజారులమ్మితె - పచ్చడిమెతుకులురాలేదాయే
ఆలీపిల్లలు పస్తూలాయే - కట్టాగోచే మిగిలీపోయే
చద్దామంటే చంటీదుందీ - భార్యాబిడ్డలు భారామైతే
బతుకూ తెరువూ కరువైపోతే - బండెడు దుంఖంగుండెలునిండె ॥ జం ॥

గంగాతల్లికి దండామెట్టీ - కళ్ళానిండా ఆశలుపెట్టీ
మళ్ళీ పడవాకెళ్ళీనాడూ - చిన్నావలనే విసిరీనాడు
పెద్దచేపే చిక్కీనాదీ - లాగాలేకా లాగాలేకా
పట్టాలేక పట్టాలేక - పట్టూకోనీ పడవాలేసీ
పట్టరానీ ఆనందంతో - పాటాలెన్నొ పాడుకుంటూ
పడవా జోరుగ నడుపూకుంటూ - ఊరుకేసీ ఉనికీనాడూ ॥ జం ॥

ఉత్తరదిక్కున ఉరేమే ఉరిమే - దక్షిణ దిక్కున మెరుపే మరిసే
పడమటి దిక్కున గాలవీచే - పడవా గిరిగిర తిరిగీపోయే
కండాబలమూ కూడదీసీ - గుండేబలమూ గట్టీజేసీ
వడిగా తెడ్డూ వేసీనాడూ - హోరున గాలీ భోరునవీచే
తాడీఎత్తున కెరంటం లేచే - పడవను ముంచీవేసినాదీ
గంగాకడుపున జాలారన్నా - గంగాదరినీ కాళీపడవా ॥ జం ॥

కళ్ళలోనా ఒత్తులేసుకొని - పెళ్లాంపిల్లలు ఒడ్డునవుంటే
కటికా చీకటికమ్ముతువుంటే - భోరున వానా కురుస్తువుంటే
కానారాడూ జాలారన్నా - కన్నీరేమో సంద్రామయ్యే
జాలారన్నతొ లోకామనీ - జాలారమ్మా నీటిలొ కలిసె
జంభైలోజాలారన్నా - నీ బతుకూ నీటీపాలే!

# 31. స్వతంత్రమేరాలేదని..

ఊగరా ఊగరా ఉయ్యాలా ॥ నువ్వూగితే శత్రువులే జడవాలా

ఓ వీరుల వారసుడా - నిరుపేదల స్నేహితుడా ॥2॥
ఆ అమరువీరులాశయాల్ని - సాధించర భాస్కరుడా ॥ఊ॥

జనం కొరకు జీవితాన్ని - పణంగానే పెట్టినట్టి
పోరుబాటలో సాగిన -వీరుని ప్రతిరూపమా
మా ఆశల స్వప్నమా -మార్పుకి సంకేతమా
కూటికైన లేనివాళ్ళ - గూటిలోన దీపమా ॥ఊ॥

కుతంత్రమే తప్ప మనకు - స్వతంత్రమేరాలేదని
విప్లవకవి ఆనాడే - విప్పిచెప్పినా డోయీ
కప్పల రాజ్యానికి - సర్పాలే నాయకులైతే
భక్షించుటయే తప్పా -రక్షించుట కల్ల కదా! ॥ఊ॥

పదవికొరకు సంతలోన - పశువులైన పెద్దలనీ
నీతినిజాయితిని బట్టి - పాతరేసెలో కాన్నీ
కులంమతం రొంపిలోన - కుళ్ళుతున్న సంఘాన్నీ
కడిగేయగ రావోయ్ -నువు కడతీర్చగ రావోయీ! ॥ఊ॥

భగత్సింగు బాటలోన - భగ్గుమంటు లేవరా
రాజగురువు సుఖదేవుల - రగులు తేజమయ్యిరా
అల్లూరిగ ఆజాదుగ -అగ్గిని కురిపించరా
కొమరం భీమునిమల్లే - సమరంలో దూకరా! ॥ఊ॥

అనాధలకు అభాగ్యులకు - అండగనువు నిలవాలీ
వెనుకబడ్డ వారికొరకు - ముందునీవు నడవాలీ
దగాపడిన సహోదరుల - దన్నుగ నీవుండాలీ
సమతా మమతలు పెంచీ - జనతను నడిపించాలీ ! ॥ఊ॥

# 32. బాపూజీ నువ్ కోరిన సంఘం!

ఇదేమి దేశం చెల్లీ ఇదేమి రాజ్యం ॥2॥
మగువలమానం ప్రాణము దోచీ – మంటలో వేసే క్రూరులదేశం ॥ఇదేమి॥

సహగమనాలా పేరులు బెట్టీ – సతిగా కాల్చిరి ఆనాడూ
వరకట్నాలా ప్రేమలపేరిట – దహనం చేసిరి ఈనాడూ ॥ఇదేమి॥

అపరకీచకులు హాయిగ తిరిగే – వికృతమైనది ఈ దేశం
హంతకవంచక హింసాత్ములతో అలరుతున్నదీ మనదేశం ॥2॥
వేదభూమిలో మహిళల వేదన – వినిపిస్తుందా ప్రభువులకూ
కంచే చేనును కబళిస్తుంటే – కనిపిస్తుందా ఏలికకూ ॥ఇదేమి॥

ఆడదిబైటికి వెళ్లిందంటే ఆందోళన చెలరేగేనే
మళ్ళీ ఇంటికి చేరేవరకూ – ఒళ్ళూ మనసూ ఒణికేనే
బాపూజీ నువ్ కోరిన సంఘం – బావురుమంటున్నది చూడూ ॥ఇదేమి॥

ప్రేమ పేరుతో ఏసిడ్ పోసీ – ప్రాణం తీసేదొకడూ
అనుమానం పెనుభూతం సోకీ – అంతం చేసేదొకడూ
ఎన్నిచేసినా వెన్ను విరుచుకుని – తిరుగుతువున్నా డింకొకడూ ॥ఇదేమి॥

వందల సంఖ్యలొ మందబుద్ధులూ – అందలమెక్కిననాడూ
న్యాయం ధర్మం బందీలై – అన్యాయం గెలిచెను నేడూ
అందరు ఒక్కటై ఎదిరించనిదే – ముందుకు సాగదు సంఘం
స్త్రీ కన్నీరే పొంగిందంటే – శిథిలమ్మవునూ దేశం ॥ఇదేమి॥

(డిశంబర్ 16, 2012న ఢిల్లీలో జరిగిన అత్యాచార ఘటనకు స్పందన)

# 33. సుందరయ్యా వందనమయ్యా!

సుందారయ్యా - వందనమయ్యా
డెందములోనిను మరువామయ్యా
అణగారిన ప్రజకండగ నిలిచిన
అమరవీరుడా జోహారయ్యా ॥సుందరయ్యా॥

చిరుతప్రాయమునందె - సమతకొరకైనిలిచి
పీడితుల తాడితుల - పెన్నిధివి అయ్యావు
ఆకలన్నా వారికండగా నిలిచావు
శోకమేలేనట్టి లోకమే స్థాపించ ॥సుందరయ్యా॥

కార్మికుల కర్షకుల - కలిసికట్టుగనుంచి
దోపిడీదారులను - రూపుమాపగనెంచి
భరతజాతికి మంచి - భవితవ్యమునుపంచ
ఘనతవహియించినా - ఘనుడవేనీవయ్యా ॥సుందరయ్యా॥

మతతత్వశక్తులతొ - మితవాదతొత్తులతొ
అతివాద దుందుడుకు - అసమర్థవీరులతొ
గతితప్పనీగొప్ప - పోరాటమునుజేసి
మతిమంతులతొనీవు - స్తుతులందినావయ్య ॥సుందరయ్యా॥

జనతా ప్రజాస్వామికా - విప్లవంకొరకు
జనులందరినిచేర్చి - కూర్చి నడిపించావు
ఊపిరున్నావరకు - ఉద్యమాలనునడిపి
దీనజనులకునీవు - దీపమయ్యావయ్య ॥సుందరయ్యా॥

# 34. రండోయి రండోయి!

రండోయిరండోయి – భారతీయువతా
మనదేశగతకీర్తి – మరల సాధించా
వీరులను తలపోసి – ధీరులను స్మరియించి
క్రూరులను ద్రోహులను – తరిమికొట్టంగా ॥రండోయి॥

భరతమాతనుబట్టి – బందీనిజేసినా
ఆంగ్లేయుగుండెల్లో – అగ్గిపిడుగయ్యినా
అల్లూరిమనవాడు – అది మరువకోయీ
మళ్ళీవెనుకకుజూచి – మహనీయులను దలచి
అమరవీరుల కీర్తి – ఇనుమడింపగజేయు ॥రండోయి॥

చిరుతప్రాయమునందె – చిరునవ్వుచిందిస్తు
భరతదేశముకొరకు – ఉరికంబమెక్కినా
భగత్‌సింగునిగన్న – వీరభూమోయ్‌నీది
నాటిశూరులమాట – ఏలమరిచావయ్యా
త్యాగమూర్తులబాట – ఏలతప్పారయ్యా ॥రండోయి॥

నారుపొయ్యనివాడ – నీరుపెట్టనివాడ
నాభూమిపైనీకు – ఎవడిచ్చెరాహక్కు
కప్పమేగట్టనని – కళ్ళెర్రగాజేసి
ఉక్కు గొలుసులుద్రెంచి – ఉగ్రుడైలేచినా
కట్టబ్రహ్మనవీర – పాండ్యుడేమనవాడు ॥రండోయి॥

ఆనాటివీరులూ – ఈనాడులేరా
ఈనాటి దౌష్ట్యాన్ని – ఎదిరించలేరా
నీతినీన్యాయాన్ని – పాతరేసినవార్ని
సత్యాన్ని ధర్మాన్ని – గొంతునొక్కినవార్ని
ఆటకట్టించగాలెండోయీ – వేటసాగించగారండోయీ

# 35. దినదినమూ పోరాటమె!

వాసుపిల్లి ఎల్లయ్యో – దొలపిల్లి దాలయ్యో
చింతపల్లి చిన్నయ్యో – మైలపిల్లి మల్లయ్యో
చోడపిల్లి నూకరాజు – చావుమరిచిపోయినార ॥వాసు॥

ఉద్యోగాల్‌కావాలని – ఉద్యమాలు చెయ్యలేదు
బ్రతుకుతెరువుచూపమనీ – బ్రతిమాలీఅడగలేదు
తల్లిపాలు త్రాగెహక్కు – ఒల్లకాదుపొమ్మంటే
కత్తాలూతీసిమీరు – కదనానికి కదలండిర ॥వాసు॥

ఎండనకావాననకా – రాత్రనకాపగలనకా
చెరువులుకుంటలలోనా – బీలభూమిలోతుల్లో
గంగతల్లికడుపులోన – తిరుగాడే మత్స్యాలను
పట్టుకునీ జీవించే – వృత్తిమనది హక్కుమనది ॥వాసు॥

వుండడానికిల్లులేక – గుడిసెలోన తిండిలేక
సముద్రాన్ని నమ్ముకునీ – ప్రాణాలను ఒడ్డుకునీ
సుడిగాలీ కెరటాలలో – దినదినమూ పోరాటమె ॥వాసు॥

ప్రాణాలను పణంబెట్టి – వేటాడీ చేపతెస్తె
పూటతిండికైనరాదు – బతుకు భయంపోనెపోదు
సముద్రాన్ని అమ్మేసీ – బీలభూమిలాగేసీ
ఉపాధినే ఊడగొట్టి – సఫాజేయబూనినారు ॥వాసు॥

# 36. అదిగదిగో ఒస్తున్నాయ్!

అదిగదిగో ఒస్తున్నాయ్ – అమెరికోడి దుకాణాలు
వాలుమార్టుపేరుతోడ – గోలుమాలు చేస్తాయి
ఇండియాలో పేదలకీ – ఇబ్బదులుపెడతాయీ ॥అదిగదిగో॥

అమెరికోడి అరిటికాయ – బ్రిటీషోడి బీరకాయ
జపానోడి జామికాయ – చీనావోడి చింతకాయ
అర్ధరూపాయ్ సరుకుదెచ్చి – అద్దాలాలోనబెట్టి
అయిదురూపాయ్‌లంటాడూ – అందరినీముంచుతాడు ॥అదిగదిగో॥

వాసుపిల్లి ఎల్లయ్యా – ఒంజిరాలు పట్టిదెస్తె
వారానికి వందిచ్చీ – తాగేందుకు మందిచ్చీ
వంజిరాన్ని వందకుకొని – అందంగా ప్యాకుజేసీ
వాలుమార్టుసీలువేసి – వేయిరూపాయ్‌లంటాడూ ॥అదిగదిగో॥

కష్టపడీ కౌలురైతు – కాయిగూరలు పండిస్తే
పంటకి ముందే రైతుకి – పైసలతో ఎరవేసీ
పదిరూపాయలసరుకుకి – రూపాయ్‌చేతిలోపెట్టీ
వాలుమార్టు స్టిక్కరేసి – వందరూపాయ్‌లంటాడూ ॥అదిగదిగో॥

పొరుగింటీ పుల్లకూర – బలేరుచిగ వుంది చూడు
పత్తిని పదికమ్మేసీ – బట్టకి వెయ్యిస్తామూ
తేయాకూ కాఫీలను – తెగనమ్మి మన శ్రమనూ
బ్రూకు బాండుపేరుతోడ – బుద్ధిలేక కొంటామూ ॥అదిగదిగో॥

యాపారం పేరుమీద – మీ శ్రమనే దిగమింగా
మళ్ళీ వస్తున్నారోయ్ – మాయదారి తెల్లోళ్లూ
నల్లనాయకులెవారికి – స్వాగతాలు పలికినారు
కళ్ళుమూసి కూర్చుంటే – వల్లకాడె మన బతుకులు

# 37. నాగరికత ముసుగుల్లో..

నాగరికత ముసుగుల్లో నాగుల్లారా
మానవతుల కాటేసే త్రాచుల్లారా
ఈజాతికి మీతోనె కద చిక్కూ
ఇక బతికేందుకు లేదు మీకు హక్కూ ॥నాగరి॥

పసిపిల్లపై కూడా - పాపాలకు ఒడిగడితే
పండు ముసలిపైకూడా - దుండగాలు చేసేస్తే
జంతువులూ కూడమిమ్ము - వింతగ చూస్తున్నాయీ
మనుషులలో నిముసమైన - మసలుట తగదన్నాయీ ॥నాగరి॥

ప్రేమంటే త్యాగంరా - ప్రేమే నిస్వార్థంరా
ప్రేమంటే వెన్నెలలా - హాయిగ రావాలోయీ
ప్రేమ యిస్తె ప్రేమవచ్చు - కాముకులారా!
ఆ ప్రేమ విలువ ఉన్మాదికి - తెలిసేదెటులా? ॥నాగరి॥

అదిరించీ బెదిరించీ - అత్యాచారం చేస్తే
యాసిడ్‌తో కత్తులతో - అంతం చేయగచూస్తే
స్త్రీజాతిని పీడించే - చీడపురుగులైవుంటే
ఛీకొట్టును ఈ జగతీ - చివరకు జైలే మీగతి ॥నాగరి॥

లోకమంత ఆడవారి - ఆర్తనాదమే వినబడె
దేశమంత మహిళల - కన్నీటితోడనేనిండెను
ఏ దేశం మగువలనూ - ఏడిపించి హింసించునొ
ఆ దేశం నాశనమే - అయితీరును అది నిజమూ ॥నాగరి॥

# 38. విన్నవిస్తాం చిన్నమాట!?

భారతీయ సోదరుల్లారా – భావితరాలకు సారధులారా
ఆలకించి ఆలోచిస్తే – విన్నవిస్తాం చిన్నమాట ॥2॥

పొట్టలో పోసేపాలను – పుట్టలోనా పోసేస్తుంటే
పుట్టలోనున్నపామూ – గట్టుపైనా బుసకొడుతుంటే
చేతులు జోడించి – నిలబడతారా
కాళ్ళకిపనిజెప్పి – పరుగెడతారా
ఆహారాలను మట్టిలోపోసీ – ఆచారాలను సాగిస్తారా!? ॥భారతీయ॥

హరిహరులు ఇద్దరు కూడా – మగవారేనూ కాదంటారా
ఇద్దరూ మగవారి మధ్యా – బిడ్డలెట్లాపుడతారోయీ
దున్నపోతు ఈనిందంటే – జున్నుతెమ్మనీ గోలెడతారా
కట్టుకథలా గుట్టునువిప్పీ – నిజముకోసమూ నిలదీస్తారా ॥భారతీయ॥

బల్లి ఏదో పలికిందానీ – పిల్లి ఎదురుగా వచ్చిందానీ
నల్లకుక్క ఏడిసిందనీ – నక్కలేవో కూసినాయనీ
పనులు మానేసిన జాతీ – పనికిమాలినా జాతంటారూ
పొట్టకూటికే – ఈ కట్టుకథలూ, పుట్టించారూ తెలుసుకొండయా! ॥భారతీయ॥

వేదాలన్నీ పేదవారినీ – వేధించేందుకె పుట్టాయండీ
కర్మలూ పూర్వజన్మలూ – కల్లమాటలా సొల్లేనండీ
స్వర్గం నరకం మంత్రం తంత్రం – మడిబట్టాలోళ్ళమాయేనండీ
కులముకుళ్ళులూ మతం మత్తులూ
మానవజాతికి సంకెళ్ళండీ ॥భారతీయ॥

# 39. మాకూలీనాలన్నా..

మాకూలీనాలన్నా మాతోఒస్తావా
మనబాధలు తీరేటీ మార్గం వింటావా
శ్రమదోపిడి తెలిసిందా - సమరానికి దిగుతావూ
దోపిడోళ్ళపై పోరుకు - రేపేసయ్యంటావూ ॥మాకూలీ॥

భూమినాది అంటాడూ - బుగతను నేనంటాడూ
కంపెనినాదంటాడూ - సంపదనాదంటాడూ
మీ చెమటను తడకుండా - భూమి పంటపండేనా
మీకష్టం లేకుండా - మిల్లుమిసను తిరిగేనా
మీరే శ్రమచేయకుంటే - నీరేదొరకదువాడికి ॥మాకూలీ॥

భూమినాది అంటేనూ - భూమిపగలబడినవ్వే
ధనము నాది అంటేనూ - జనము జవాబడిగేనూ
మనమంతా కలిసామా - రణభూమే అవుతుందీ
దోచుకున్నవారంతా - తోకముడిచిపోయేనూ ॥మాకూలీ॥

అన్నదాతెగొప్పంటిరి - దున్నేవాడిదె భూమంటిరి
దున్నలేని గుడిబొమ్మకు - ఇన్నివేల ఎకరాలా!
దున్నేవాడికి భూమిలేదు - రైతన్నకి తిండిలేదు
రాతిబొమ్మకున్నధనం - నీతిమంతులకులేదే ॥మాకూలీ॥

నిన్ను నన్ను దోచినోడు - మన్నుమిన్ను కాననోడు
ఇన్నాళ్ళుగ తెగబలిసీ - దున్నలాగవున్నాడూ
తిండిలేక బట్టలేక - వుండానికిల్లులేక
ఎన్నాళ్ళని ఈ బతుకులు - ఈసురంటు ఈడ్చుతారు
ఎత్తండీ పిడికిళ్ళు - కురిపించూ పిడుగుల్నీ ॥మాకూలీ॥

# 40. గాంధిగారిమాటంటూ.. మోదిగారి పిలుపంటూ...

ఏమిటీ ఇదిలోకమా – అది విషముకలిపినపాకమా!
ఇదేమనీ అడిగితేనె – అదేపెద్దనేరమా ॥ఏమిటీ॥

గాంధిగారిమాటంటూ – మోదిగారి పిలుపంటూ
చెత్తలు తుడిచేస్తున్నా – ఓనాయకులారా
ఏగాంధీ చెప్పాడని – ఈ బ్రాందీ దుకాణాలు
ఏమోడీ చెప్పాడని – ఈ సంపద దోపిడీలు! ॥ఏమిటీ॥

అర్ధరాత్రి ఆడవారు – నిర్భయంగ తిరిగినపుడె
స్వాతంత్రం సార్ధకమని – అన్నాడే మహాత్ముడూ
పట్టపగలు నడివీధిలో – అత్యాచారాలుచేస్తే
స్వాతంత్రానికి ఇదియా? – సార్థకతా తెలపండీ! ॥ఏమిటీ॥

బ్రతకటమే ప్రతిరోజూ – నరకంగా మార్చేసిన
అవినీతి వ్యవస్థనూ – అంతంచేసేదెన్నడు
పాములలో నైనగాని – మెలగవచ్చునెలాగో
స్కాములతో వేగలేము – బతికేందికెలాగో! ॥ఏమిటీ॥

ఖనిజ సంపదంతనేడు – ఘనులకమ్మివేసిరే
జనంనోట మట్టిగొట్టి – ధనంకూడబెట్టిరే
అర్ధరూపాయ్ మందుబిళ్ళ – ఏభయ్యినిజేస్తిరే
వైద్యానికి నువ్వెళితే – వైకుంఠం పంపిరే ॥ఏమిటీ॥

హిందుస్త్రీలకంటె – పతివ్రతలు లేరుఎందూ
అందుకనే కట్టినాము – నీతిగోడముందూ
సగటు మనిషి రైలెక్కితె – నిట్టనిలువు ప్రయాణం
కాదంటే కక్కసుదొడ్డీ – కొంచెం విరామం! ॥ఏమిటీ ॥

శాసనాలకధిపతులుగ – చేసిమిమ్ముపంపిస్తే
మోసాలతొ మమ్ముల – వనవాసానికి పంపిరే
ఏమి జరుగుతుందో – అది తెలిసిన తరువాత కూడ
నోరు విప్పనీ మనమూ – ద్రోహులమే అవుతాము! ॥ఏమిటీ॥

# 41. మీ చెమటా సుక్కలురా!

రారా మాఅన్నలార - రండీ గిరిపుత్రులార
అడివితల్లి బిడ్డలార - అల్లూరికి మిత్రులార
పట్టుతేనె పుట్టతేనె - పసుపూ పనసా అల్లం
అడ్డాకులు చీపుర్లూ - కేబేజీకేరెట్లూ
బీన్సుపిక్కబీరకాయ - శంబకాయ చిక్కుళ్ళూ
మీ చెమటా సుక్కలురా - మీదే ఆ సంపదరా ॥రారా॥

కొర్రలు కందులు పెసలూ - కోసుపువ్వుకీరాలూ
నాలుకోలుటమాటాలు - బొబ్బర్లూచౌచౌలూ
కరక్కాయ ఇండిపకాయ - పిప్పళ్ళూ మిరియాలూ
మీ కష్టం మీ యిష్టం - కాదంటె కయ్యమేర ॥రారా॥

కొండజిగురుకొత్తిమిరీ - మొక్కజొన్నముల్లంగీ
సామలుఉలవలువేరూ - శనక్కాయ పుట్టగొడుగు
రాగులుజొన్నలురాజ్మా - ఇప్పపువ్వు చింతపండు
మీ రెక్కల కాష్టాలే - మాకు పుష్టి భోజనాలు ॥రారా॥

గుమ్మడికాయ బటానీలు - నిమ్మకాయలు బత్తాయిలు
చిక్కుడుకాయ సిల్వరుపళ్ళు - ~~ఈతపళ్ళు~~ఈడాపళ్ళు
కమలాలూ చెరుకుగడలు - మీశ్రమతో సృష్టించిన
మీ సంపదమీదేరా - కాదన్నా వాడిపైన కన్నెర్రజేయుము ॥రారా॥

# 42. దండుకదిలిందిరా జంభాయిలో

దండుకదిలిందిరాజంభాయిలో – జనందుండు కదిలిందిరా ॥జంభా॥

దండు బలమునుజూచి – దోపిడీదారులకు గుండె చెదిరిందిరా ॥జంభా॥

ఊరువాడా కలిసిఉప్పెనైలేచింది – పల్లెలూపట్నాటలు వెల్లువై కదిలాయి
కార్మికులు కర్షకులు – కళ్ళు తెరిచీనారు
కళ్లుంటెచూడరాజంభాయిలో – మీకు చెవులుంటెవినరోరిజంభాయిలో
ఆరిలోవావాళ్ళు శూరులై లేచారు – సుందరానగరోళ్లు బందూకుదీసారు
పెదగిలిచినగదిలి – లగువులేవసారు
సింహాద్రినగరోళ్ళు – సివ్వంగులైనారు! ॥దండు॥

ఎండాడగంటేడ ఏకమయ్యానాయి – గాజువాకజనంగర్జించిలేచారు
అప్పికొండాప్రజలునిప్పులేచెరిగారు – దిబ్బపాలేమోళ్ళుదివిటీలుపట్టారు
గంగవరమూవాళ్ళు బెంగలేదన్నారు – పూడిమడకావాళ్ళు పూనకంపూనారు! ॥దండు॥

ఉప్పాడవాళ్లంత ఉగ్రులైలేచారు – ఋషికొండప్రజలంత బుసకొట్టిలేచారు
చిలకపేటాప్రజలు కలకలంరేపారు – వెలమపేటాప్రజలు వేగుచుక్కైనారు
పెరికివీధీ ప్రజలు చురకత్తులైనారు – కల్లుపాకలవాళ్ళు కదముతొక్కినారు
మధురవాడాప్రజలు కుదురుగాలేచారు – చంద్రమ్మపాలేముసంద్రమైలేచింది
పియమ్‌పాలేముసయ్యంటులేచింది – ఇసకతోటాజనము విసుగెత్తిలేచారు! ॥దండు॥

పెందుర్తివాళ్ళంతదండెత్తిలేచారు – వేపగుంటావాళ్ళుమేకులైనిలిచారు
ముషిడివాడావాళ్ళు – కసికసిగకదిలారు
సూజాతనగరోళ్ళు – సూర్యులైమండేరు ॥దండు॥

ఆనందపురమోళ్ళుఆందోళనలుజేసె – దుక్కోడిపాలేముదుడ్డులేదీసారు
అడిఇవరమూవాళ్లుఅలజడిరేపారు – సింహాచలంవాళ్ళుసింహాలుఅయ్యారు
పండావీధివాళ్ళు దండోరవేసారు – కొబ్బరీతోటోళ్ళుకొడవళ్ళుదీసారు
సీతమ్మపేటోళ్ళుచిందులేవేసారు – కనకమ్మవీధోళ్ళుకన్నెర్రజేసారు ॥దండు॥

బుక్కావీధీవాళ్ళుహక్కులేఅడిగారు – వాడవీధీవాళ్ళు గోడలైనిలిచారు
జాలారిపేటోళ్ళుజాలువిదిలించారు – కోటవీధీవాళ్ళుకోబలీఅన్నారు ॥దండు॥

బుచ్చిరాజూపాలెంచిచ్చురేపినారు – కాకానినగరోళ్ళుకారాలు నూరారు
గోపాలపట్నమూశాపాలుపెట్టింది – కొత్తపాలేమోళ్ళు కత్తులేదీసారు! ॥దండు॥

సతివానిపాలముసత్తువేజూపారు - పెదనరవప్రజలంతబెదురులేదన్నారు
షీలానగరువాళ్ళుఈలేసిపిలిచారు - కరాసావాళ్లేమొక్కరలేదీసారు! ॥దండు॥

శివాజీపాలేముశివమెత్తిలేచారు - మద్దిలాపాలేముహద్దులేదాటారు
వెంకోజీపాలేమురంకెలేవేసారు - పెద్దవాల్తేరంతదద్దరిల్లీనాది! ॥దండు॥

కుమ్మరీవీధోళ్ళుకుమ్ముతామన్నారు - గోడారిగోతోళ్ళుగోలలేచేశారు
రెల్లివీధీవాళ్ళు కల్లోలపరిచారు - అంగడీదిబ్బోళ్ళులుంగీబిగించారు ॥దండు॥

గొల్లవీధీవాళ్ళుఅల్లరేచేశారు - చాకలీగెడ్డోళ్ళుకేకలేవేసారు
తిక్కోడిపాలేముతిక్కరేపూతారు - ధర్మానగరువాళ్ళుచర్మాలుదీస్తారు! ॥దండు॥

ఆసిపాపావీధిఅట్టుడికిపోయింది - చెంగల్రావుపేటచెంగునాదూకారు
కంచరావీధోళ్ళుకణకణామండారు - ఉడ్యార్డువీధోళ్లుఉరుములైఉరికారు ॥దండు॥

కస్తూరినగరోళ్ళుకుస్తీకిపిలిచారు - రేసోడిపాలేమురేసులైలేచారు
కనకాలదిబ్బోళ్ళుసైఅంటులేచారు - బాపూజినగరోళ్ళుబాకులేదీసారు! ॥దండు॥

కైలాసనగరోళ్ళుసైఅంటులేచారు - మంచుకొండాతోటమంటలైలేచారు
సూర్యానగరువాళ్ళుసూదులైపొడిచారు - అయ్యప్పనగరోళ్ళుకయ్యమేనన్నారు ॥దండు॥

మాధవధారోళ్ళురోదనలుజేసారు - సంకురూపేటోళ్లుసమరానికొచ్చారు
తుమ్మడాపాలేముదుమ్ముదులిపేస్తారు - సుభాషునగరోళ్లుశెహబాషుఅన్నారు ॥దండు॥

అల్లిపురమోళ్లంతచెల్లదని చెప్పారు - మిరపకాయలదొడ్డికరకరామనిలేచె
వెంకటేశ్వరమెట్టహుంకరించీనాది - చలువతోటాజనముసలసలామరిగారు! ॥దండు॥

గవరకంచరపాలెంగట్టిగానిలిచింది - రెడ్డికంచరపాలెంగడ్డపారలుదీసె
గొల్లకంచరపాలెంగొడుగయీనిల్చింది - రామ్మూర్తిపేటోళ్లురారమ్మనన్నారు! ॥దండు॥

అల్లూరినగరోళ్ళువిల్కెక్కుపెట్టారు - జైభారతూనగరుజయంమనదన్నారు
కామాక్షినగరోళ్ళుఖస్సుమంటున్నారు - బర్మాకేంపువాళ్ళుభయములేదన్నారు ॥దండు॥

అంబేద్కరూనగరుగంభీరముగాలేచె - యల్బీనగరువాళ్లుచల్భాయిఅన్నారు!
గౌరీనగరువాళ్లుశౌర్యాన్నిచూపారు - గోకులానగరోళ్లుచాకులేదీసారు! ॥దండు॥

ఇందిరానగరలోళ్లువందలుగకదిలారు - శ్రీనివాసానగరుశ్రీముఖంచుట్టారు
మాణిక్యకోలనీచాణుక్యులైనారు - విశ్వశాంతీనగరువిజయాన్నిచాటారు
కూడుగుడ్డానీడవిద్యావైద్యంకొరకు - కూలినాలన్నలూకూటమైకదిలారు!
పల్లెలూపట్నాలు విల్లులైలేచాయి - అడుగులోఅడుగేసిపిడుగులైనిలిచారు
దండుకదిలిందిరాజంభాయిలో - జనందండుకదిలిందిరాజంభాయిలో ॥దండు॥

**(విశాఖనగర పేదల భూపోరాటం సందర్భంగా రాసింది)**

# 43. ఎగిరిందోయ్...ఎగిరిందోయ్..!

ఎగిరిందోయ్...ఎగిరిందోయ్...ఎగిరిందోయ్ పేదోళ్ళ ఎర్రబావుటా
నిండిందోయ్ – అరుణకాంతి – నేల అంతటా, మననేల అంతటా ॥నిండిం॥
చలిలో ఆకలిలో ఈ అంతులేని శోకంలో ॥అంతు॥
అణగారిన ప్రజలందరి కండగనిలిచే జెండా ॥అండగ॥
తరతరాల బానిసత్వ శృంఖలాలు త్రెంచుకునీ ॥శృంఖ॥
సమతకొరకు మమతకొరకు సమరంచేసిన జెండా! ॥ఎగిరిం॥
వీర తెలంగాణలోన పోరు సల్పినట్టి జెండా ॥పోరు॥
వీరుల రక్తంతో తడిసి ఎరుపెక్కినదీ జెండా ॥ఎరు॥
అనాధలకు అభాగ్యులకు అండదండ ఈ జెండా ॥అండ॥
కార్మిక కర్షక ధీరులు కరములదాల్చిన జెండా! ॥కర॥
॥ఎగిరిం॥

ధనం, సుఖం, జనంకొరకు త్యాగం చేసిన వీరులు ॥త్యాగం॥
ప్రజలకొరకు ప్రాణమిచ్చి పోరినట్టి మనయోధులు ॥పోరు॥
వారి ఆశయాలబాటసాగినట్టి సుందరయ్య ॥వారి॥
చేపట్టినదీ జెండా త్యాగధనుల కలలుపండ! ॥ఎగిరిం॥
ప్రతియువకుడు ప్రతినబూని పట్టాలీ ఈ జెండా ॥పట్టా॥
ప్రతి యువతీ నవతకొరకు పట్టాలీ ఈ జెండా ॥పట్టా॥
కార్మిక కర్షకులంతా రథసారదులైనిలిచీ ॥రథ॥
పట్టాలీ ఈ జెండా సమతకొరకు ప్రజలంతా! ॥ఎగిరిం॥

# 44. మరణించీ జీవించుట!

ఆలోచనఅనుభూతులె – మానవజీవితమూ
అవిరెండూలేకుంటే – అడివిలోని మృగమూ
పెద్దమనసుచేసుకొండి – బుద్ధిమంతులారా
మానవత్వమంటె అదే – మహనీయుల్లారా ॥ఆలోచన॥

మట్టిలోకలిసే దేహం – మరోమనిషికేజీవం
బూడిదయే శరీరమే – ఇంకోమనిషికి ప్రాణం
శాశ్వతంగమూతపడిన – దివ్యజ్యోతినేత్రాలే
రేపటిసూర్యునివలెనే – నూతన వెలుగులుయిచ్చును! ॥ఆలోచన॥

నిన్నటివరకూమనిషీ – కన్నుమూస్తెబూడిదయే
నేటినుండిఆతనువూ – సాటిమనిషికేజీవం
విజ్ఞానం అందించే – విలువైనాఅవకాశం
జ్ఞానవంతుడైనమనిషి – వాడుకొనును బ్రతుకుటకే! ॥ఆలోచన॥

యుద్ధభూమిలోకూడా – కవచంకోసిచ్చినాడు
మాటతప్పనీధీరుడు – కర్ణుడుమానవాడేనోయ్
పక్షినిరక్షించుటకై – శరీరాన్నెకోసిచ్చిన
దానములో గొప్పవ్యక్తి – అతడేశిబిచక్రవర్తి
ప్రాణంపోయినశవాన్ని – దానముగా ఇవ్వలేమా
విలువైనాత్యాగాలను – ఎలుగెత్తీ చాటలేమా! ॥ఆలోచన॥

మరణమన్నదందరికీ – మామూలేఅయినప్పుడు
మరణించిజీవించుట – అందరికీ దక్కదుకద
మనపార్థివదేహాలను – డాక్టర్లకు యిచ్చామా
మరణించిజీవించుట – మనకే సాధ్యమ్ముకదా! ॥ఆలోచన॥

# 45. అయ్యారే..!

అయ్యారేఏమిటిఈలోకం – దీనితీరుచూస్తేశోకం
దీనిదారిచూస్తేనరకం – దీనిప్రతిచర్యాప్రజలను
అజ్ఞానములో – ముంచుటకే! ॥అయ్యారే ॥

సాటిమనిషి ఆకలితో – ఛస్తున్నాచూస్తూ
తిండిబెట్టనేలండీ – తినలేనిబొమ్మకూ!
రాళ్లేదేవుళ్లయితే – రాసులు మింగేస్తాయని
ఏనాడో వేమన్నా – ఎలుగెత్తిచాటాడే! ॥అయ్యారే॥

ప్రార్థనచేశారంటే – కుంటివాడునడుచునంట!
స్తోత్రాలనుచెల్లిస్తే – నేత్రాలే వస్తాయట!
స్తోత్రాలకు ప్రార్థనలకు – కాళ్లూ కళ్లూవస్తే
కార్పొరేటు ఆసుపత్రి – కట్టారెందులకంటా! ॥అయ్యారే॥

ప్రపంచానప్రాణులన్ని – సమానంగచూడమన్న
మహహ్మదూమామాటను – మన్నిస్తానంటెవినూ
మగవాడికి లేని ముసుగు – మగువలకెందులకయ్యా?
అల్లా ఈ తేడాలను – ఎల్లా వుంచావయ్యా! ॥అయ్యారే॥

మానవులా బాధలన్ని – మాన్పాలని మహారాజు
రావిచెట్టు క్రిందతపసు – రేయిపగలుచేసినాడు
మహాజ్ఞానమునుపొందీ – ప్రపంచమంతాచాటిన
హింసామృత్యువురోగాల్ – రాగాల్ తీస్తున్నాయే ॥అయ్యారే॥

మతములన్నిమాసిపోవు – జ్ఞానమొక్కటే వెలుగని
అన్నాడేగురజాడా – ఆనాడే వినలేదా
ఆజాడను ఒదిలినరులు – అంధకారములోపడితే
వెలుగుదారిచూపించే – ఘనుడొకడూకనబడడే! ॥అయ్యారే॥

# 46. లేలెండోయ్ రారండోయ్!

లేలెండోయ రారండోయ్ - భారతీయులారా
ఓశాంతి దూతలారా - ఓ వీరయోధులారా
మానవమారణహొమముచేయగ
దానవుడొక్కడు తలచాడోయ్
జీవజాలమును నాశముచేసీ - తానెజీవించదలిచాడోయ్ ॥లేలె॥

అణువిజ్ఞానం మనుగడకోసం - మరణంకోసం కాదండోయ్
అణ్వాస్త్రాలేమనకొద్దంటూ - అన్నవస్త్రాలె కోరండోయ్ ॥లేలె॥

సకలజనావళి సుఖములకోసమె - సైన్సుప్రగతనిచాటండోయ్
సర్వజనులనూ సంహరించు ఆ - సమరంమనకూ ఒద్దండోయ్
కళకళలాడే ప్రపంచమంతా - కణకణనిప్పులుకురిపించీ
బంగరుభూమిని భస్మంచేసీ - బాంబులుమనకూ ఏలండోయ్
ప్రపంచప్రజలాప్రగతికోసమే - సోషలిజమ్మొకవైపూ
కపటంకౌర్యంకరడుగట్టినా - యుద్ధోన్మాదులుఒకవైపూ
నక్షత్రాలలొయుద్ధంచేసీ - నాశంచేయగతలిచాడోయ్
రక్తపిపాసీ అమెరికవాడిని - చిత్తుచిత్తుగా తరమండోయ్
విశ్వశాంతికై శాంతికపోతం - వినువీధుల్లో ఎగరేస్తే
శాంతీక్రాంతీగిట్టని అమెరిక - అంతంచేయగతలచాడోయ్
సమతామమతా సామ్యవాదులతొ - సర్వమానవులుకలవండోయ్
అవనిని బూడిద చేయబూనినా - అమెరికాను ఛీకొట్టండోయ్

# 47. అ..ఆ...లు దిద్దగానె..!

ఓహోసోదరా - ఓహోసోదరీ ॥2॥

అన్నలారతమ్ముళార - అందరుఇటురండిరా
అఆలూదిద్దగానె - అయిపోలేదండిరా
సంతకాలు నేర్చగానె - సరిపోలేదండిరా ॥అన్న॥

అక్షరాలు దిద్దగానె - అజ్ఞానం పోవునా
కాఖ్ఖాలురాయగానె - కవీశ్వరుడివౌదువా
సంతకాలు నేర్వగానె - సాహిత్యం తెలియునా
సాగించునీచదువూ - సాహిత్యం తెలిసెవరకు ॥అన్న॥

ఇంకొంచెం ముందుకెళ్ళి - ఇంగిలీసునేర్చుకో
మరికొంచెం ముందుకెళ్ళి - మర్మమేదొతెలుసుకో
సానబెట్టినీబుర్ర - సాహిత్యం తెలుసుకో
సాహిత్యంలోనవున్న - సారాంశం తెలుసుకో ॥అన్న॥

విద్యవిత్తనాలు నాటి - వివేకాన్ని పెంచుకో
కలుపుమొక్కలన్నిఏరి - చదువుపైరు పెంచుకో
విజ్ఞానపుఫలసాయం - విందుభోజనంనీకూ
ఆరగించినావంటే - అజ్ఞానంపారిపోవు ॥అన్న॥

వానాకాలం చదువూ - వరదలోనెపోవులే
ఎండాకాలం చదువూ - ఎండిపోయిపోవులే
శీతాకాలం చదువూ - చివికిపోయిపోవులే
నిరంతరం చుదువుకుంటె - నీకునీవుసాటిలే ॥అన్న॥

పొద్దున్నేచదువుకెళితె - చద్దన్నందొరకదాయె
మధ్యాహ్నం చదువుకెళితె - ముద్దనీకు లేకపోయె
రాతిరేళ చదువుకెళ్ళి - చాతనైనవరకుచదివి
పుస్తకంలోవున్నదాన్ని - మస్తకంలొపెట్టండీ ॥అన్న॥

చదువేనీ హృదయమనీ - చదువేనీ సంపదనీ
చదువేనీ మిత్రుడనీ - చదువేనీ బంధువనీ
చదువులేకపోతె ఒట్ఠి - చవటపర్రెనీ బ్రతుకూ ॥అన్న॥

# 48. డంకెలుగాడోయ్‌బాబు!

డంకెలుగాడోయ్‌బాబు – డంకెలుగాడోయ్
ఆ డంకెలుగాడెట్టినట్టి – లంకెలుచూడండి బాబు ॥డంకె॥

హెూరుమనేగాలిలోన – ఘోరుమనేవానతడిసి
మండుటెండలోనువ్వు – మాడిపోయిమడిదున్నీ
ఆలిబిడ్డలంత గలిసి – ఆరుగాలం పండిస్తే
గింజలపై హక్కులేదు – గంజెనీకు దక్కునటా! ॥డంకె॥

డంకెలోడి మాటవింటె – సంకటాలెమనబతుకులు
అర్ధరూపాయిమందుబిళ్ళ – అయిదురూకలువుతుందట
ఆవునీదిఅయినగాని – దూడనీది కాదంటా
నీభూమిలొ విత్తనాలు – నీయిష్టం సాగదంట
అయ్యమ్మెఫ్ఫోడిమాటె – అమలుజేసితీరునంట
అమెరికోడి అండవాడు – పేదప్రజలమింగువాడు
అసలుకివడ్డీలక్రింద – ఎసరుపెట్టు దేశానికి! ॥డంకె॥

ఎగ్జిట్టండోయిబాబు – ఎగ్జిట్టండీ
ఆ ఎగ్జిట్టొగుట్టేమిటొ – ఎంకన్నా తెలుసుకోర
కంపెనీలు మూసేసీ – కార్మికులను త్రోసేసీ
గవర్నమెంటు కంపెనీలు – ఘరానోళ్ళకమ్మేసీ
ఏడాదికి కోటిజాబు – లెక్కలాగిపారేస్తరు! ॥డంకె॥

# 49. మన ఉద్దరాజురామం!

ఉద్యమాలఊపిరి - మన ఉద్దరాజురామం
శ్రామికజనహృదయాలలో - నింపెస్వర్గధామం ॥ఉద్య॥

స్వాతంత్రపుసమరంలో - కేసరివై నిలిచినోడ
తెల్లవారిగుండెల్లో - గుబులెత్తిననల్లవాడ
సమసమాజస్థాపనకై - సాగినట్టిసైనికుడా
కల్లాకపటం ఎరుగని - కామ్రేడా జోహారూ ॥ఉద్య॥

మితవాదుల హితబోధతో - శ్రుతికలపనిధీరుడా
అతివాదుల పోకడలతో - జతకలవనివీరుడా
మార్క్సిజమేమార్గమనీ - మదితలచినశూరుడా
మార్క్సిస్టుగకడవరకూ - మాతోపయనించినోడ ॥ఉద్య॥

కార్మికులే కళ్లనీకు - కర్షకులే విల్లునీకు
విప్లవాలె విందునీకు - పేదలెబంధువులునీకు
త్యాగధనులమాటనీది - పోరాటపుబాటనీది
నీ బాటయె స్ఫూర్తిమాకు - నిరంతరం ఓరామం ॥ఉద్య॥

దోపిడిదారులగుండెలు - చెదరగొట్టుచేవనీది
భూస్వాములగుండెల్లో - భుగలుపెట్టుదీటునీది
పశ్చిమాన అస్తమించితే - నేమీనేడూ
తూర్పున ఉదయించు - రేపు ఉద్యమాలరేడూ

# 50. యువతరమా-భారతనవతరమా!

యువతరమా - భారతనవతరమా
ఉవ్వెత్తున ఉప్పొంగే - ఉత్తుంగతరంగమా
జాతిగౌరవం నిలిపే - హిమాలయపుశిఖరమా ॥యువ॥

నీదేశం ఏమైపోతుందో - పరికించావా
నీసంపద నీఘలు - భోంచేయుట గమనించావా
దోచుకునీదాచుకునే - తీరునుజూస్తున్నావా ॥యువ॥

నీరులేక రైతుకంట - కన్నీరే వస్తుంటే
రైతేరాజనిజెప్పే - రైతుభూమిలాగేస్తే
అన్నంపెట్టిన రైతే - ఆకలితో ఛస్తుంటే
ఎన్నాళ్ళీమోసాలని - ఎలుగెత్తీ నిలదీయూ ॥యువ॥

నింగినినేలనుకలిపే - నిప్పులాంటియువశక్తిని
నిరుద్యోగరక్కసికీ - బలియిచ్చేనాయకులూ
కట్నాలకు కన్యలనూ - కాల్చేసే క్రూరాత్ములు
చూస్తూనువ్వూరుకుంటె - మేస్తూనేపోదురయ్యో ॥యువ॥

అవినీతిలొపాలకులూ - కూరుకుపోతూవుంటే
దేశంకుక్కలు చింపిన - విస్తరిఅయిపోతుంటే
తారల ఆరాధనలో - తలమునకలుఅయిపోయీ
సినీమాయలోనచిక్కి - చిందులువేయుటతగునా ॥యువ॥

భగత్‌సింగుతలచుకునీ - భగ్గుమనీ లేవవోయ్
రామరాజునూహించీ - రగులుజెండనెత్తవోయ్
పీడితప్రజలతోకలిసి - పిడుగులు కురిపించవోయ్
సమతామమతకునీవే - సారధిగా నిలవవోయ్ ॥యువ॥

# 51. అన్నా ఒకచిన్నమాట!

అన్నా ఒకచిన్నమాట – విన్నావా పూలబాట
మామాటలువిన్నావా – మానవతకు అదేబాట ॥అన్నా॥

పువ్వులుతెస్తావూ – పూజలు చేస్తావూ
తరగని ఆస్తులన్ని – తనకే ఇమ్మంటావూ
పక్కింటిపాపాయీ – పాలుకోసమేడిస్తే
రూపాయిమ్మంటే – కోపాన్నే చూపుతావు ॥అన్నా॥

తిరపతికెళతావూ – ముడుపులుకడతావూ
గుడిచుట్టూతిరిగీ – గుండునుగొరిగిస్తావూ
లడ్డూలు పులిమోరా – అడ్డంగా దిగమింగీ
తిండిలేనివాడొస్తే – పొండిదూరమంటావూ ॥అన్నా॥

రూపాయికి పావలాలు – వడ్డీలకు యిస్తావూ
పేదలకడుపుకొట్టి – కోట్లు కూడబెడతావూ
వందల ఎకరాలు – ఇంద్రభవనమంటిఇళ్ళు
కానీ...నువుకాటికెళ్తె – ఆరడుగులనేలేగతి ॥అన్నా॥

నీస్త్రీనిఇంటిలోన – నిబ్బరంగ పెట్టుకొనీ
పక్కింటిపడతివేపు – పళ్ళునుఇకిలిస్తావూ
నీలాగెనీఆడది – పరాయివాడ్నిచూస్తె
నీకెట్టాగుంటుందో – లోగుట్టూచెప్పన్నా ॥అన్నా॥

కులాలపేరుతోడ – ఓట్లుకూడబెడతావూ
సీటులుఎక్కినాక – చీటింగులుచేస్తావూ
కూలిని పెంచమంటె – పోలీసులపిలుస్తావు
ఉపాదిచూపమంటె – ఊపిరినేతీస్తావూ ॥అన్నా॥

(30.9.14)

# 52. ప్రజాగీతం

పాటండి పాటండి పాటా – ఇదీ పేదసాదల బతుకుపాటా
ఇదీ ఆదివాసీ బతుకుబాటా –
ఇదీకష్టజీవులకెంతో యిష్టమైనపాట
కష్టించుకార్మికుల – గుండెచప్పుడు మోత ॥పాట॥

చెట్టుకొమ్మనపిట్ట – గూడుల్లుకున్నట్టు
చేతిలో ఈతాకు – చాపల్లుకున్నట్టు
పనిలోనమాయవ్వ – పాటల్లుకునన్నదీ
ఆపాటనేపాడానా – బతుకంతగాబాటనేనడవనా ॥పాట॥

లోకమునవేకువా – కిరణమైమెరిసింది
చీకటైతే చాలు – వెన్నెలైకురిసింది
దండకారణ్యాల – కొండగాలైవీచి
ఎండవానలకోర్చి – ఎదిగెఎదలోయల్లో
పాయలుగ ప్రవహించెనా – ఆపాటప్రజలలోజీవించెనా ॥పాట॥

చలిమంటలేసుకొని – పొలికేక పెట్టింది
గుండెదరువులమీద – జెండ ఎగరేసింది
ఒంపులెన్నో దాటి – గుంపులల్లో గలిసి
గాలితరగలమీద – ఊరేగి ఊరేగి
పొలిమేరలేచేరిపెనా – ఆపాటపొద్దు పొద్దుగవెలిగెనా ॥పాట॥

దుమికెజలబింబమై – దూకిందిసాగింది
కొండకోనలకోటి – రాగాలదాగుంది
అడివితల్లీ ఒడిలొ – ఎండుటాకుల సడిలొ
ఆదిమాజాతులా – ఆటలతొజతగట్టి
వేటమొదలెట్టిందిరా – ఆపాటకోటలనుగొట్టిందిరా ॥పాట॥

నేలపైగడ్డోలె – పచ్చగాబతికింది
నెలచందమామోలె – లోకానవెలిగింది

నల్లలమపువ్వులా – నాజూకునవ్వులా
నా పల్లెలోగిళ్ళ – ఉయ్యాలలూగింది
ఏతల్లికన్నబిడ్డో – ఆపాట ఎవరుపురుడూబోసిరో ॥పాట॥

వనసీమలనుదాటి – జనసీమలనుగలిసి
చెలుకల్లమొలిచేటి – మొలకల్లె ఎదిగింది
నాటేసెతల్లులా – నాలుకలనర్తించి
తుమ్మెదలగుంపులా – కమ్మనీరాగాల
జగమంత తిరిగొచ్చెనా – ఆపాట జానపదమైనిలిచెనా ॥పాట॥
కాలచక్రాలకూ – ఇరుసయ్యివున్నదీ
కలిమిలేములమధ్య – కంచెగావున్నదీ
పంచభూతాలనే – ప్రాణముగచేసుకొని
పాడేటిగొంతులో – పాటగాపూచింది
ఆపాటనే పాడనా – బతుకంతగా బాటనేనడువనా ॥పాట॥
మండేటి ఎండల్లో – మంచయ్యికురిసింది
ఎండేటి డొక్కల్లో – మెతుకయ్యిమురిసింది
కరువురక్కసికోర – కాటేయువేళల్లో
ఊతమై ఆశ్రితా – జాతులనుపోషించ
ఇల్లిల్లుతిరిగిందిరా – ఆపాట పల్లెలను ఏలిందిరా ॥పాట॥
గణసీమతెగిపడిన – గండుచీమలపట్టు
కుమ్మరీపురుగోలె – మలినమంటదుఒట్టు
చెట్టోలెపాటకూ – చరితెంతొవున్నదీ
చిరకాలముగ – చిరంజీవిగావర్ధిల్లె
మనిషిలోసంగీతమూ – ఆపాటమనదేశ ఇతిహాసమూ.

**(అజ్ఞాతకవి)**

# 53. మేడే పాట

రండో మా అన్నలార - రగులుజెండనెత్తుదాము
రారో మా అక్కలార - పోరుబాట సాగుదాము
తిరుగుబాటు చేయకుంటె - జరుగుబాటులేదుమనకు
జరుగుబాటు లేనిజనం - తిరగబడేతీరాలీ ॥రండో॥

కార్మికహక్కులకోసం - ప్రాణములేధారబోసి
ఎనిమిదిగంటలపనికై - మునిగిరినెత్తురులోనా
చికాగొ వీధుల్లోనా - చిందిన వీరులరక్తం
ఆ రక్తంలోపుట్టిన - అరుణకాంతి మనజెండా ॥రండో॥

ఈ జెండేరష్యాలో - ప్రజలకండగానిలిచీ
జారుచక్రవర్తులనూ - నేలకూల్చివేసిందట
ఈ జెండే చైనాలో - శ్రమజీవులకండనిలిచి
జనశత్రులగుండెల్లో - గునపాలనుదింపెనంట ॥రండో॥

ఈజెండేవియత్నాము - వీరులకండగనిలిచీ
అమెరికోడిగుండెల్లో - అణుబాంబైపేలిందట
ఈజెండే క్యూబాలో - పీడితులకు అండనిలిచి
సామ్రాజ్యావాదులకూ - సావుకబురుపంపిందట
బానిససంకెళ్ళుత్రెంచి - సమతదారి చూపిందట ॥రండో॥

# 54. హష్మీ జోహారూ

హష్మీ జోహారూ సఫ్దర్ హష్మీ జోహారూ ॥2॥
ఓ కళాకారుడా జోహారూ ఓ అమరవీరుడా జోహారూ ॥హష్మీ॥
కలం పట్టి నువ్ రాసిన కవితకు కంగారెత్తెను కాంగీనేతలు ॥కంగా॥
గళం ఎత్తి నువ్ పాడినపాటకు గజగజ వణికెను దోపిడిమూకలు ॥గజ॥
ప్రజాశత్రువుల గుండెలదరగా ప్రభంజనమ్మై నిలిచిన వీరుడా ॥హష్మీ॥
కలవారల నెదిరించగ నీవు కళనే కరవాలముగానెంచీ ॥కళనే॥
వీధివీధిలో వాడవాడలో జనచైతన్యపు మొక్కలునాటీ ॥జన॥
సమతకు మమతకు సారధివౌతూ జైత్రయాత్ర సాగించిన ధీరుడా ॥హష్మీ॥

భారతదేశపు రాజధానిలో బాధలమ్రగ్గే బీదల వీధిలో ॥బాధల॥
నీ హావభావ కళాజ్యోతులతో నీచులగుట్టును రట్టునుచేస్తే ॥నీభుల॥
ఘరానాహంతక కాంగీమూకల ఘాతుకాలకే బలిఐనావా ॥ఘాతు॥
నీ ఆశయాల సాధనకోసం నిరంతరం పోరాడి తీరుతాం ॥నిరం॥
నువ్ జూపించిన మార్గములోనే సమసమాజపూ సాధనలోనే ॥సమ॥
కళనే కరకుశరముగా జేసీ ప్రజా విరోధుల నెదిరించుతాము ॥ప్రజా॥
॥హష్మీ॥

**(కామ్రేడ్ సఫ్దర్ హష్మీ 2వ వర్ధంతి సందర్భంగా)**



# కవితలు

# 1. వనితల్లారా వినపడలేదా!

వనితల్లారా వినపడలేదా! మణిపూర్ మహిళలఘర్జనలు
మహిళల్లారా కనపడలేదా ! కసిగా నరికిన కన్నెలశిరసులు
కళకళకలాడే కన్నెల బతుకులు – కణకణమండుతుమాడిపోవగా
జవమూజీవం తొణికసలాడే – యువతీయువకులు కారామీరూ?
సినిమా(యే) మా ప్రపంచమంటూ – చిందులు వేస్తూ వుంటారా!
ఎందరులక్ష్మిలు బలిఐపోయిన – స్పందనమీలో చలించదా!
తారలేమీకు ఆదర్శమైతే – కైజారులకే కడతేరుదురు
విజ్ఞానంతో వివేకమతులై – విషయంలోతులు తెలియండి
పురుషాధిక్యపు పురాణనీతులు – పుచ్చిన పురుగులపళ్ళండీ
సమసమాజపూమార్గంలోనా – సాగిపోదామురారండీ!

**సందర్భం** : మణిపూర్ సైనిక దురాగతాలకి వ్యతిరేకంగ 11మంది మహిళలు నగ్నంగా సైనిక కార్యాలయం ముందు తమ తీవ్ర నిరసననీ ఆవేదననీ తెలియజేస్తే విశాఖలో ఏ మహిళాసంఘమూ, వారికి మద్దత్తుగా ఒక ప్రదర్శనగానీ, నిరసనగానీ, కనీసం ప్రకటన ద్వారానైనా, ఖండించకపోవటం చూసి, గుండెమండి రాసిన కవిత ఇది.

# 2. మూల్గులే మిగులు

నలుగుపిండితొ అంబ – చంటిబిడ్డనుజేసి
బాత్రూంకి కావలిగ – బాలుడ్ని పెట్టె
స్నానాలగదిలోకి – సాంబయ్యపోబోగ
కూడదంటూకుంక – అడ్డుపడబోగా
ఆగ్రహించిన హరుడు – నిగ్రహం మరిచి
నాకు అడ్డగనిలిచి – నన్ను ఎదిరించే
డింభకా నువ్వెవరు – ధిక్కరించెదవు
అనుచు శంభుడు తాను – ఆశ్చర్యబోవ

ముక్కంటివని గొప్ప - నిక్కిచెప్పెదరే
పార్వతీసుతుడనని - పరికించలేవా
నాకు తెలియాకుండ - నగరాజతనయ
సుతుని ఎప్పుడుకనెను - చోద్యమిదిఏమి!
అనుకొనుచు శివుడంత - అడుగుముందేయ
అడ్డగా నిలిచెనా - అంబతనయుండు
ఢింభకా తొలగమని - దిక్కులదరంగా
హుంకరించెను శివుడు - ఉగ్రుడైనిలిచి
ఎద్దునెక్కినవాడ - బుద్ధిలేదటరా
స్నానాలగదిలోకి - సాగిపోవంగా
కాలుముందుకువేస్తె - ఖబడ్దారంటూ
కరవాలమునదీసి - కదలెబాలకుడు
శివుడికాగ్రహమొచ్చి - శూలమ్ముదీసి
శిశువు అని తలచకా - శిరసుతెగద్రుంచే
అదిచూసి హిమపుత్రి - ఆందోళనముతో
హరహరా తనయుడిని - హతమార్చతగునా
శివశివాబ్రతికించు - చిన్ని నా సుతుని
అనుచు పార్వతితాను - హరుని ప్రార్థించ
ముసిముసిగనవ్వుతూ - ముక్కంటి చూసి
ఉత్తరపు దిక్కునా - నిదురించుప్రాణి
శిరసునూతెగవేసి - శివుడు తెమ్మనెను
ఆదిక్కు గజరాజు - హాయి నిదురించ
గజరాజు తలద్రుంచి - ముక్కంటికిచ్చె
ఆ శిరసుబాలునికి - అతికించె హరుడు
అతడెమనతొలివేల్పు - లంబోదరుండు
విఘ్ననాయకుడంచు - విప్రులుడివెదరు
సామజమునకుబదులు - జంబుకమువుంటె
నక్కముఖనాయకని - నామంబురాదే!
బొమ్మకే ప్రాణాన్ని - పోసినాఅంబా

తెగిన శిరసునిమళ్ళీ – అతికించలేదా!
ఏనుగూముఖమేల – ఏడుపెందులకూ
ఏసొళ్ళుజెప్పినా – ఏమిటని అడిగే
నాధులెవ్వరులేకె – నంగికథలన్నీ
బిచ్చమెత్తటమంటె – భక్తి అనిజెప్పి
ఇచ్చకపుమాటల్ని – నచ్చజెపుతారు
కళ్ళుచెవులూ మూసి – కల్లల్ని వింటే
బూటకపుకథలన్ని – బుట్టలవుతాయి
భక్తిలోపడినీవు – భజనల్ని చేస్తే
భుక్తిలేకానీవు – బుగ్గిఅవుతావు
భక్తినీకిచ్చేది – బానిసత్వమ్మే
భజననీకిచ్చేది – విభజనత్వమ్మే
దేవుళ్ళదేవతల – దేబిరిస్తేనూ
ముక్తిదొరకదుగాని – మూల్గులేమిగులు

# 3. హెచ్చరికలు!

**1)** జయవంతులూ – వర్ధంతులూ జరిపి
భవంతుల్లో – పడుకోవటంకాదు
శ్రమంతటినీ – ధారపోస్తున్నవాళ్ళకి
రవంతమేలుచేసి – సుమంతుల్లానిలవండి!

**2)** పాలుపెట్టీ ముడ్డికడిగీ – ముద్దుపెట్టీ నడకనేర్పిన
అమ్మకి – అన్నంపెట్టనోడా!
అమ్మోరుకి – ఉపారం పెడుతున్నావా!

**3)** అన్నమోరామచంద్రా – అని చచ్చారే గానీ
అన్నమోరావణా – అని ఒక్కడూ చావలేదే!

**4)** తొండమున్నోడూదేవుడే - తోకున్నోడూ దేవుడే
గడ్డితిన్నోడూ దేవుడే - దొడ్డితిన్నోడూ దేవుడే
బుద్ధీజ్ఞానం వుంటే - అడగండర్రా ఈ అబద్ధాల దేవుళ్లగురించి!

**5)** కూతుర్ని పెళ్ళాం చేసుకున్నోడు సృష్టికర్తా?!
పరాయిస్త్రీలతో కులికేవాడు పరమాత్ముడా
పువ్వులోనుండి పుట్టినోడు పురుషోత్తముడా
ఇద్దరుమగాళ్లమధ్యపుట్టినోడూ దేవుడేనా!
ఇదెలా సాధ్యమని అడగండర్రా మొద్దులారా!

**6)** దెయ్యాలులేవనే దేవయ్యాలూ
వేదాల్ని వెక్కిరించే మేతావులూ
దెయ్యాలు వేదాలు వల్లించినట్లు అని
సొల్లువాగుడేమిటోయ్!

# 4. అభూత కల్పనలు!

లోకంలో ప్రాణుల్ని బ్రహ్మసృష్టిస్తే
ఆ బ్రహ్మనితామరపువ్వు సృష్టిస్తే
ఆ తామరపువ్వు విష్ణుబొడ్డులో నుంచిపుడితే
ఇంతకీ విష్ణుకులమేది బ్రహ్మతల్లెవరు?
మగాళ్ళకి పిల్లలు పుట్టడమేమిటి!
చెప్పేవాడికి చైతన్యం లేకపోతే
వినేవాళ్ళకన్నా వివేకం వుండొద్దా
అమృతంకోసం అంభుదిని మధించడం ఏమిటి
దానికి పాముని కవ్వంచేసి చిలకడం ఏమిటి!
సముద్రంనుంచి విషమూలక్ష్మీ పుట్టడాలేమిటి
ఆ లక్ష్మికి కులమేది - తల్లీ తండ్రీ ఎవరు?

ఏంచెప్పినా ఎదురుచెప్పక – కళ్లూ, జ్ఞానం మూసేసుకుని
ఎద్దుకీ గెద్దకీ – ఎలక్కీ ఏనుగుకీ
కోతికీ రాతికీ – కుక్కకీ పందికీ
కరాలుజోడించి – కాళ్ళావేళ్ళాపడి
మడికట్టుకొనీ – మొరపెట్టుకునీ
గుండులు గొరిగించుకునీ – గుళ్ళుచుట్టూతిరిగి
కుండలతోపాలూ – బకెట్లతోనెయ్యీకుమ్మరించి
కూలీలకష్టాల్నిదిగమింగి – కోట్లు కూడబెట్టేకూటభక్తులారా
దేవుడికిచ్చేవి ఈకలూ – మీ బీరువాల్లో రూకలూనా!
మీ భక్తి మీ – మానసికబానిసత్వం
మీ పూజలు లంచాలు – మంచాల బేరాలు
దేవుళ్ళు మీ సృష్టి – దెయ్యాలు మీ కల్పన
కర్మలు మీ కట్టుకథలు – స్వర్గనరకాలు మీ గారడీలు
పూర్వజన్మలూ, పునర్జన్మలూ – మీ పుక్కిట పురాణాలు
నీతులు – మీరు తప్పుకున్న గోతులు
సాగించలేరెన్నాళ్ళూ – ఈ జనవంచన
కూటికిలేనోళ్ళ మీ గుట్టుతెలిస్తే
కాటికి మీ – పయనం ఖాయం!

# 5. గాడితప్పుతున్ననీతి!

పాపాలు చేసినోళ్ళని – కాపాడటంకోసం
తప్పులు చేసినవారిని – ఒప్పించటంకోసం
తరతరాల అజ్ఞానాన్ని – తరిమేయటంకోసం
ఆర్తులనూ అనాథలనూ – ఆదుకోవటంకోసం
దివినుండి కాకపోయినా – దీవినుండి ఒచ్చిన
మనవతామూర్తికి – మేకులు కొట్టి
గురువాప్రభువా అంటూనే – వెన్నుపోటుపొడిచి

దాహానికినీరిచ్చినవాడిని – ద్రోహంతోరక్తంపారించి
జాతికోసం – జనంలో నిల్చినవాడిని
తూటాలతో – తునియలుజేసి
కనురెప్పఅనినమ్మితే – కంటినే పొడిచేస్తే
దాన్ని ద్రోహం అందామా – అజ్ఞానం అందామా
దగా అందామా – పగే అందామా
ఏమనుకున్నా – ఏం లాభం
ఓ జ్ఞానజ్యోతిని ఆర్పేసుకున్నాక – మిగిలింది అంధకారమేకదా
చీకట్లో చిక్కుకుపోవడమేకదా – వెలుతురుకై వెదుక్కోవడమేకదా
శోకంతో కేకలు వేయటమేకదా – పర్యవసానం/సర్వవసానమే !

# 6. దళితులంటే -

దళితులంటే – పీడనకు గురయ్యేవారు
దళితులంటే – దగాపడినవారు
దళితులంటే – నిరాస్తిపరులు
దళితులంటే – మహిళలు
దళితులంటే – న్యాయందక్కనివారు
దళితులంటే – సమాజంనుంచి వెలివేయబడ్డవారు
దళితులంటే – నిరంతరం శ్రమకి గురయ్యేవారు
దళితులంటే – శ్రమదోపిడీకి గురయ్యేవారు
దళితులంటే – బువ్వకోసం బుగ్గి అయ్యేవారు
దళితులంటే – సమాజానికి జీవంపోసేవారు
దళితులంటే – సహనంతో సహజీవనం చేసేవారు
దళితులంటే – అరే ఒరే ఒసే ఒలే
దళితులంటే – లోకభారాన్ని మోసేవారు
దళితులంటే – నిరంతరం అన్యాయానికి బలయ్యేవారు
దళితులంటే – మీ మురికిని శుభ్రం చేసేవారు

దళితులంటే - ఊరవతల పూరిగుడిసెల్లో బ్రతికేవారు
దళితులంటే - వెధవా అంటే పెదవి విప్పలేనివాళ్ళు
దళితులంటే - వెధవలికి పదవుల్ని కలగజేసినవారు
దళితులంటే - అన్నం మనకిచ్చి అంబలితాగేవారు
దళితులంటే - సుఖాలికి దూరంగా వుంచబడ్డవారు
దళితులంటే - ఆత్మని నలిపివేయబడ్డవాళ్ళు
దళితులంటే - దళారులచే నలిపివేయబడ్డవారు
దళితులంటే - దమ్మూ దుమ్మూ వున్నవారు
దళితులంటే - కండబలం గుండెబలంవున్నవారు
దళితులంటే - దగుల్బాజీలను దంచేవారు
దళితులంటే - తమశక్తి తమకే తెలియనివాళ్ళు
దళితులంటే - తమలోతామే కలహించుకునేవాళ్ళు

# 7. మంచి విశాఖేకానీ?

అన్నలారా తమ్ములారా - అక్కలారా చెల్లెళ్లారా
తల్లుల్లారా తండ్రుల్లారా - మిత్రుల్లారా శత్రువులారా
విన్నారా ఇది కన్నారా - విశాఖనగరపు వింతల్ని
మావిశాఖమహామంచి విశాఖా - మంచి విశాఖేకాదండోయ్
మహావిశాఖగామారింది - మహాసుందరపు విశాఖపట్నం
పండావీధీ వెలంపేటలూ - కల్లుపాకలూ కొబ్బరితోటలూ
అక్కడక్కడా మురికి సందులూ - సందుల్లోపల వూరపందులూ
పశువులు, కుక్కలు, ఈగలు, దోమలు
ఇక్కడ దోమలు ఈగల్నే మింగేస్తాయ్
ఇక్కడ కుక్కలు పిల్లల్ని పీకేస్తాయ్
ఇక్కడ పందులు - రాబందుల్నే భోంచేస్తాయ్
ఇక్కడ శ్రమలూ పరిశ్రమలూ - మందుషాపులూ మందులషాపులూ
క్రొత్త క్రొత్త కార్లూ అందమైన బార్లూ - నర్సింగ్‌హోమ్‌లూ

బర్నింగ్‌హోమ్‌లూ
ధర్మాసుపత్రులూ ఖర్మాసుపత్రులూ – అపోలోలూ అలోపోలోలూ
ఎన్నో ఆసుపత్రులు – ఎన్నివున్నా – డాక్టర్లకీ ఏక్టర్లకీ –
పాలకులకీ ఏలికలకీ – ఈ ఆసుపత్రులంటే ఈసడింపే
సామాన్యుడికీ సరుకులేనోడికే తప్ప – అర్ధంవున్నోళ్ళకీ హాస్పిటల్ అనర్ధం
అయితేనేం మావిశాఖకి – రోగులు తక్కువా రోగాలు తక్కువా!
డాక్టర్లు తక్కువా ఫీజులు తక్కువా! – లేబులు తక్కువా డాబులు తక్కువా!
ఇంకా చెప్పాలంటే ఇక్కడ మందుబిళ్ళలు – వందల్లోనే
మూడురోజులు ముందు బుక్‌చేసుకుంటేనే
ముసలి డాక్టరైనా ముఖం చూసేది – మూడ్రోజుల కూలిఫీజులకీ
ఏడ్రోజుల కూలిటెస్టులకీ – నెలరోజులకూలి స్కేనింగులకీ వుంటేనే
నీ జబ్బుగుర్తించేది, నీకు మందులు రాసేది, ఆ పైనీకుమందులకి
డబ్బులుంటేగింటే, ఆ మందులఖరీదు షాక్‌కి యింకా నువ్ మిగిలుంటే
ఆ మందులకి నీరోగం కుదిరితే అటుపై
చూద్దాం ఆ వింత!

# 8. పాపులనే రక్షిస్తే!

పాపులనే రక్షిస్తే – పాపాలే పెరిగిపోవా?
గొర్రెలవలె ప్రజలుంటే – నక్కలు నమిలేయవటోయ్
ఖర్మంటూ క్రుంగిపోతే – అధర్మమే పొంగిపోదా
తలరాతని నమ్మినావ – బలవంతపుచావేగతి
పుచ్చిననీతులుఅన్నీ – కుత్సితులాకుట్రలేను
బిచ్చమెత్తిబతకటమే – భక్తిఅనే భడవాలూ
తామే ఆ పనిజేసీ – పామరులకు చూపరాదా
విద్యనందకుండజేసి – వింతపశువు అంటారు
ఆస్తినంతకాజేసీ – నాస్తికుడవు అంటారు
జ్ఞానమంతమూసేసీ – అజ్ఞానివి అంటారూ

భూమినంతదోచివాళ్ళు - బుగతలు అయ్యారయ్యా
బుగతలు కాలంమారీ - బూర్జువలయ్యారయ్యా
భూమిలేక భుక్తిలేక - బూడిదఐపోతుంటే
బూర్జువాలు భూస్వాములు - పాలకులైనారమ్మా
దగాకోరులంతా కలిసి - దళితుని చేసారమ్మా
దళితుడంటే ఎవరయ్యా - దమ్మూదుమ్మున్నవాడు
దళితుడుంటేఎవరయ్యా - ధనంబలం లేనివాడు
దళితుడంటె ఎవరయ్యా - ధరణిని దున్నేటివాడు
దళితులంతా దండుకడితె - ధనవంతుడు లొంగిపోడా
దళితులంత ఒకటైతే - అంబేద్కరుపొంగిపోడా
దళితులంత ఒకటైతే - మనుధర్మం మాడిపోదా
దళితులంత ఒకటైతే - ధరణిమాత పులకించదా
దళితులంత ఒకటైతే - దాస్యగొలుసు తెగిపోదా
దళితులంత ఒకటైతే - సమతబాటసాగిపోదా
అందుకనే చెపుతున్నా - అంభేద్కరు వారసులకు
అంభుదిలాకదలిరండి - ఐక్యతతో కలసిపొండి
వింధ్య హిమాచలమెత్తున - బృందాలైలేవండీ

# 9. మీరు కుర్రాళ్ళా? రాళ్ళా?!

ఒరేయ్ కుర్రాళ్ళూ - మీరు కుర్రాళ్ళా రాళ్ళా!
కుళ్లిన సంస్కృతిలో - కూరుకుపోకండిరా
ఒక్కసారి కళ్ళువిప్పి - వాస్తవం చూడండిర
ఒక్కసారి ఈ కవితను - ఒద్దికగా చదవండిర
ఒక్కసారన్నా నాటి - దేశభక్తుల్ని తల్చుకోండిరా
ఒక్కసారి నాటియువత - నడతేంటో తెలుసుకోండి
చిరంజీవి సినిమాకో - బాలక్రిష్ణబయస్కోపుకొ
నాగార్జున నయగారాలకొ - అల్లుఅర్జున్ అడుగులకో
అలల్లా విరుచుకపడి - దయ్యాల్లా ఊగిపోకండిరా

రొప్పుతూ రోజుతూ - రొచ్చుకంపులో చెమటవాసనలో
త్రోసుకుంటూ కుమ్ముకుంటూ - ఒకడిపై ఒకడెక్కుకుంటూ
ఫస్టు రోజు టిక్కెట్లకి - బ్రష్టుల్లా కొట్టుకుంటూ
వారం కూడా ఆడని - సారంలేని సినిమాల్ని
స్వతహాగా డబ్బుతో - శతదినోత్సవాలు జరిపి
కటౌట్లకి దండలువేసి - తారలకాళ్ళకి దండాలుపెట్టి
అలగాగాళ్ళకి అభిమాన సంఘాలు పెట్టి
ఇంట్లో తిండిలేకపోయినా - ఒంట్లో శక్తిలేకపోయినా
చిత్తకార్తెకుక్కలకి - క్షీరాభిషేకాలు చేస్తారా!
మీవయసులోనేరా - అల్లూరిఆజాదూ
భగత్‌సింగూ, ఉదమ్‌సింగూ - రాజగురూ సుఖదేవూ
ఖుదీరాంబోస్ - కర్తార్‌సింగ్‌శరభా
ఖిర్సాముండా - కొమరంభీమూ
ఉప్పెనలైఉరికార్రా - ఉరికంబాలెక్కార్రా
అదిరా వీరమరణం - జాతిజనుల నిత్యస్మరణం
ఆ వీరులు ధృవతారలు - మీ తారలు పాతరలు
ఇకనైనా తెలుసుకోండి - దేశం కాపాడుకొండి

# 10. అనుచితం-అరాచకం!

డాక్టరు మందివ్వలేదా - తగలెట్టెయ్‌బస్సు
పైరులెండిపోయాయా - అంటించెయ్ అగ్గి!
వరదలుముంచెత్తాయా - తగలెట్టెయ్‌బస్సు
రిజర్వేషనులు కొరకు - అంటించెయ్ అగ్గి!
రిజర్వేషనములుచేస్తె - తగలెట్టెయ్ బస్సు
ధరలు పెంచివేసారా - అంటించెయ్ అగ్గి!
గిట్టుబాటు ధరలేదా - తగలెట్టెయ్ బస్సు
ఆవూరికి బస్సేస్తే - అంటించెయ్ అగ్గి!
ఈవూరికి బస్సులేదా - తగలెట్టెయ్ బస్సు!

అన్నిటికీ లెఖ్ఖలేసి – అసలుకి వడ్డీకలిపి
ధరలుపెంచి ప్రజలను – తగలెట్టును ఆ ప్రభుత
అది తెలిసీ మసులుకొనే – వారే తగు మనిషి!

# 11. 68ఏళ్ళ స్వా(హా)తంత్ర ఫలితం!

జనం జనంకూలిజనం – ఎటుచూస్తే అటే జనం
కూడులేని గూడులేని – పేదజనం బీదజనం
సీతంపేటజంక్షన్‌లో – కురుపాం మార్కెట్టువద్ద
యన్ఏడీకూడలిలో – మద్దిలపాలెం మధ్యలో
ఎటుచూస్తే అటే జనం – సాపాటుకి నిత్యరణం
ఆకలితో శోకంతో – అలసటతో నిరాశతో
భుజాలపై గునపాలతో – చేతులతో పారలతో
తట్టలతో తాడులతో – గమేలాలు తాపీలతో
శ్రమే తమకు పెట్టుబడిగ – భ్రమే బ్రతుకు ప్రమాణంగ
చిరిగిన చొక్కాలతోడ – చెదరిన ముంగురులుతోడ
మట్టితోడ చెమటతోడ – బుగ్గితోడ బురదతోడ
భగభగమండేగుండెల – భుగభుగభుగ పొగలతోడ
మాటలతో పాటలతో – సరసాలతొ విరసాలతొ
అన్నలతో తమ్ములతో – చద్దన్నం మూటలతో
అమ్మతోడ అయ్యతోడ – అక్కతోడ చెల్లితోడ
అందరితో కలిసిమెలిసి – పసితనాన్ని మసినిచేసి
పలకలన్ని పారవేసి – పాఠశాల ఒదిలివేసి
పస్తులతో బతకలేక – మస్తరికై పరుగులెత్తి
మట్టితట్టనెత్తినెట్టి – సిమ్మెంటూ ఇసకకలిపి
తారుకింద మంటబెట్టి – కుతకుతకుత ఉడకబెట్టి
రోడ్డురోలరంటనడిచి – రోడ్డులన్ని చక్కగేస్తె
కారుమీద ఒచ్చినట్టి – కాంట్రాక్టరు కూలియిస్తె
మేస్త్రీగాడు ఆ డబ్బులో – కమీషనుగ కొంత మింగి
ఇచ్చిన డబ్బులతోనె – పుచ్చిన బియ్యంకొనగా

ఆయాసం తిరగబెడితి – దగ్గుతెరలు భగ్గుమంటె
అల్లం తిని బెల్లంతిని – జీలకర్ర నీళ్ళు తాగి
లంకణమే ఔషధమని – సంకటాన్ని ముదరబెడితె
సావుకాడికొచ్చినాక – ధర్మాసుపత్రికిబోతె
బతికిబట్టకట్టావా – యింటికీ
లేదంటే నీ పయనం – మంటికీ

# 12. దారితప్పిన సిద్ధాంతం!

పులులకు ఫలహారాలా – విలువను వివరిస్తారట
సింహాలకు చింతకాయ – పచ్చడితినిపిస్తారట
ఏనుగులకు ఎండ్రకాయ – వేపుడు పెట్టిస్తారట
తోడేళ్ళకు వేడి వేడి – లాడూల్ తినిపిస్తారట
హైనాలకు బనానాల – వైనాలను చెప్తారట
ప్రేమతోడ పాయసాన్ని – పాముకి తాపిస్తారట
మొసలి ఒళ్ళు మసాజ్‌చేసి – మిసమిస మెరిపిస్తారట
ఎలుగుబంటి వెంట్రుకలకి – ఎర్రరంగు పూస్తారట
మేకలికీ మోకాలనే – మేనేజరు చేస్తారట
చేతితోడ చెయ్యికలిపి – చైతన్యం తెస్తారట
పేదవారిఓట్లతోడ – పెద్దలగెలిపిస్తారట
అవినీతిని అధికారం – అధిష్టింపజేస్తారట
పగలంతా ఫైటింగులు – రాత్రివేళ మీటింగులు
ఒకచేత్తో కౌగిలింత – వేరొక చేత్తో కత్తివింత!
బరువుని మోయటమెందుకు – బావురుమనటం ఎందుకు
పల్లకిలో ప్రభువులనూ – వెల్లకిలాత్రోయరాదో
కల్లబొల్లి కబురులన్ని – వల్లకాట్లొ కలపరాదో
జారుబాటవిడిచిపెట్టి – పోరుబాటపట్టరాదో
ఎల్లప్రజలతో కలిసీ – ఎర్రజెండపట్టరాదో
రాబోయే సామ్యవాద రాజ్యానికి చేరరాదో

(మార్క్సిస్టులు కాంగీతో పొత్తును నిరసిస్తూ రాసినది.)

# 13. నిజాలు!

హిందూమత ఉన్మాదం - వందలుగాజెపుతారు
క్రైస్తవమతకపటత్వం - కథలుకథలు చెపుతారు
బుద్ధిజాన్ని హింస్నచూపి - సద్దుమణగజేస్తారు
ఇస్లామును విమర్శించి - ఇరుకునపడబోడెవడూ
ఫత్వాలకు భయపడి - ఆ సత్యాలను పలకబోడు
తలకాయల వెలకు జడిసి - తాను నిజం చెప్పబోడు
మతములన్నియు మాసిపోవును - జ్ఞానమొక్కటె నిలిచివెలుగును
అనుచుపలికిన ధీరుడొక్కడె - అతడెగురజాడ

# 14. హృదయజ్వాల!

మనభాగ్యానగరమంత - జనరుధిరం నిండిందా!
అమాయకుల తలకాయలు - ఆటబంతులయ్యాయా
నిర్దోషుల రక్తంతో - జలకాలాటాడారా
పాపం పుణ్యం ఎరుగని - పసిపాపలు హతమైరా!
తల్లిపోయి దిక్కులేక - తల్లడిల్లుబిడ్డలరుగో
బిడ్డపోయి మతిదప్పిన - కన్నవాళ్ళు అరుగరుగో
కళ్ళు ఊడి కాళ్ళు తెగీ - కళేభరాలైదొర్లిన
ధీశాలులు నవయులకుల - దేహాలివిగో ఇవిగో
భీకరదృశ్యాలు జూచి - భీతావహులైన ప్రజలు
భగభగమండేగుండెల - బడబాగ్నితో ప్రశ్నలివీ
ఏ దేవుడు కోరినాడు - ఈ దారుణహింసాగ్నిని
ఏదేవత కోరినాది - ఈ రక్తపునైవేద్యం
ఆరోగ్యం ఐశ్వర్యం ఆయుష్యం - ఇమ్మంటూ
అల్లానే కోరుతారు - నమాజులే చేస్తారూ
ఏసయ్యను తలచుకునీ - ఏడుస్తూ చెపుతారే

ఎంకన్నాకొండకెళ్ళి - గుండుగీసి మొక్కుతారు
ఏ దేవుళ్ళిచ్చినారు - ఈ బాంబులవరాలను
ఏదెయ్యాలాడినాయి - ఈ వికృత నర్తనాలు
ఇంతటి ఈ విధ్వంసం - ఈ భక్తులు సృష్టిస్తే
కళ్ళుండీ చూడలేవా - అల్లాహ్ ఓ అల్లాహ్
చెవులుండీ వినవదేమి - జీసస్ ఓ క్రీస్తూ
నోరుండీ పలకవేమి - ఎంకన్నా చెప్పూ

(28.8.2007న హైద్రాబాద్‌లో బాంబుదాడిలో 40 మంది చనిపోయిన సందర్భంగా రాసింది)

# 15. బహుపరాక్!

ముసలి బ్రహ్మకు - ప్రసవమైనట
ముఖంనుంచి - బ్రాహ్మలూ
భుజాల్నుండి రాజులూ - బొడ్డునుంచి కోమట్లూ
తొడల్నుంచి శూద్రుల్నీ - కన్నాడట
పంచముల్ని ఏద్వారాన - ప్రసవించాడో
గీతా చెప్పలేదు - ఏ రాతా తెలపలేదు
ప్రకృతికి విరుద్ధంగా - వికృతపద్ధతిలో
మగాళ్ళకే పిల్లలు పుట్టడం - మతాలపితలాటకం
ఈ మతంలో మగాడికీ మగాడికీ మధ్య
మనదేవుళ్ళు పుడతారు ! అంతేకాదండోయ్ -
ఈ దేవుళ్ళు, గాలికీ, నీరుకీ, నిప్పుకీ కూడా పుడతారట!
ఓహొాహొా అలాగా అంటూ చేతులుజోడించి వింటాం!
అశుద్ధం తినేవీ, అశుద్ధంలో దొర్లేవి కూడా అవతారాలే!
ఇంతెందుకు, మనం నమ్ముతాంగనుక మనం ప్రశ్నించంగనుక
నోటినుంచీ, చెవుల్నుంచీ, గోళ్ళనుంచీ, గోడల్నుంచీ కూడా
దేవుళ్ళని పుట్టించి - మనల్ని వాళ్ళకోసం

దేవిరింపజేస్తారు – మన మతకర్తలు
కళ్ళుమూసుకోనీ, కరాలు జోడించీ, కాళ్ళమీదపడీ దండాలుపెట్టీ
మీ జ్ఞానానికి మేకులు కొట్టండి; లేకపోతే మీలో అనుమానాలు పుడతాయ్
ప్రశ్నలు లేస్తాయ్; ఆ లోచనలు ఆయుధాలై-
మౌఢ్యాన్ని నరికిమంటల్లో వేస్తాయ్, అందుకే –
కళ్ళూజ్ఞానం మూసుకోమని, మననెత్తిన శఠగోపంపెట్టారు!
బహుపరాక్ బహుపరాక్ బహుపరాక్!

# 16. స్వగతం!

ఆకలేస్తేరాత – ఆగ్రహమొస్తేరాత
ఆనందం కలిగితే రాత – ఆందోళన చెందితే రాత
ఆలోచిస్తే రాత – ఆవేశం ఒస్తేరాత
అలజడిలేస్తేరాత – అవమానంజరిగితే రాత
అందాల్ని చూస్తే రాత – అపజాయాలెదురైతే రాత
అపవాదులువేస్తే రాత – అన్యోన్యంకుదిరితేరాత
అనుకోనివి జరిగితే రాత – అన్నీసమకూరితే రాత
రాతనాహృదయానికి – ఒకపోత
రాతనావదనానికీ – ఒక పూత
అక్షరాలు నా రెండు – చక్షురాలు
అక్షరాలు నాకు దాచుకున్న – లక్షలగోతాలు
అక్షరాలు నాకుక్షికి – తియ్యని క్షీరాన్నాలు
అక్షరాలు నా ఆలోచనలకి – సులోచనాలు
అక్షరాలు నా మెదడుకి – విచక్షణాలు
అక్షరాలు నాకు వేనవేల అక్షయ తూణీరాలు
అక్షరాలు తరగని చెరగని అక్షయపాత్రలు
అక్షరాలు నామనోఫలకంపై శిలాక్షరాలు
అక్షరాలు వెకట్టలేని ద్రాక్షరసాలు
అక్షరాలు సృష్టికే మూలమైన కక్ష్యరాలు

# 17. దారితప్పినయోధులు!

ఏడు దశాబ్దాలేగినా – ఎక్కడిగొంగళి అక్కడే
ఏడూ ఏడూ పద్నాలుగు – ముక్కలూ చక్కలైమిగిలారు
ఏమిటి సాధించారోయ్ – ఎర్రజెండా వీరులూ
ఎన్నికల్లోగెల్చిమేము – ఏలికలయ్యాముకదా
ఏకంగా మూడున్నర – దశాబ్దాలు ఏలాంకద
అంటారే గాని మీరు – వింటారా మామాటను
మూడే రాష్ట్రాలలోన – మూలుగెందుకంటేనూ
ఆంధ్రాలో అడుగెందుకు – జారిందని అడిగితేను
ఆ ఒక్కటి అడగొద్దని – ఆగ్రహాన్ని చూపుతారు
నందమూరితో కలిసీ – చిందులెన్నోవేసారు
వెన్నుపోటుబాబుతోటి – కన్నుకొట్టికలిసినారు
సోనియగాంధీచుట్టూ – ప్రదక్షిణలు చేసినారు
ఇవి అన్నీ సామ్యవాద – స్థాపనకేనంటారా!
దోపిడీదొంగలసేవను – ప్రజలతో చేయిస్తారా!
బూర్జువాలపాలననే – తిరిగి ప్రతిష్టిస్తారా!
ఎన్నాళ్ళని ప్రజలనిలా – ఎన్నికల్లో ముంచుతారు?
సిద్ధాంతం పేరుతోడ – రాద్ధాంతం ఒద్దుగాని
మార్క్సిస్టుల పాలనలో – మగువలకధికారమెంత?
మద్యంజూదంలాటరి – నిషేధాలజాడెక్కడ?
ఎక్కువకాలమెపాలన – గొప్పకి సాక్ష్యంఅయితే
నాల్గుపదులు పాలించిన – కాంగీదే గొప్పకదా
కాంగ్రెస్‌పార్టీని తిట్టి – దేశంనే గెలిపించీ!
దేశాన్నీ త్రోసేసీ – కాంగీతో చేయికలిపి!
ఇదేనటోయ్ కమ్యూనిజం – ఇదేనటోయ్ మార్క్సిజం?
కాదు కాదు ఎన్నటికిది – కమ్యూనిజమూ
మార్క్సిజమనుముసుగేసిన – మూర్ఖులఇజము!

# 18. కేజీహెచ్ కహానీ!

జార్జిరాజు ఆసుపత్రి - అవినీతికి పెద్దపుత్రి
నైవైద్యంపెట్టనిదే - తగువైద్యం జరగదచట
పేదసాదరోగులకూ - పెట్టనికోటంటారు
సూదినుంచి దూదివరకు - కొనితెచ్చుకో అంటారు
మృత్యువుతో పోరుజేస్తు - రక్తపుధారలతొ వెళితె
జోకులతో నవ్వులతో - డాక్టర్లుంటారచట
ఆపదలో రోగులుంటె - ఆదుకునేవారురారు
నిక్కుతునీల్గుతువచ్చిన - చక్కగ పరిశీలించరు
డాక్టర్లే కాదు అచట - యంత్రాలూ పనిచేయవు!
రూకలు ఇస్తేగానీ - చరకులు చురుకుగకదలరు
అదనుజూసి ప్రైవేటుకి - పదిలంగా పంపుతారు
అటుపైనా గుటుకుమంటె - మార్చురీలో తోస్తారు
అదేమనీ పేదలంటె - మెడపట్టీ గెంటుతారు
ఆసుపత్రి తాళమేసి - అవతలపొమ్మంటారు
సమ్మెజేసిగరీబోళ్ళు - సావజంపి ఒదులుతారు
ఇదేమనీ అడిగినోళ్ళు - ఇలలో లేకుండపోతె
పేద ప్రజల ప్రాణాలూ - పేలాలుగ ఎగిరిపోవా?

# 19. ముసుగులొద్దు!

విశాఖ అందాలు చూడడానికి - విమానాల్లోంచి
విదేశీయులొస్తున్నారట - పారాహుషార్!
భీమిలీ తీరాలూ, బీచీ అందాలూ తప్ప - వెలంపేటలూ కల్లుపాకలూ
పండావీధిలూ కొబ్బరితోటలూ - కనిపించకుండా జాగ్రత్తపడండి!
కైలాసగిరులూ ఏరాడకొండలూ - షిప్పుయార్డులూ స్టీలుప్లాంటులూ తప్ప
చావులుమదుంలూ పాతబస్టాండులూ - జాలారిపేటలూ జబ్బర్‌తోటలూ
కళ్లముందుపెట్టొద్దు - ఫిషింగ్‌హార్బర్లూ ఓడరేవులూ మాత్రం
ఎర్రదిబ్బలూ యూనివర్సిటీలూ తప్ప - చిలకపేటలూ హరాబ్రిడ్జిలూ

కోటవీధులూ గోడారిగోతులూ - బుక్కావీధీ ఏడుగుళ్ళూమాత్రం
దాచెయ్యండి చూపించకండి
బహుపరాక్ - బహుపరాక్!

# 20. వాస్తవం!

రోడ్డెక్కితే పాడెక్కినట్టే - రైలెక్కితే చితికెక్కినట్టే
బస్సెక్కితే తుస్సుమనటమే - ఆటోఎక్కితే అటోఇటో
బైకుపై వెళ్ళినోడు - తిరిగొచ్చే వరకూ డౌటే
రోడ్లన్నీ నోరు తెరుచుకొని - రక్తదాహంతో అలమటిస్తున్నాయ్
రోగమొచ్చి ఆసుపత్రికికెళ్లినా - రోడ్డుపైకి సామానుకెళ్లినా
ఇంటిముఖం చూడరు - మంటిముఖమే చూసేది
బజారుకెళ్తే బాంబులభయం - హొటల్‌కెళ్తే కల్తీలభయం
పొరుగూరికెళ్తే దొంగలభయం - సినిమాకెళ్తే బూతుదృశ్యాలభయం
చదువుకుందామంటే - ఫీజులు డొనేషన్ల భయం
కాలేజీకెళ్తే ర్యాగింగ్‌భయం - బస్టాపుల్లో నిలబడ్తే జులాయిలభయం
నడిచివెళ్తేనగలస్నాచర్స్‌తోభయం - డ్యూటీకెళ్తే అధికార్లతోభయం
పెళ్ళిచేసుకుందామంటేకట్నాలభయం - పిల్లల్ని కంటే పెంచడం భయం
నివసిద్ధామంటే ఇల్లుదొరకనిభయం - ఇల్లుదొరికితే అద్దెలభయం
ఇల్లుకట్టుకుందామంటే - భూధరల భయం
రాత్రయితే దోమలభయం - పగలైతే కరెంట్ భయం
తక్కువతింటే ఆకలిభయం - ఎక్కువతింటే గ్యాస్ట్రిక్ భయం
ఒండుకుతిందామంటే - గ్యాస్‌దొరకదనిభయం
చద్దామంటే - కట్టెలకి భయం
ఇన్నిభయాలమధ్య - దినందినం క్షణక్షణం
భస్తూ బతుకుతూ - బాధలేనిజీవితం
ఎప్పుడు దొరుకుతుంది - ఎలా దొరుకుతుంది
ఎలా దొరుకుతుంది - ఏదీ ఆ మార్గం
స్వాహాలు మానుకొనీ - స్వార్థాలు చంపుకునీ
కోట్లమంది పీడితులతో - కూటమిగా కదలివెళ్ళి

దోపిడోళ్ళనెదిరిస్తే - భయంపోయిజయంకల్గు
బాధపోయి బలంపెరుగు - నాదిపోయిమనం మిగులు
లోకమంతా సుఖంకలుగు - అదేనోయి సమసమాజం

# 21. అసహజాలు!

1) తోడేళ్ళుగొర్రెలకు - తోడునిలవాలంట
గోవులకు వ్యాఘ్రాలు - జోలపాడాలంట
ఎలుకల్ని పిల్లులే - ఎత్తితిప్పాలంట
కప్పలకు పాములే - గొప్పనేస్తాలంట
ఘనమైన గతచరిత - జనమెల్లమరవగా
దోపిడోళ్ళు చెప్పేకూటనీతులివి!

2) ఉల్లిపాయల ధరలు - కళ్ళనీళ్ళొస్తుంటె
పచ్చిమిరపాధరలు - చిచ్చురేపుతువుంటె
పప్పునూనెల ధరలు - తిప్పలేపెడుతుంటె
బియ్యాలధరజాస్తె - భయ్యాలుపుడుతుంటె
చావలేకాప్రజలు - బ్రతుకులీడుస్తుంటె
బ్లాకుమెయిలుకి - కేంద్రరేకులూడుతువుంటె
హైటెక్కుపాలకుల - ట్రిక్కుల్లో ప్రజలంత
ఆకలీ చావులకు - అడ్జెస్టు ఐపోండి!

3) చేతిలో చెయిపెట్టి - నీతిగోతిలోపెట్టు
మార్క్సిజం మడతెట్టి - మంచెకిందనుపెట్టు
సుత్తికొడవలితీసి - చుక్కలకు గురిపెట్టు
అవకాశమునుబట్టి - రంగుమార్చుటబెస్టు!
**(కాంగీతో సిపిఎం కలవటానికి పడుతున్న ఆరాటంచూసి)**

4) కాలుచెయినరికారు - కళ్లూడ బెరికారు
కుత్తుకలు కోసేసి - నెత్తురులు నింపారు
వంటకట్టెలల్లాగ - మంటల్లో తోసేసి

ఆధిపత్యం కొరకు - వాదులాడుకచచ్చే
అన్నలకు ఆ హత్య - లంటగట్టేసారు

(వేంపెంట మాదిగల్ని బుడ్డావెంగళరెడ్డి అనుచరులైన మాలల్ని ఉసిగొల్పి మాదిగల్ని చంపినందుకు స్పందించి)

# 22. అసలు విషయం!

1) సీపీయం పార్టీలో - సిద్ధాంతం ఎంతరా
నేతిబీరకాయలోన - నెయ్యి అంతసోదరా
భా.క.పా లొమిగిలినట్టి - లౌకికత్వమెంతరా
భారతీయజనతాకి - మోతమోసినంతరా
కానికాలమొస్తెచెట్టు - కడపిందెలువేయురా

2) భోపర్స్ పేరుతో - భాజపాతోకలిసి
కాంగీని దించుటకు - కత్తులే దూసారు
ఐక్యఫ్రంటనిజెప్పి - ఐ.కాంగ్రెసుతోకూడి
బాజాపానెదిరించి - ఫోజులే పెట్టారు
నేడుకాంగీతోడ - నెయ్యముకుతలపడ్తు
నీతసూత్రాలన్ని - గోతిలో త్రోసారు
ఎర్రజెండాపరువు - ఏ ఏటిలో గలిసె
సుత్తికొడవలిసుక్క - ఏతుక్కులో త్రొక్కె

# 23. సిగ్గుసిగ్గు!

మనమంత్రులు తమపదవులు - పంచుకొనుటకొరకేనా!
ఒడియా మంత్రుల్ని ఒక్క - ఘడియచూసినేర్చుకోరా!
ప్రజలకొరకు ఒక్కసారి - అరువునోరు విప్పబోరా!
లాలూముందరఅందరు - వుల్లొల్లెపోయినారా

రైల్వేలో జరుగుతున్న - కల్లోలంచూడబోరా
రైళ్ళన్నీ ఉత్కళ్కే - హైజాకై ఉరుకుతుంటే
గుడ్లుతేలవేసినారు - గుటకలు వేస్తున్నారా
ఏటాకోటానుకోట్లు - వాల్టేరేయిస్తుంటే
భువనేశ్వరుకే శనీశ్వరుడు - ఎత్తుకుపోయాడు
దక్షిణరైల్వేలకలప - దారికడ్డుఎవడునిలిచె
విశాఖనేవిడిచిపెట్టి - ఒడిస్సాకి పంపెనెవడు
ఆంధ్రావాళ్ళంటేనే - అంధులమనుకున్నారా
నోరూవాయిలేని - భీరులమనుకున్నారా
పిల్లి అయిన ఎన్నాళ్ళని - కళ్ళుమూసుకుంటుంది
ఒళ్ళూ మనసూ నొస్తే - కళ్ళెర్రగజేస్తాదే
కసికసిగా పైనబడీ - కండలు పీకేస్తాదే
మంత్రులు బధిరాంధుల్లా - సుంతైనాకదలకుంటే
జనం మనం మనం జనం - ప్రభంజనమ్మైలేస్తే
లాలూ బాలూలంతా - ఈలవేస్తెదివాలే
ఏలాగైనాలాలూ - బీహారునొదిలిరావాల్
తెలుగుఆత్మగౌరవాని - కిదోపెద్దసవాల్

(విశాఖ రైల్వేజోన్‌పై రాసింది)

# 24. హెచ్చరిక!

అయ్యామార్క్సిస్టులార - చెయ్యాలొకగుర్తుమీకు
కాంగీబీజేపి రెండూ - బొమ్మాబొరుసన్నారూ
బీజేపీతోడకల్సి - బాజాల్‌వాయించినారు
అటుపై హస్తంతోడా - జతకట్టీనిలిచినారు
రాష్ట్రంలో తీరుకూడ - రంగుల ఊసరివిల్లే
దేశం శెహభాష్ అంటూ - అన్నకండనిలిచారు
అటుతర్వాతన్ననొదిలి - బాబునెత్తుకున్నారు
కరెంటుఉద్యమంలోన - కాల్చిచంపినారెవరు

మద్యనిషేధానికిమరి – తూటులుపొడిచిందెవరు
ఆపై బాబునిపడేసి – హస్తంతో కలిసెనెవరు
మళ్ళీరేపటిరోజున – సైకిలెక్కజూసెనెవరు
ఏఎండకు ఆగొడుగును – పట్టేవారేఘనులూ
ఏరోటికి ఆపాటను – పాడేవాడేవిటుడు
అవకాశపు వాదంలో – అందరుదొందూదొందే
అందుకు మినహాయింపులు – ఎందుకు ఎర్రోళ్ళకైనా!

# 25. సరదాగా!

కైకవదరం కోరకుంటె – రాముడడవికేగునా
రాముడడవికేగకుంటె – రాక్షసవధజరుగునా
రాక్షసవధ జరగకుంటె – లోకముసుఖమొందునా
రామాయణకావ్యానికి – కైకేకదమూలం
అందుకె ఆపేరుమీకు – అందించెను శ్రీ శ్రీ
అదే పేరుతో మీకు – రాస్తున్నాలేఖ
అవమానంగాతలచక – అదోబిరుదమీకూ

(ఈ కవిత చలసానిప్రసాద్‌గార్ని ఉద్దేశించి రాసాను. శ్రీశ్రీ ప్రసాద్‌గార్ని ముద్దుగా కైక అని పిలిచేవారట అందుకే కైక పేరుతో చలసానికి లేఖరాసాను)

# 26. గతితప్పిన ప్ర.నా.మం!

అభ్యుదయ కవిత్వంలో – అగ్గిఆరిపోయిందా
విప్లవగీతాలలోన – విలువజారిపోయిందా
సోషలిజం మాటలన్ని – సొల్లువాగుడయ్యిందా
ప్రజాకవిత పద కవితకి – ప్ర.నా.మం.లు చేసిందా
నరునికంటె హరునిసేవ – నాణ్యతలో ముందుందా
సుత్తీకొడవలికంటే – తంబురమేలంటారా

ఎరుపుకి కాషాయానికి - ఎంత దూరముందిలే
పరపతి తగ్గిందంటే - తిరపతికే పరుగులే
దేవుళ్ళని కీర్తించగ - దేవేంద్రుని హక్కులే
చెక్కభజన చేసేందుకు - చక్కగ తరిలారులే
జనం పాట పాడితేను - జల్లలు పిడిగుద్దులే
జగన్నాధు భజనచేస్తె - లడ్డూ పులిహోరలే
ఎర్రకార్యకర్తలార - ఎందుకింకమౌనం
దేవరాజు పిలుస్తుంటె - దేనికింకదైన్యం

(ఈ గేయం 24.8.09న జ్యోతి దినపత్రికలో ప్రచురించారు. ప్రజానాట్యమండలి పెద్దన్న దేవేంద్రగారు తిరుపతిలో ఆలాపనపేరుతో ప్రచారం చేస్తూ ఇకపై అన్నమయ్యకీర్తనల్ని కీర్తించాలని అన్నారని దానికి నిరసనగా రాసాను)

# 27. దీటుమాట!

అభ్యుదయ కవిత్వంలో - ఆరిపోయినట్టి అగ్గి
తంబురలో పుట్టిందా - తంబీ ఇన్నాళ్ళకూ
వాయిద్యాలపై నాకు - వైరమేమి లేదుగానీ
వాయించేవాడు - వాగువచాలత్వంపైనే
ఎర్రజెండ మడతపెట్టి - తంబురానుపట్టినోళ్ళు
దొంగే దొంగా దొంగని - వెనకబడినచెనటివాళ్ళు
కష్టజీవికళ్ళల్లో - కర్రులుపెట్టేవాళ్ళే
ప్రజాకవితనొదిలిపెట్టి - పరబ్రహ్మపాచిపాట
హరికథకీ జన ఎదకీ - తేడా తెలియనివారు
జనంగుండె జంధ్యెంతో - ముడిబిగించజూస్తారు
కులవివక్షలోనెవుంది - కుట్రంతా తెరిచిచూస్తె
కులవివక్ష అంటేనే - కులంనిలిచివుండాలని
చేసే పోరాటంలో - నీతెక్కడ నిజమెక్కడ
బషీర్‌బాగ్ బలిదానం - బాబుగారికర్పితం
ముదిగొండా అమరత్వం - రాజుచేతికంకణం
ఏరోటికి ఆపాటే - మాధుర్యం అయినప్పుడు

కప్పలరాజ్యానికి - సర్పాలేకద రాజులూ
గాజు కొంపమాకులేదు - కవిత తప్ప రాళ్ళు లేవు
ఆలాపన పేరుతోడ - పేలాపన మానండి

(24.8.09 నా వ్యంగ్య కవిత - సుత్తీ కొడవలి కంటే - తంబుర మేలంటారా అనేదానికి వ్యతిరేకంగా, 21.9.09న జ్యోతిలో తంబురాను తాకితే - కాలిపోతావుసుమీ అంటూ, సాహితి అనే ఆడో మగో తెలియని రచయిత ఒక వ్యంగ్య గేయం రాసారు. దానికి జవాబుగా నేను ఇదే రోజున ఈ వ్యంగ్య గేయం రాసి పంపాను. కానీ జ్యోతివాళ్ళు ప్రచురించలేదు.)

# 28. గతం!

రోజూ ఉదయాన్నెలేచి - గోడకేసి చూస్తున్నా
గోడపైన రాతలన్ని - గుండెల్లో మోతలే
వాస్తవాలు తెలుసుకొనీ - నిస్తేజం ఒదులుకొనీ
యువతరాన్ని పిల్చిచూపి - నవతరాన్ని మేలు కొలిపి
బోధలెన్నొ చేసి చేసి - బాధలకారణంతెలిపి
సమతకొరకు సాగాలని - సమరం సాగించాలని
విజయం సాధించువరకు - విప్లవాలెశరణ్యమనీ
అని చెప్పుతు ఆశయాల - బాటలోనె పయనిస్తే
కనిపెట్టిన కలవారలు - కుటిలాత్ములు కఠినాత్ములు
రాతలన్ని చెరిపినారు - రాసినోళ్ళనలిపినారు
రేపటి సూర్యోదయాన్ని - రూపుమాపజూపినారు
సాగరాన్ని గట్టువేసి - సాగిరాకు అన్నారు
ఉరుములపై హుంకరించి - ఉరితీస్తామన్నారు
అంభుదిపై బాంబులేసి - అణచివేస్తమన్నారు
చెదరగొట్టి అదరగొట్టి - పగటిని చీకట్లొనెడితె
ఉప్పొంగే ప్రజలురేపు - కప్పెడతారని తెలియక
గొప్పలేవో చెప్పుకుంటు - ప్రజలపైన గర్జిస్తే
జనమేతమ విముక్తినీ - సాధింతురు ఛేదింతురు

# 29. స్వాములా? పాములా?

స్వాములోళ్ళతీరుజూస్తె - పాములైనజడుస్తాయి
భక్తులమూఢత్వానికి - భలేబహుమతిస్తున్నారు
నిఘాకంటిపడేసరికి - దగా ఏమిలేందంటరు
మగాడినే కాదు నేను - సవాలంటు తీస్తున్నాడు
నిజమేనని నమ్మినోళ్ళు - కాళ్ళుకడిగి తుడుస్తుండ్రు
సమస్తాన్ని సమర్పించి - స్వామిజపం చేస్తున్నరు
జుట్టుబాగపెంచినోడు - పొట్టబాగపెంచినోడు
కాషాయం కట్టినోడు - కట్టుకథలు అల్లినోడు
మత్తుమగువమరిగినోడు - మందికొంపముంచినోడు
వీరే మన దేవుళ్ళట - దేవిరింపువీరినేను
మంత్రిగారు దండమెడితె - మనమేమాత్రం అంటూ
ప్రజలు కూడా స్వాములపై - పడిపడిమొక్కారంటా
ఈ సంగతి ఎలావుందో - వివరిస్తావినండీ
రాజుగారిరోగానికి - రోజూనడమన్నారట
గుడిచుట్టూ రాజుగారు - గుడిగుడిగుంజం తిరిగితె
రాజెందుకొతిరిగెననీ - మంత్రిగారు తిరిగెనంట
మంత్రివెనక సైన్యమంత మరల మరల తిరిగారట
కాళ్ళుపీకి రాజుగారు - కూలబడితెమంత్రిజూసి
తాను కూడ కూలబడెను - కళ్ళుతిరిగి తలతిరిగీ
మంత్రివెనకతిరిగినట్టి - మతిమాలిన సైన్యమంత
తిరిగితిరిగి కూలబడిరి - తిరగలేక పడిపోయిరి
రాజు తిరెగె రోగానికి - నిబంధనగ నివారణగా
ఆ సంగతి తెలియకనే - అందరు గిరగిర తిరిగీ
ఆయాసంవచ్చిఅంత - అదనపురోగంతగిలే
అదేరీతిజనం కూడ - ఆలోచనగాలికొదిలి
ఏదోతమకొరుగుననీ - ఏభ్రాసులనాశ్రయిస్తె
ఒరిగేదేమీవుండదు - గొరిగేదే జరుగుతుంది

(నిత్యానందస్వామిపై రాసింది)

# 30. ఆగ్రహజ్వాల!

మా పిల్లల మానాలూ ప్రాణాలను
హరియించిన ధూర్తులార
మామానాలను మా ప్రాణాలను
మసిచేయగలేలేవండి
అనినగ్నంగా నడిరోడ్డుపైన – మణిపూర్ మహిళలు నిరసనగా
మార్క్సిస్టులు ఆ రెండూమూసుక – మౌనంవహించి రానాడు
వేనవేల ప్రజ విషవాయువులకు – బలి అయిపోయిన పేదలకూ
లక్షలాది ప్రజక్షతగాత్రులుగా – మిగిలిపోయినా దీనులకూ
నేనున్నానని ఎవ్వడుకూడా – ముందుకు రాలేదానాడూ
హంతకులకు ఆనందంగొలిపే – వింతతీర్పులూ గుడ్డిగచెపితే
వామపక్షాలువాతంసోకి – చతికిలపడిరీ ఈనాడు
ధరలుపెంచితే ధర్నాల్జేసీ – జీతాలకు పోరాటంజేసీ
ఉద్యోగాలకు ఉద్యమమయ్యీ – కాకలుతీరిన కమ్యూనిస్టులు
కాకులపాటీ కాలేరా – అమెరికాకు భయపడ్డారా?
ఓట్లవేటలోపడ్డారా?!

(30.6.10, మణిపూర్లో ఆనాడు సైనికుల అత్యాచారాలకి వ్యతిరేకంగా మహిళలు నగ్నంగా సైనిక కార్యాలయం ముందు నిలబడి నిరసన చేసినా, భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో అన్యాయం తీర్పు యిచ్చినప్పుడైనా కమ్యూనిస్టులు స్పందించకపోవటం చూసి రాసిన కవిత ఇది)

# 31. మామూలే!

ఇవరయ్యవ మహాసభలు – ఇరగదీసివేసాయట
అయినా నా బెంగాలుపైన – అసలు భయం పోలేదట!
బూర్జువపార్టీలబుద్ధి – కిటుకు తెలుసుకున్నారట

అయినా ఆపార్టీలతో - అనుబంధం ఒదలరంట!
నిన్నటివరకూ పిల్లిని - పిల్లీ అని పిలిచారట
మార్జాలం పేరుతోడ - రేపుమార్చివేస్తారట
మార్క్సిస్టులు ఎంతైనా - మహాగొప్పమేధావులు!
ఏ రోటికి ఆ పాటను - ఎంచక్కా పాడగలరు
కాంగీతో కలాపాలు - కాలంచెల్లిన పాటలు
రాబోయే రోజుల్లో - బాబుతోనే సయ్యాటట
సీపీఎం నిర్వాకం - చెప్పుకునేదేముందీ
చేసిన పొరపాటులకూ - చెంపలేసుకుంటూనే
రేపుమళ్ళీ అదేపనిని - ప్రాపరుగా చేస్తారట
ఉన్నబలం ఊడిపోయి - అడుగుజారిపోవటమే
ఈతీరుగ సిద్ధాంతం - తీరుమార్చుతారంటా!

18.8.10 (ఆగస్టు 7 నుంచి 10 వరకు జెజవాడలో జరిగిన సిపీఎం మహాసభల్లో తీర్మానాలు చూస్తే గతంలో చేసిన తప్పులే భవిష్యత్తులో కూడా అనుసరిస్తున్నట్లు అర్థమవుతుంది. దిద్దుబాటు చర్యలూ నూతన విధానాలంటూ పాత పద్ధతులే అనుసరించటం చూసి ఈ వ్యంగ్య కవిత రాసాను)

# 32. పారాహుషార్!

మందులతో మనుషుల - ప్రాణాలను కాపాడుబదులు
ప్రాణాలకు ఎసరుపెట్టు - ప్రయోగాలు చేస్తారా!
పేద ప్రజల ప్రాణాలూ - పేడకంటె హీనమా
మంత్రుల కౌగిళ్ళలోన - మందులోళ్ళు కులాసా!
అర్ధరూపాయి మందుబిళ్ళ - అరవందకు దాటినా
అడిగే నాధుడే ఎవడూ - అగుపడలేదనేగా
కంచే చేసునుమేసే - వంచకులా పాలనలో
కళ్ళు తెరవకుంటే - మనబతుకు వల్లకాడే!

# 33. ఇంకానా?!

అయ్యా ఓ ముఖ్యమంత్రి - అందుకోండి విన్నపం
అగ్గిలాగ మండుతున్న - అప్పన్నాభూమిగొడవ
అర్పివేయురోజెపుడో - అర్జెంటుగ చెబుతారా
విముక్తికెపుడు విమోచనో - వివరంగా చెపుతారా
ధర్మాసూపత్రిని మా - ఖర్మకు ఒదిలేసారా
పాతటవును కాలుష్యం - పాతరేసి వేస్తారా
గంగపుత్రులను పోర్టుకి - బలిదానం చేస్తారా
కార్పొరేషనవినీతికి - కందెనవరొచెపుతారా
బీఆర్టీయస్‌ను చూస్తె - భయ్యాలేమిగిలినాయి
కేంద్రానికి మేమెందులో - తక్కువేమికాదంటూ
రాష్ట్రమంత అవినీతిలో - రంకెలు వేస్తుందండీ
కొనలేకాతినలేకా - జనంనలిగిపోతుంటే
పంటగిట్టుబాటులేక - రైతులు ఉరివేసుకుంటె
అంబానీలతొవిందులా - సంబరాల్లో మునిగారా!
ఏముఖాల్తొ ఎన్నికల్లో - ఓట్లు అడగవస్తారు
ఇంకానా సాగవండి - ఇకపై మీకు తంత్రాలు

(26.3.11)

# 34. వీళ్ళా ప్రజాప్రతి‘నిధులు’!

అరుగరుగో మనయంపీ - అసలుసిసలు శివభక్తులు
పరమేశ్వరుపదచెప్పులు - ప్రజలకు కనబడరెప్పుడు
నడుముచుట్టు పట్టుపంచె - మెడలోరుద్రాక్షమాల
ఒడలంతావిబూదీ - నుదుటనుకుంకుమబొట్టూ
ఒకచేతిలొకమండలం - వేరొకచేతిలొ తులసిమొక్క
అహొా అపరనందీశ్వరు - నవతారంసారుమీరు
అయ్యా ఎంపీగారు - అందుకోండివందనాలు

వాల్తేరును ప్రత్యేకపు - జోనుగ ఏర్పరచమనీ
స్టీలుప్లాంటు కొక్కటైన - 'గని'కేటాయించమనీ
కోరికోరి గెలిపించీ - కోరినాము పోరినాము
గంధర్వులవలే మీరు - గగనవిహారమె తప్పా
నేలమీద నరులగోడు - ఏనాడూ వినలేదూ
నేలపైన నడిచేమన - రైళ్ళంటె అసలుపడవు
దువ్వాడా మీదనుండి - దౌడుతీయురైలుబళ్ళు
విశాఖకూ రప్పించీ - విశ్వాసం నిలుపుకోండి
అన్నా విన్నారుకాదు - అసలు సమస్యాదిలేసీ
తులసిమొక్క తీసుకోండి - ఇంటిలోన పాతుకోండి
తూర్పుదిక్కు తిరగండి - ముక్కంటికి మొక్కండని
ముచ్చటగా చెప్పినారు - శివలింగం పట్టినారు

**(సుబ్బిరామిరెడ్డిగారు రైల్వేజోన్ గురించికాక విమానాశ్రయాల గురించే మాట్లాడుతుంటే గుండె మండి రాసిన కవిత)**

# 35. (అ)ప్రయోజకులు!

అమ్మా ఎంపీగారూ - అందుకోండి వందనాలు
లోకమంత తిరిగినారు - లెక్కలెంతొ దంచినారు
పెద్దపెద్ద వాళ్ళందరి - ప్రశంసల్ని పొందినారు
ఆంధ్రులకూ మీరిచ్చిన - అభయంమరిచారేమి!
వేలకోట్ల ఆదాయం - రైల్వేలకు అందించిన
వాల్తేరును ఒదిలిపెట్టి - ఒడిస్సాకు తరలించిన
రైల్వే జోనును కోరితె - రైటంటిరి సై అంటిరి
అదిగదిగో రైల్వేజోనూ - వచ్చేస్తుందన్నారూ
మమతలేని మమతమ్మకు - మరీమరీ చెప్పినారు
అభయమిచ్చినారంటూ - అధినేత్రికి మొక్కినారు
అయినా మీమాటలనూ - అడుసులోన త్రొక్కారా!
అమాయకులు ఆంధ్రులనీ - అన్యాయం చేస్తారా

గుజ్జర్లం కాదు మేము - గుబులుపుట్టుపోరుజేయ
అరబ్బులం కాదుమేము - నాయకులను గద్దెదింప
సహనంలో గార్ధభాల్ని - సైతం ఓడించగలం
శౌర్యంలేచిందంటే - సాధించేతీరుతాము

## 36. తప్పటడుగులు!

మొన్న ఆలయ ప్రవేశాలూ - నిన్న అన్నమయ్యభజనలు
నేడు తత్వాశాస్త్రనీతులు - భక్తిఉద్యమభజనగీతులు
ఎక్కడికి మీ ప్రయాణాలు - ఏమిటోయ్ ఈ ప్రలాపాలూ
నిన్నచేసిన తప్పులకుమరి - నేడు చెంపలువేసుకుంటూ
ముఖ్యమంత్రే ఒక్కప్రక్కన - ముక్కిమూల్గిచెప్పుతుంటే
వేరొక్కప్రక్కన పంతులోళ్ళూ - మతపుస్వామికి మొక్కుతుంటే
కార్యకర్తల మెదడులోనా - కందిరీగలమోతలాయే
ఏది సత్యమొ, ఏదసత్యమొ - బోధపడకాబుర్రచెదిరే
ప్రగతిశీలుడురామానుజుడా! - శంకరునిపాదాలెదిక్కా!
ఎవరినుంచోయ్ నేర్చుకోవలె - ఎవరుమాకూ మార్గదర్శులు
తత్వశాస్త్రము తరచిచూసీ - వర్గపోరును నేరవాలా!
చెట్టుచెడిపోయేటిముందూ - కుక్కమూతీపిందెలట్లా
మార్క్సిజానికి మచ్చదెచ్చే - మూర్క్సిజం పనిలే ఇదంతా!

(21.3.11, మార్క్సిస్టు సిద్ధాంత పత్రికలో స్వాముల్ని స్తుతించడం చూసి రాసింది)

## 37. చైతన్యకిరణాలు!

కవులంటే, కందుకూరి, గురజాడ, శ్రీశ్రీలే? చెరబండా
పురిపండా, ధనికొండా, చలం, రంగనాయకమ్మ, మధు
రకవీ, కరుణశ్రీ, శ్రీనాధుడు, పోతన్నా, తిక్కన్నా, జక్కన్నా
నన్నయ్యా, వేమన్నా, భీమన్నా, సూరకవీ, జరుకుశాస్త్రి

క్రిష్ణశాస్త్రి, విశ్వనాధ, భవభూతీ, కవికోకిల, శివారెడ్డి
సి.నా. రెడ్డి, రా. రా. రెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, కవిరాజూ
రసరాజూ, బసవరాజు, దేవరాజు, ఎండ్లూరీ, మద్దూరీ
ఏకాంబర, కాళిదాసు, పెద్దన్నా తిమ్మన్నా, ఎర్రాప్రగడ - రామ
రాజభూషణుండు, చిలకమర్తి, పానుగంటి, శ్రీపాదా, మల్లాదీ
ఆత్రేయా, వేటూరీ, సముద్రాల, దాశరధీ, కాళోజీ, జాలాదీ
ఆరుద్రా, జ్వాలాముఖి, జాషువా, తెరేషుబాబు, సతీష్
చంద్ర, గోపీచందు, ప్రేమచందు, శరత్‌బాబు, దిగంబరులు
అనిసెట్టీ, ఆదిభట్ల, నారాయణబాబుగారు, నండూరీసు
బ్బారావ్, పింగళి సూరన్నగారు, వాసిరెడ్డి సీతమ్మా, కనపా
కా వరలక్ష్మి, మొల్లమ్మా, ఘంటసాల నిర్మలమ్మ, ముద్దు
పళని, మొక్కపాటి సుమతమ్మా, జయప్రదా, ఓల్గా, మనవం
టిల్లూ విమలమ్మా, బుచ్చిబాబు, చిట్టిబాబు, ఆచంటా జానకి
రామ్, వాకాటీ బలివాడా, పింగళినాగేంద్రరావు, సుద్దాలా
వంగపండు, వెంకన్నా మాస్టర్జీ, అందెశ్రీ, పాణిగ్రహి, చాసో
చౌడప్పగారు, రామలింగ- భీమకవీ, దీక్షితులూ, భట్టుమూర్తి
మల్లాదీ, ధూర్జటి, కొప్పరపు కవులు, గంగాధర బాలతిలక్
శృంగారపు మధుబాబూ, కొమ్మూరీసాంబశివుడూ, విశ్వప్రసాద్
రామలక్ష్మి, సులోచనా, వింధ్యా సంధ్యారజనీ, విశ్వప్రియ, షాజహాను
తిరుపతి వెంకటకవులూ, కుటుంబరావ్, ఆశాలత, కోడూరీ కౌసల్యా
ఎందరో మహాకవులూ వుందురు ఈ ఇలపైనా నా చిన్నా మెదడులోన
గ్నాపకాల దొంతరలో వున్నవి మాత్రమె కొన్నే వుంచినాను పేపరుపై
విశ్వమంత విస్తరించి వున్నారెందరో కవులు
ఎందరో మహానుభావులందరికీ వందనాలు

# 38. చెప్పేదొకటి..?!

అయ్యా మార్క్సిస్టులార - చెయ్యాలొక గుర్తు మీకు
ఇటీవలే జరిగినట్టి - ఇరవయ్యవ మహాసభలు

ఖమ్మంలో చేసినట్టి - కమ్మని తీర్మానాలూ
బూర్జువాల తోటిపొత్తు - బూజులు దులిపేస్తామని
అగ్రకులపు ముద్రల్నీ - అడుసులొత్రొక్కేస్తామని
మూసపద్ధతిని మూసీ - వాస్తవంకితెస్తామని
అందమైన మాటలతో - అసలు నిజం తెలిపినారు
మాటలలో చెప్పినవీ - చేతలలో చేయమనీ
రుజువు చేయుపనిలోనే - వున్నామని అన్నారు
పీఆర్పీతో పొత్తును - ఒదులుకొనీ ఓడినాము!
చారిత్రక తప్పిదమిది - చర్వితచర్వణమైనది
అంటూవాపోయినారు - తుంటరి మనసిప్పినారు
అయ్యా రాఘవులుగారూ - పీఆర్పీ లెఫ్టిస్టా!
కులం ముద్రచెరిపేందుకె - అగ్రపీఠమెక్కారా!
హవ్వా మార్కిస్టులార - ఎవ్వరయ్యమీకుసాటి
తిమ్మిని బమ్మినిజేసే - తీరులోనమీకుసాటి
చేసినతప్పులు అన్నీ - చారిత్రక తప్పిదాలే
అంటూ మళ్ళీ మళ్ళీ - అదే తప్పుచేయబోతె
చెప్పుకొనేటందుకైన - చరిత్రలో చోటుండదు
బహుపరాకు బహుపరాకు - మార్క్సిస్టు పెద్దలారా!

# 39. హవ్వ! ఇదా దారి?!

సీపీఎం అధినేతలు - చీపుమాటలాడబోరు
అడుగుజారనంతవరకు - అసలునిజం చెప్పబోరు
మాపాలన లేనాడూ - పాపాలను చేయలేదు
అంటాడొక నాయకుడూ - అవునేమో అనుకుంటాం
అంతలోనె అధినాయకు - డసలు నిజంకక్కుతాడు
సింగూరులొ చీమంతటి - చిన్నతప్పుచేసినాము
నందిగ్రాములో ప్రజలను - కిందనేసితొక్కినాము
ఇన్నేళ్ళపాలనలో - ఇవీకూడ తప్పులేనా

దీర్ఘకాలమధికారం - వలనొచ్చినరోగమదీ
ఇకపై ఆతప్పులనూ - ఇలలో మరిచెయ్యమనీ
ఇరవయ్యవమహాసభలో - ఇచ్చాంకద వాగ్దానం
అయినా పీఆర్పీతో - అంటుకట్టుకోవడం
చారిత్రక తప్పిదమని - చెంపలేసుకున్నామే
ఆత్మవిమర్శలపేరిట - అసలుగుట్టు విప్పామే!
బూర్జువపార్టీలపొత్తు - బూడిదలో పోస్తామని
అవసరమైతే తప్పా - అంటకాగతప్పదనీ!
వామపక్ష విలీనాల - వాసనింక రాలేదని
మూఢోఫ్రంటుకి ఇంకా - మూడుకుదరనేలేదని
కులభావనకూలద్రోసి - అగ్రపీఠమధిష్టించి
మాటలలో చెప్పినదీ - చేతలలో చెయ్యమనీ
చారిత్రక తప్పిదాలు - చేస్తూపోతూంటామని
అధికారం చిక్కువరకు - హస్తంపై అనలమనీ
వామపక్షవీరులార - వారధులికకట్టండీ
కాంగీదశకంఠునిపై - కదనానికికదలండీ

# 40. బాధ్యత!

సకలకళాకారులార - ఓసమాఖ్యపెద్దలార
సవినయంగ సంగతొకటి - మనవిచేస్తె వింటారా!
పేరులోనెఒక్కచోట - పేరుకుందికళలరాసి
ప్రజలకెరుకపరిచేందుకు - ప్రదర్శించెకళ ఏదీ
రాష్ట్రమంతరాజకీయ - కశ్మలంలొ మునిగిపోతె
పాలకులే పాపాలా - భైరవులుగ మారుతుంటె
మధువుల వ్యాపారంలో - వెధవలుగా రుజువైతే
అవినీతిలొ అగ్రపీఠి - మెక్కినిక్కినీల్గుతుంటె
కూడుగూడులేక ప్రజలు - గోడుగోడుమంటుంటే
భూమినంత దోచినోళ్ళు - బూర్జువలైమారిపోతె
ప్రజాధనందోచుకెళ్ళి - విదేశాలదాచుకుంటె

ఇదేమనీ అడిగినోళ్ళు - ఇలలో లేకుండపోతె
కళాకారుడన్నవాడు - నిరాకారుడవగలడా
కుళ్ళును కడిగేయాలీ - కళ్ళను తెరిపించాలీ
ప్రజాసమూహాలలోన - చైతన్యంనింపాలీ
రజాకారపాలనపై - రగిలిజ్వాలలవ్వాలీ
నేరస్తులే నేతలైతే - నేరమెరాజ్యంఏలితె
చూస్తూ మనమూరుకుంటె - మనమూ నేరస్తులమే!

# 41. జీతంలేని బానిసా!

నారీలోకం నడుంబిగించీ - కదనరంగముకుకదలండి
ఎన్నాళ్ళీ అసమానతలంటూ - ఎలుగెత్తి నిలదీయండి
బిడ్డలపెంచీ - గుడ్డలు ఉతికీ - మలమూత్రాదుల మలినం తీసీ
పంటచేలలో ఒంటిని ఒంచీ - శరీరశ్రమతో సంపదపెంచీ
ఇంటికి చేరిన స్త్రీమూర్తులకూ - ఇంకా ఒదలని క్రూరదాస్యమే
సమానపనికీ సమానవేతన - మెక్కడవుందని అడగండీ
తిట్టినకొట్టిన నోరెత్తవనీ - సహనంలో భూదేవతవంటా
సరుకులేని ఆ చచ్చుబుర్రకీ - సలహాలిస్తే మహామంత్రివట
వేశ్యలతో నినుసరిపోల్చుటకే - పడకటింటిలో రంభవు అంటా
ఉన్నది అంతా వూడ్చిపెట్టమని - మేతమేపుటలొమాతవిఅంటా
కపటపునీతుల కవ్వింపులతో - ఉబ్బిస్తుంటే తబ్బిబ్బవకు
కుటిలనీతులూ కుళ్ళుచేతలూ - రాసిన రాతలెగేసిన గీతలె
కాటేసెమనీ ప్రగతినితల్లీ - కానేకావవినీతులుచెల్లీ
ఎవడో ఒకడికిపెళ్ళమైనదని - పదుగురికెరుకగతాళిని కడితే
వాడొకదానికి మొగుడైనాడని - ప్రజలకి తెలియుటకేదీగుర్తు!
అన్నిటిలోనా సమానమైతే - ఆడదె ఎందుకు కట్నం తెచ్చుట?
నస్త్రీ స్వాతంత్రమర్హతీ అని - మొరిగే మగభైరవులనుజూసీ
దుర్మార్గుల పాపాలకు శిక్షలు - వేయగకదిలీ వేగమెరండీ
స్వంత ఆస్తిఅనురంతువ్యవస్థలొ - సంక్రమించినా సవాయిరోగం
వ్యక్తి ఆస్తినే రద్దు చేయగా - శక్తులైమీరులేవండి

పురుషస్వామ్యం తుదముట్టించగ – దోపిడీపై ధ్వజమెత్తండీ
సమతకు మమతకు మార్గంవేయగ – సమరశంఖమును ఊదండి

# 42. మేలుకోండి!

అయ్యా మార్క్సిస్టులార – చెయ్యాలొక విన్నపాన్ని
టీ.వీ, సినిమాలె ప్రజలను – గ్రేవీ చేసేస్తుంటే
గుడ్డలూడదీసి స్త్రీల – గుట్టు బయలుచేస్తుంటే
నీతిలేని బూతుపనులు – నిత్యం చూపిస్తుంటే
చిత్తకార్తెకుక్కల్లా – పెచ్చరిల్లి పోతుంటే
రంకుబొంకు పాటల్తో – రంకెలు వేసేస్తుంటే
కన్యలపై కుర్రాళ్ళకు – కైపెక్కక వుండేనా
ప్రేమపేర కామానికి – కట్టుత్రెంచి ఉరికేనా
ఎదురుతిరిగితే వారిని – హతమార్చక ఒదిలేనా
బూతు డ్యాన్సుతోడనీతి – పాతరేస్తు వుంటేనూ
ఇంత జరుగుతున్నా – మనమెంత నిద్రలోవున్నాం
ప్రజానాట్యమండలిపని – రుజగ్రస్తమయ్యిందా
ప్రజలనొదిలి పడకటింట్లో – పడకలేసి పడుకుందా
అఘాయిత్యములు చూడక – అధోలోకమునవుందా!
అంధకార మలుముకున్న – అంధురాలు అయ్యిందా
ఆడలేని పాడలేని – అయోమయంలోవుందా
జనతను కదిలించలేని – జడత్వంలొ మునిగిందా!
చైతన్యం రగిలించే – చేవచచ్చిపోయిందా
దోపిడీపై తిరగబడే – దోవతప్పిపోయిందా
కళలు ప్రజలకోసమనే – గళం మూగపోయిందా
అన్నమయ్య భజనలోన – అణిగిమణిగిపోయిందా
సమతకు మార్గంచూపే – మమత చచ్చిపోయిందా
మహాకవే మెచ్చుకున్న – ప్రజానాట్యమండలికీ
మహామేహారోగమేదో – సహా సంక్రమించిందా
పోరాడే స్ఫూర్తి తగ్గి – చివరికిలా మిగిలిందా!

# 43. స్వార్థం!

అయ్యానోములవారూ - పలకండీ ఒకమారు
తెలంగాణకొరకుమీరు - తెరిచారెప్పుడునోరు
ఇంటిపోరుచేశానని - అంటేసరిపోతుందా
వీధిలోనమీగొంతూ - వినలేదేమీతంతూ
సీపీఎం మీకిప్పుడు - సీటుఇవ్వననేసరికి
కేసీఆర్ గొప్పతనం - బేషుగకనిపించిందా!
మధుకంటే చందురుడే - నదురుగకనిపించాడా
సుత్తీకొడవలికంటే - కారుకినోరూరిందా
సొంతలాభమునకే - సిద్ధాంతం తలవంచిందా
బూర్జువాలదీర్ఘపొత్తు - బుద్ధినిలామార్చిందా
స్వామీపెనుమల్లిమధూ - ఏమీఈ పరిణామం
ఎటుచూస్తే - అటుచీకటి
నిట్టూర్పులు - నిరాశలూ
పొత్తుకుసైతం ఎవడూ - ఎత్తుకుందమన్నరాడు
ఓట్లకొరకుసీట్లకొరకు - పడుతున్నారెన్నిపాట్లు
అయినా దక్కని ఫలితం - అయ్యవారికప్పుదాట్లు
బూర్జువాలతోటి పొత్తు - పర్యవసానం అంతే
ఓట్లతోడ సోషలిజం - వస్తాదనుకుంటె ఇంతే

# 44. పర్యవసానం!

ఏపీలో ఎర్రన్నల - తీరుచూడుఎలాగుంది
భస్మాసురహస్తమె - మానేస్తమంది ఒక పార్టీ
కాంగీ బీజెపిదొందు - దొందేనందొకపార్టీ
గులాబీలతో చెలిమీ - ఎలాతప్పునన్నదొకటి
జగనైతేం కిరణైతేం - జతకడతామన్నదొకటి
ఖమ్మంలోమాత్రం మరి - కయ్యానికి సై అన్నాయ్
ఒంటరిగా ఎన్నికల్లో - సాగలేక కామ్రేడులు

ఏ తుంటరి వాడైనా – ఏకమౌదమన్నారు
సీట్లకొరకు సిద్ధాంతం – చీట్లపేక ఐతేనేం
ఎలక్షన్లొ గెలిచేందుకు – ఎవడితోడపోతేనేం
ఆటలోన అరటిపండు – మార్క్సిస్టులు మేడిపండు
తూఛ్ నాబొడ్డంటూ ఇక – తుడిచేసార్లే సరి సరి!

# 45. ఎ(వు)త్తుగడలే!

నిజంగానెకమ్యూనిజం – నిజాయితీమీకుంటే
బూర్జువాలజెండాలను – భుజాలపైమోతెందుకు
పెద్దవైరినెదిరించగ – చిన్నవైరితోజట్టా
చిన్నోడేపెద్దోడై – గద్దెనెక్కుతాడు రేపు
జనంమీదజులుంచేసి – జెయిళ్ళలోకుక్కుతాడు
కాంగీపెద్దోడైతే – కలిపొరానాడుచేయి
మతోన్మాదబీజేపీ – జనతాతోజతకట్టిరి
మీమాటలునమ్మమనీ – మొమాటంలేకుండా
అందలాలనుంచీ మిమ్ము – కిందకి దింపేయలేదా
ఏరోటికి ఆపాటా – ఏ ఎండకి ఆ గొడుగూ
పట్టేవాడెవడైనా – ఒఠ్ఠి దోపిడీగాళ్ళే
బూర్జువాలపొత్తువలన – బుద్ధులుమీకొచ్చాయా
హవ్వమార్క్సిస్టులార – ఎవ్వరయ్య మీకు సాటి

# 46. తెరవండికళ్ళు!

వీధికొక్క వినాయకుడు – గల్లీకొక గణాచారి
ఊరికొక్కపేరిగాడు – జిల్లాకొక జిత్తులోడు
రాష్ట్రంలో రాబందులు – దేశంలో కామందులు
వీరేమన ఏలికలట – వీరే మన పాలకులట
నాలుగు లక్షలకోట్లూ – నంజుకుదాచేసినారు
అరువదేళ్ళ స్వాతంత్రం – కరువుదరిద్రం మోసమె

మళ్ళీ ఒస్తున్నారోయ్ - ఎన్నికలా మాయలోళ్ళు
తెల్లకారులోనవచ్చి - నల్లడబ్బు పంచుతారు
మళ్ళీ గెలిపించామా - వల్లకాడె మనబతుకులు
భారతీయ పేదలార - బహుపరాకు బహుపరాకు

# 47. వ్యర్థం!

కూటికోసం కూలికోసం - పొట్టచేతను పట్టివెళ్ళిన
పోలీసులపై గుండుపేల్చిన - వీరాగ్రేసరఅన్నలారా
వర్గశత్రువు పైన యుద్ధం - వ్యర్థమని తలచార ఇప్పుడు
అడ్డుదారులు త్రొక్కితే అది - దొడ్డవిప్లవ కార్యమగునా
శత్రువెవరో కానిదెవరో - వేరుచేయుట మరిచినారా
దోపిడోళ్ళకాపలోళ్ళను - రూపుమాపితె రాదుమార్పు
గుండెపైనా గుండుపెట్టీ - ప్రజలభావం మార్చుతారా
జులుం చేసిబలంచూపీ - ఓట్లపై భ్రమత్రుంచుతారా
భావవిప్లవ మొలకలేనిదె - ఆయుధము ఆముదముతోసరి
తెలుసుకొండోయన్నలారా - తెలియకుంటే మిగులుసున్నా

# 48. అలుసు!

టిక్కెట్లకైఎన్నో - ట్రిక్కుల్ని చేసారు
తెలుగుతమ్ముళ్ళమధ్య - తగువులేతెచ్చారు
జెండాలు మోసినా - తండాలనొదిలేసి
కార్యకర్తలగోల - కాకిగోలగకట్టి
సుజనభజనలుచేసి - గజనీలకాసీటు!
అది చూసి తమ్ముళ్ళు - అగ్గిపిడుగులయ్యారు
ఆఫీసు అద్దాల్ని - రూపుమాపేసారు
కుర్చీలు బెంచీలు - కుమ్మిఒదిలేసారు
అన్నపైకోపాన్ని - దున్నపై చూపారు

ఎన్నిచేసినగాని - కన్నెత్తి చూడనీ
అన్నగుండెలు - ఉక్కుగన్నులే అన్నారు
ఆ వేశమణుచుకొని - ఆగ్రహం చంపుకొని
మన్నుతిన్నా పాములల్లె - కూర్చున్నారు!

# 49. నినుబ్రోచేవారెవరురా!

సర్వలోకరక్షకులకు - సమస్యొచ్చిపడిందంట
కళ్ళెదుటే తమసొమ్మును - కైంకర్యం చేస్తుంటే
చింతాకూపతకాన్నీ - సీతమ్మదిలాగేస్తే
తమ్ముడినగలను కూడా - కిమ్మనకుండాతీస్తే
అరివీరభయంకరుడూ - అస్మదీయబంటుగారు
హనుమంతుని చేతిలోన - కనకంగదలాగేస్తే
నన్నుకూడ ఒదలకుండ - నిలువుదోపిడీచేస్తే
ఏంచేసేశక్తిలేక - శిలలాగేనిలుచున్నా
గుడినంతామింగినోళ్ళు - లింగాలనూ ఒదలరనీ
బెంగతోడకుంగిపోయి - చీకటిలో నిలుచున్నా
ఎవ్వరికీచెప్పలేక - సిగ్గులోనమగ్గినాను
మానగలను దోచినోళ్ళ - మమ్ములవంచించినోళ్ళ
నెవ్వరుపట్టించగలరు - కాపాడేదెవ్వరంటు
రక్షణకై విలపిస్తూ - భద్రతకై పిలుపిచ్చా!

(12.4.14 - ఒక ఊళ్ళో రామాయలంలో దొంగలుపడి నగలతోబాటు హుండీకూడా ఎత్తుకెళ్ళారన్న వార్తకి స్పందించి రాసింది)

# 50. తుస్!

ఆంధ్రానీ సింగపూరు - చేస్తాననె అయ్యలూ
సిగపూరుచరితింటే - కంగుతినకమానరు
అవినీతే ఆత్మహత్య - చేసుకుంది ఆదేశం

అవినీతిని ప్రశ్నిస్తే - హత్యే ఈ దేశంలో
ఆ దేశపు అభివృద్ధికి - అపరభగీరధుడు "లీ"
ఈ దేశంలో పేరుకి - ఒక్కడైన చూపా"లీ"

# 51. నిజం!

దేవుడికే ఎసరుపెట్టి - దేవాంతకులున్నారు
గుడిని అమాంతం మింగె - గురువులరు గొకొల్లలు
లింగాలను మింగేసే - దొంగలకూకరువులేదు
పరమాత్ముని సంపద - ఆపాపాత్ములు దోచేస్తే
పాపం ఆ రాతిబొమ్మ - పలికేనా ఉలికేనా
వివేకమే మీకుంటే - వివేచనే కొంతుంటే
**గుడుల సంపదంతా - ఇకబడుగులకే పంచండి**
**మానవసేవే మాధవ - సేవన్నది తెలియండి**

(లక్షలకోట్ల బంగారు నగలున్న ప్రపంచకోటీశ్వరు శ్రీఅనంత పద్మనాభుడు, అతని సొమ్మును కూడా కొందరు దొంగతనంగా తరలించి అమ్మేసుకొని అనుభవిస్తున్నారన్న వార్తకి స్పందించి రాసింది)

# 52. (అ)న్యాయం!

చుండూరా అదిఎక్కడ?
దళితులహత్యా - ఎప్పుడు?
ఏరోజున చచ్చారో - ఎవరు కూడ తెలపలేదే
అయినవారు కూడా - ఆ హతులవార్త చెప్పలేదే
కిందికోర్టుతీర్పు మిధ్య - దళితుల హత్యలు మిధ్యే
చుండూరెమిధ్య - అసలు హంతకులంతా మిధ్యే
హంతకబంధువులబాధే - సొంతం వినిపిస్తోంది
అదివింటే మామనసూ - ఆందోళన చెందుతుంది
అందువలనె హంతకులను - నిర్దోషులుగా తేల్చాం

ఇకనైనా ఉభయులింక - చేయిచేయి కలపండి
పోయినోళ్ళువస్తారా - జరిగిందొక పీడకలే
అంతగాను తలపోస్తే - తెలుగుసినీకథనుకొండి
న్యాయమూర్తులకు - జోడీచేతులుజోడించండి

(23.4.14 - చుండూరు దళిత హంతకుల్ని నిర్ధోషులుగా హైకోర్టు న్యాయమూర్తిచ్చిన అన్యాయపుతీర్పుకి స్పందించి రాసింది)

# 53. నీచులు!

తప్పుచేయనట్టిమొప్పె - నెప్పుడైనచూశారా
వయసుపొంగులోతప్పులు - రైసులోనగలనూకలు
అడపాదడపారేపులు - అతిమామూలేకాదా!
రేపిస్టులుపాపిస్టులు - కోపిస్టులులేకుండా
లోకమెక్కడున్నాదో - చూపించండొకమారు
రేప్‌చేసినంతలోన - పీకలునులిమేస్తారా
మాకే అధికారమిస్తె - పీకేస్తాం ఆ చట్టాల్
రేపిస్టుకె సీటులిచ్చి - పాపాలను కడిగేస్తాం
అంటాడీయాదవ్‌గారు - ములాయంసింగుగారు
అతని శిష్యుడితడండీ - అబూఅసీంఅజ్మిగారు
ఆయనేమికూసాడో - ఆలకించగారండి
ఆ పాపంలోవాటా - ఆడవారిదేనంటూ
మానంతోబాటువారి - ప్రాణాలను తీసివేసి
రేపిస్టులకాత్మశాంతి - కలిగిస్తాడట చేసీ
ఈ మాటలు విన్నయట్టి - శ్రీమాన్‌శ్రీదేవగౌడ
ఆవులింతలోదాన్ని - అమాంతంగ మింగాడట
ఇదీ నేటి నాయకగణ - పిశాచాలతీరుజోరు
వీరిని ప్రజ గెలిపిస్తే - ఆరిపోదాజనదీపం
ఆపైయిక పాలనంత - రేపిస్టులదౌనుకదా

**(రేప్‌లపై బీహార్ మంత్రి అబూఅసీంఅజ్మి కూసిన కూతకి స్పందించి...)**

# 54. ఆ(సా)తానే!

నారాయణనారాయణ - ఎంతమాట ఎంతమాట
సుందరయ్యప్రక్కన - ఒకదొంగఫోటోపెట్టారట
సీపీఎం నాయకులూ - సిగ్గునొదిలివేసారట
అయ్యయ్యో సోదరులూ - అంతకుదిగజారారా
అదిచూసిన మీఎదకూ - అవమానం జరిగిందా
ఆవుచేనుమేస్తుంటే - దూడగట్టునుంటుందా
తెడ్డునాకినట్టిఅత్త - బుద్ధికోడలికి చెపుటా
అవినీతిలో అగ్రజులూ - హస్తం వారన్నారే
చేతితోడచేయికలిపి - నేస్తం అయిపోయారే
ఇందిరమ్మ భజనచేసి - ఆనాడు తరించారూ
సోనియమ్మస్తోత్రాలను - చేస్తున్నారీనాడూ
దొందూదొందేనంటూ - అందరికీ తెలిసెలే
నోరేమనవిలువలకూ - దారిచూపుతుందిలే

# 55. కవిత్వమంటే..

కవిత్వమంటే - జడత్వాన్ని ఒదిలించాలి
కవిత్వమంటే - చైతన్యాన్ని రగిలించాలి
కవిత్వమంటే - వాస్తవాల్ని వివరించాలి
కవిత్వమంటే - పీడితుల్ని కదంతొక్కించాలి!

# 56. గురజాడ - నరజాడ

## (గురజాడ ముత్యాలసరాలకు ప్రతిగా నరజాడ - సత్యాల స్వరాలు)

**దేశమును ప్రేమించుమన్నా ॥ మంచిఅన్నది పెంచుమన్నా - గురజాడ**

నాది అన్నది నాలుగడుగుల నేలకూడా లేనివాడు ॥
దేశమును ప్రేమించుటెలా మంచి అన్నది పెంచుటెటులా - **నరజాడ**

**తిండికలిగితె కండకలదోయ్ ॥ కండగలవాడేను మనిషోయ్ - గురజాడ**

తిండిలేకా కండలేకా ఎండిపోయిన బండజనులను - మనుషులందామా - లేకా
దినుసులందామా - **నరజాడ**

**మతములన్నియు మాసిపోవును ॥ జ్ఞానమొక్కటె నిలిచివెలుగును - గురజాడ**

మూఢగాలికి జోరుహెచ్చెను ॥ జ్ఞానజ్యోతిని ఆర్పివేసెను
పీడితుల రక్తమ్ము త్రాగీ ॥ మతపురక్కసి రంకెలేసెను - **నరజాడ**

**ఆకులందునఅణిగిమణిగీ, కవితకోకిల పలుకవలెనోయ్ - గురజాడ**

క్రూరపాలక తీరుజూసీ కవిత కోయిల కలతచెందీ
అణిగిమణిగీ వుండలేకా ॥ ఆగ్రహంతో గొంతువిచ్చెను - నరజాడ

**ఎల్లలోకము ఒక్కయిల్లై వర్ణబేధము లెల్లకల్లై**
**వేళనెరుగని ప్రేమబంధము వేడుకల్ కురియన్ - గురజాడ**

ఎల్లలోకము గ్లోబలిల్లై వర్ణబేధముకల్మషమ్మై
ప్రేమబంధము పేలిపోయెను ॥ కామబంధము కాలిపోయెను - **నరజాడ**

**స్వంతలాభము కొంతమానుక ॥ పొరుగువానికి తోడుపడవోయ్ - గురజాడ**

స్వంతలాభమే సొంతమంతా ॥ పొరుగువానికి పొగనుబెడతా - **నరజాడ**

**మరులు ప్రేమను మదిదలంచకు ॥ మరులు మరలును వయసుతోనే - గురజాడ**

అరవైయికి ఇరవయ్యిపైనా మరులు పుట్టెను మదముహెచ్చెను
వయసుమరులకు వరసకుదురునా ॥ కురుచబుద్ధులు కుదురుకొనునా - **నరజాడ**

**కట్టుకున్నది ఏమికానీ, పెట్టిపోయక పోతెపోనీ !**

**కాచిపెంచిన తల్లిదండ్రులనైన కనవలదో! - గురజాడ**

కట్టుకున్నదికాలిపోనీ ॥ పెట్టిపోయాక మట్టికానీ
కాచిపెంచినతల్లిదండ్రులు ॥ కాటికైనా తరిలిపోనీ – **నరజాడ**

**కలిసిమెసగినయంత మాత్రమెకలగబోదేఅయికమత్యము**

**మాలమాదిగకన్నెనెవతినొమరులుకొనరాదో - గురజాడ**

కలిసిమెలిసెనుఐక్యమయ్యేను ॥ మరులుగొనెనూమనసుతెనూ
కట్నమన్నది కాంచగానే, ఐకమత్యము వైక్లమయ్యేను – **నరజాడ**

**అన్నదమ్ములవలెనుజాతులు, మతములన్నియు మెలగవలెనోయ్**

**మందగించక ముందు కడుగెయ్, వెనుకబడితే వెనకేనోయ్ - గురజాడ**

అన్నదమ్ములు చంపుకొనెను, జాతిమతములు జ్వాలలేచెను
మారణాహెూమమ్ముజరుపుట మందగించుట లేనెలేదు
వెనుకబడినది నీతిలోనే అడుగుముందవినీతిలోనే – **నరజాడ**

**మంచిచెడ్డలు మనుజులందున  ఎంచిచూడగరెండెకులములు**

**మంచియన్నది మాల అయితే  మాలనేనౌదున్ - గురజాడ**

మంచిచెడ్డలు మనుజులందున ఎంచిచూడగ ధనికపేదలె
మంచి అన్నది పేదలైతే వంచకులు ధనవంతులే – **నరజాడ**

# 57. కాదనలేం!

1) కడుపు మండుతూవుంటే – కవితెట్లా రాస్తాడూ!1)
ఆకలివేస్తూ వుంటే – శ్లోకమెటులవచ్చేనూ
బాధరేగుతూవుంటే – బోధెట్లాచేసేనూ
అప్పులు గుర్తొస్తుంటే – చెప్పునెటులహరికథనూ!

2) గడ్డపెరుగావకాయ్ – గదిలోనవుండగా
అడ్డమైనా కూర – లడుగుటెందులకూ
ఇంపైన ఇల్లాలు – ఇంటిలో వుండగా
వెలయాలికోసమై – వేటలెందులకూ!

3) ఒంటిలోబలముండి – ఇంటిలో డబ్బుండి
కంటికీనదురైన – కాంతచెంతనువుంటె
రోజులన్నీ నీకు – జాజిపందిళ్ళే
స్వర్గమన్నదినీకు – సంచిలో సరుకే!

4) ఆశయాలంటాడు – ఆవడలు తింటాడు
లక్ష్యాలపేరుతో – లంఖణాలుంటాడు
ఆచరణకష్టమోయ్ – ఆనందరావూ
అగ్గితో సమమయ్యు – అరవిందరావూ!

5) అపాయమ్ముదాటడాని – కుపాయమ్ముచెపుతాను
ఆపదలెదురైనప్పుడు – ఆదుకొనుటతెలుపుతాను
స్విస్సు బ్యాంకులోడబ్బు – సిగ్గుఒదిలితెచ్చారా
దేశంలో దరిద్రాన్ని – త్రోసిపారవేయవచ్చు
గరీబోళ్ళికాపాడీ – పేదరికం బాపవచ్చు!

6) చేసేందుకు చేవుంటే - మనసుంటే మార్గముంది
జనంధనం గుడుల్లోన - ముక్కుతుంది మూల్గుతుంది
మూధనమ్మకాల్నితీసి - మురికిగుంటలోనత్రోసి
పోగుపడిన సంపదంత - పేదకొరకు ఖర్చుచెయ్యి
బతికుండగెస్వర్గంనిను - వెతుక్కుంటువస్తుంది
పదిమందీ సుఖంగుంటె - అదిఏనోయ్ స్వర్గమూ!

7) ఇంకొక్క ఉపాయముంది - ఇది కూడా చేసిచూడు
వేనవేలఎకరాలుగ - బీడుపడిన భూముందీ
కోట్లు కూడబెట్టినోళ్ళ - చెరలోబందీఅయింది
ఆ భూమిని విడిపించీ - అభాగ్యులకుపంచిస్తే
ఆహారం పండించీ - ఆకలితరిమేస్తారోయ్
ఆపై ఈ భరతభూమి - ఆనందపుసీమేకదా!

8) మందులోళ్ళాడేటి - మాయలను చూడండి
డాక్టర్లు చేసేటి - యాక్షన్లు చూడండి
ఆసుపత్రులబిల్లె - ఆయువులు తీసేను
జబ్బుకంటే ముందు - డబ్బులే చంపేను!

9) అవినీతిలోమాది - అగ్రస్థానమ్మండి
అత్యాచారాలలో - అధికులంమేమండి
బ్లాకు మార్కెట్టులో - మాకు పోటీలేదు
శకునిమామైనాను - సెకనులోచిత్తండి!

10) అందాలను ఆరబోయి - విందేమిటిగురువరా
దోపిడి వ్యాపారులకది - వ్యాపారం మదుపురా
ఈ సంస్కృతి యువతరాన్ని - ఏతీరంజేర్చురా
అరాచకం దురాగతం - వినాశాలరేవురా!

11) కార్పొరేటు మందులతో - కళకళాలాడేటి
పళ్ళుతిన్నారంటె - పుళ్ళేమీ ఒళ్ళంత
అధికారులామ్యాము - అందుకుంటుంటేను
వ్యాపార్లపాపాలు - పండకుంటున్నాయి

12) సర్కారు ఇచ్చేటి - సన్నబియ్యంచూడు
సన్నబియ్యంపేరు - చౌకబియ్యంతీరు
పనికిమాలిన దినుసు - ప్రజల ముఖమునకొట్టి
ఉద్ధరించామంటు - ఊదరేగొడతారు

13) ప్రత్యామ్నాయంమేమని - ప్రగల్భాలు పలికినారు
ప్రజలసొమ్ముమదుపుపెట్టి - ప్రదర్శనలు చేసినారు
మందులోళ్ళ ప్రచారాన్ని - కనువిందుగచేసినారు
ఆతానులోముక్కలమని - టెన్‌టీవీచాటినారు

14) శివుడిదర్శనంకెళితే - శవాలయ్యిపోయారట
బ్రహ్మకపాలానికిపోతే - దిమ్మదిరిగిపోయారట
కేదారీనాద్‌కెళ్ళి - కేకలెన్నివేస్తేనేమి
ఏనాధుడురానేలేదు - ఎవ్వడువినలేదుగోడు
కాలుడు మాత్రం తమ - లోకానికిగొనిపోయినాడు

15) తెలుగుదేశం కాంగిరేసూ - కలిసిపోవును సమయమొస్తే
పదవికొరకైజగనుబాబూ - పట్టవచ్చును బాజపానూ
అవసరానికివరసలుండవు - అంతరాత్మకుగంతలుండవు

16) బియ్యంపాతిక అయితే - దెయ్యదిగివస్తుందని
విప్లవాలు ఆనాడే - తప్పకుండ వస్తాయని
శ్రీరంగశ్రీనివాసు - డానేడేఅన్నాడు
వందనులందుకునేందుకు - పందెంకడుతుందినేడు
బొందలెండుతున్నగాని - మందికదల్లేదుచూడు
బానిసరక్తంమనలను - బంధించెనుకదానేడు

17) గుడిలోనమూల్గుసంపద - బడికిచ్చినబాగుపడును
బడుగులు భువిలో - గుడికేలమడులుమాన్యాల్
గుడుచునెఆగుడులుబువ్వ - గువ్వలచెన్నా!

18) మూడుపాతికలకోటులు - మూలుగులాకలికేకలు
దేశమంతఘోషలతో - దద్దరిల్లిపోతుంటే
నూటికి ఎనభై మందీ - దారిద్ర్యపురొంపిలోనె
ఆంధ్రరాష్ట్రమున ప్రజలూ - అలమటించిపోతుంటే
నక్షత్రపుహెూటళ్ళలో - లక్షల విందారగించి
కూటికిలేనోళ్ళపైని - క్రూరపుపరిహాసమా
అయిదురూకలకెభోజన - మందుతుండెనందురా
లెఖ్ఖలు కావవినీచపు - ఎకసెక్కాలేనురా
కడుపునిండినోళ్ళుకూయు - కారుకూతలేనురా
కడుపుమండినోళ్ళుమిమ్ము - పంపుతారు వీటికీ

19) వందకొరకొవిందుకొరకొ - కామందులకొట్లేస్తే
రాబందులు తినేదీ - ఆశవాల్నెగానీ
ఈకామందులు జీవుల్నే - నమిలేస్తారోయ్!

20) కాంగీకమలంరెండూ - దొందూదొందే
జెండాలేవేరుగాని - అజెండాలుఒకటే
పాలోమనీ ఓట్లువేసి - అలోమనీ ఏడకండి!

21) గోచీలేకున్నయట్టి - బీసీలకె అధికారం
దళపతులెందరువున్న - దళితుడికే ముఖ్యమంత్రి
ఈసారికి గెలిపిస్తే - మోసాలను ఇకచేయం
ఏరుదాటినాకతెప్ప - ఏమైనా చేయగలం!
**(కేసీఆర్ వాగ్దానభంగాన్ని నిరసిస్తూ)**

22) దేశంకనుకూలంగా - గాలివాటమున్నదంట
బాబు తప్పరాష్ట్రాన్నీ - బాగుచేయలేరంట
దేశానికి మోడేగతి - రాహుల్‌కుతిఏలంటా
అందాకా ఆగుదాము - ఆసంగతిదేఖుదాము
ఇన్నేళ్లూ మోసినాము - ఇదిమాత్రం భారమా!

23) రండి రండి మా భుజాలు - కాళీగానే వున్నాయ్
కాంగీ బాజపాల్‌తప్ప - ఎవరైనాసరేసయ్
ఆనాడూ హస్తంతో - అంటకాగినామంటే
ఏనాడొజనసంఘ్‌తో - ఏకమయ్యినామంటే
ఎపపటికెయ్యదిలాభమొ - అప్పటికదెవ్యూహము
అదునుచూసి అటోఇటో - చేరుటయే ఎత్తుగడ
అదేమనీదేశంలో - అడిగేదీఎవ్వడంట
పార్టీలో అడిగారా - పైకిపొమ్మనంటామూ
ఎర్రజెండమర్యాదను - ఎపుడోతుడిచేసామూ
ఓట్లూసీట్లేమాకూ - ఈనాడు అతిముఖ్యం!
**(సీపీఎం విధానాలపై విసుర్లు)**

24) ఏవితల్లీ నిరుడుగెంతిన - వీరగద్దరుజాడ ఏదీ
విమలచెల్లీ విప్లవాత్ముల - పాటలేవీ పలుకులేవీ
తెలంగాణా అమరవీరుల - వారితల్లులవార్తలేవీ
గురువుపత్నికెపసరుపెట్టిన - చంద్రుడేడే ఎందెందుచూసిన
త్యాగమూర్తుల త్యాగఫలమూ - భోగమూర్తుల పాలయిందా!

25) ప్రపంచ కార్మికులారా - ఏకమయ్యికలిసిరండీ
మేమంతా చీలికలై - పీలికలై మిగిలినాము
బూర్జువాలజెండాలను - భుజాలపై మోయలేక
నడుములొంగినడవలేక - నడిరోడ్డునపడివున్నాం
తలోచెయ్యివేసివీర్ని - తలలపైకి ఎత్తుకోండి!

26) ఇన్నేళ్ళకి కాంగీపై - ఇరక్తులేపుట్టాయా
మేతగాళ్ళుకోతగాళ్ళు - గోడలుదూకేస్తారా
అధిష్టానదేవతకీ - హారతి ఇచ్చేస్తారా!

27) నేను సైతం ప్రజలపేరున - పెద్దపార్టీపెట్టినాను
నేను సైతం అమ్మగారికి - అండదండగ నిల్చినాను
నేటి సంగతి చూడబోతె - చేతిలో వీబూతిలేదూ
ఉండలేకా వెళ్ళలేకా - ఉడుములాపడివుండినాను
**(చిరంజీవినుద్దేశించి రాసింది)**

28) అన్నావెళ్ళే తమ్ముడొచ్చే - డుండుండుం
నిజంవున్నదీ కమ్యూనిజంలే - డుండుండుం
పవనిజమంటే పవరుకోసమే - డుండుండుం
ఇది కూడా ఆతానులొముక్కే - డుండుండుం!
**(పవన్‌పై చురక)**

29) సిపిఎం అధినేతలు - దాపరికంలేనివారు
ప్రైవేటైజేషనుపై - పోరాటం సలుపుతారు
సారాపోరాటమైన - లాటరిజూదాలైనా
తమరాష్ట్రంలోతప్ప - ఇతరరాష్ట్రములో ఒప్పరు
పరులకొరకె నీతులంటు - పదిలంగా నమ్ముతారు

30) కష్టజీవికిరుప్రక్కల - నిలిచినవాడే కవిఅని
శ్రీరంగంశ్రీనివాసు - డేనాడో చెప్పాడు
శ్రమదోపిడిపై సమరం - చేయమనీపిలిచాడు
చెరసాలకు జడవొద్దని - చెరబండను చూపాడు

31) దేశం కాంగీ రెండూ దొందూ దొందే
జెండాలేవేరుగాని అజెండా ఒకటే
పాలోమని ఓట్లువేసి
అలోమని ఏడకండి!

32) ఓట్లూ సీట్లూ తప్పు - సిద్ధాంతం ఎవరికుంది
చేసిన వాగ్దానాలను - చెల్లించేదెవ్వరంట
మద్యనిషేదం మాటననె - మరిచినమన నాయకులను
గద్దెనెక్కు ముందుగా గద్దించీ అడగండి!

33) ఇరవై ఒకటో శతాబ్ది - ఇదిగో వచ్చేసింది
కంప్యూటరుదేశాన్నే - కంట్రోల్ చేసేస్తుంది
అయితేనేం తరతరాల - అజ్ఞానం ఒదలలేదు
మూఢనమ్మకాల ప్రజలు మునిగితేలుతీరుజూడు!

34) కుక్కలు చంపొద్దంటూ - ఎక్కారట కోర్టులు
చక్కగ చెప్పారంటూ - ఇచ్చారట తీర్పులు
జీవులపై కారుణ్యం - పొంగిపొర్లి పారితే
ఈగలు దోమలు చీమలు జీవులు కాదందురా
పిల్లలనకపెద్దలనక - పీకిపీలికలు జేసే - కుక్కలపైనున్న
ప్రేమ మనుషులపై లేదటోయ్!

35) సీపీఎం అధినేతలు చీపుమాటలాడబోరు
ఆనాటికి కాంగ్రెస్సే అసలు శత్రువన్నారు
ఆపై బీజేపీతో ఒకేవేదికెక్కారు
అటుతర్వాతను రెండూ అపరవైరులన్నారు
ఈరోజుల్లో బీజేపీతోనే వైరమంటు
కాంగీచేయూతిస్తే కడతేర్చుదమంటారు
సీపీఎం మాటల్లో చిత్తశుద్ధి ఎంతవుందో- ఎర్రకార్యకర్తలకీ ఎరుకలేక
ఏడునంట!

36) పొట్టలో పొయ్యాల్సినపాలు పుట్టలోపోస్తే
పుట్టలో పాముగట్టుపైకొస్తే
కరాలుజోడించినిలబడతావా
కాళ్ళకిపనిజెప్పి పరుగెడతావా!

37) అడిగితే ఇచ్చెనా అయిదూళ్ళురాజు
అనలమందునగెల్చి అందుకునె రాజ్యం
రక్తపాతములేక - రాజ్యమెటువచ్చు
శిశువుపుట్టినకూడ చిందదారుధిరం!

38) పల్లెపల్లెకు బారు - వీధివీధికి బీరు
ప్రభుత తీరును జూసి ప్రజలు బేజారు
మహిళలంతా కలిసి మరియొక్కమారు
మద్యరక్కసిపైన చెయ్యాలిపోరు!

39) బెంగాల్లో కాంగీతో కుమ్ములాట తప్పదంట
ఆంధ్రాలో చేతి ఊతలేకుండానడవరంట
దేశం బాజపా తోడదేకినారు ఆనాడు
ఆ రెంటికిపోటీగా దూకినారు ఈనాడు! - (సీపీఎంపై చురక)

40) ఆర్టీసీ బస్సులంటె అందరికీ లోకువే
పగలగొట్టి అగ్గిపెట్టుపనులంటే వేడుకే
ఆ నష్టం అసలువడ్డీ ప్రజలనెత్తిమీదకే
అది తెలిసీ మసలువారు అరుదైనామనుషులే!

41) యాపారం పేరుమీద - మిత్రమనేదిగమింగీ
భారతీయులందరినీ - బానిసచేశారు నాడు
మల్లీవస్తున్నాడూ - తెల్లవాడుమనదేశం
నల్లవాడిదన్నుతోడ - చల్లగదోచేస్తాడూ



# నినాదాలు

1) ప్రేమికులిచ్చే దెపుడూ నిత్యం ఆనందం
ప్రేమోన్మాదులు ఇచ్చును పూడ్చలేని విషాదం!

2) సినిమాల్లో కన్యలనూ - టీజింగులు చేద్దురూ
అదే రోడ్డుపైజేస్తే - పాదాజైలుకందరూ!

3) రామక్రిష్ణబీచ్‌లోన - రాసక్రీడలొద్దు
సాగరసౌందర్యాలను - తిలకించుటెముద్దు!

4) పేదల ప్రాణాలకొరకు రోజూ పోరాటమే
అయినా ధన్వంతరీలు - అలసత్వం రివాజే!

5) ధర్మాసుపత్రికాదు - ఖర్మాసూపత్రిరా
కడవరకూ తిరిగొస్తా - వనినమ్మకమేదిరా!

6) మందులోళ్ళుకాదువాళు - మాయలోళ్ళు
తెలియరా - ఏమందులొ ఏముందో
ఎవ్వరికీ తెల్దురా!

7) కూలిరూక పెంచమంటె - క్రూరహింసపెట్టురా
స్వాములోర్లు అడగ్గానె - వేనవేలుయిచ్చురా!

8) అభ్యుదయంమాటల్లో - ఆకసానలేచురా
ఆచరణలు మాత్రం - పాతాళానికి జారురా!

9) చీమలు పెట్టిన పుట్టలు - పాములాక్రమించెరా
శ్రామిక ఫలితాలన్నీ - ధనికులంత దోచెరా!

10) ధారాపాతంగా - ఒకసారి వచ్చు కవిత్వం
వేరే ఇంకొక్కసారి - రాదుచిన్నరసత్వం!

11) వేదనలో రసమయఆస్వాదనలో
నవ్యదివ్యభావములోనన్
శోధనలో ఎదలో సోదరోదనలో
శూన్యమేను ఈ ధరిత్రిలోన్!

12) బీరుబ్రాందిఅమ్మి - కోట్లు కూడబెట్టినోడు
ఎంకన్నా గుడిలోన ఏలికమొనగాడు!

13) మందుకల్తీరోగాలను - మాన్పుమందులన్నికల్తీ
పాలుకల్తీనీళ్ళుకల్తీ - పాలనయేకల్తీ!

14) వనంలోనజనం మమ్ము - తమవారుగచేరదీస్తె
వనంకాల్చిజనంచంపి - ధనంకూడబెడితిరే!

15) ప్రజలమానప్రాణాలను - కాపాడేవారలు
కంచేచేనుమేసినట్లు - కబళించిరిచోరులు!

16) బుల్లితెరాచిందుతోంది
అశ్లీలపుగరళం - అడ్డుకట్టవేయకుంటె
అయితీరును విలయం!

17) దళితుల హక్కులకోసము
ధనము సుఖము ధారపోసి, మనువాదులతో
నిరతము పోరునుజేసెను
ఘనతరుడౌ అంబేద్కరు జనబాంధవుడై!

18) సహగమనం పేరుతో ఆనాడూ – కట్నాలపేరుతో ఈనాడూ
ఆడవార్ని కాల్చుకు తినేసంఘమా
పేరులోనేతప్ప – తీరులోమార్పులేదు

19) తెలుగువాడిపద్యానికి – రష్యావోడ్కమద్యానికి
చైనావాడిసేద్యానికి సాటిలేదు లేదటంచుచాటింపేశా

20) మార్క్సిస్టెవడూ మూర్కిస్టుకాడు
మూర్కిస్టెవడూ మార్క్సిస్టుకాడు
మార్క్సిస్టైనామూర్కిస్టైనా - మోరలిస్టుకానిదేవేస్టు
వాడుసిగరెట్టుకంటే లీస్టు!

21) ఫైలు మోయలేక మంత్రి బంట్రోతులకిచ్చురా
పుస్తకాలు మోసిమోసి పిల్లలనడుమొంగెరా!

22) పూర్వజన్మఖర్మంటూ కూర్మంలా వుండిపోకు
దోపిడిపై సమరాన్ని సాగిస్తూ పోముందుకు

23) ప్రేమిస్తావాలేక ఛస్తావా చెప్పు
ఏసిడ్‌తో కత్తులతో వచ్చునీకు ముప్పు!

24) ఆగలేదుతల్లీ - నువ్వెళ్ళాకా మళ్ళీ
పదేపదే అదేపనీ - పాపాత్ములఢిల్లీ!

25) ధనంకొరకు కొంతమంది
జనంకొరకు కొంతమంది
పదవికొరకు కొంతమంది
పెదవికొరకు కొంతమంది
పదిమందీ సుఖంకోరు
పధికులవెంటే - నేను!

26) తావీజులు మంత్రాలకు తగ్గవులే
జబ్బులూ - తక్షణమే సంప్రదించు
అల్లోపతి వైద్యునీ

27) మనమంతాకలిసామాజనమంతాకదిలామా
మానవరక్తంపీల్చేజలగలుమటుమాయం
మానవతను స్థాపించేమార్క్సిజమేఖాయం

28) కులంమతం రొంపిలోన
కుళ్ళుతుందిలోకం
మార్క్సిజమనెమందువేసి
మాన్పుదానిరోగం!

29) జోకొట్టి జోలపాడి - నిదురప్పులేరులే
పసిపిల్లలుకాదు ప్రజలు ప్రజ్వరెల్లుజ్వాలలే!

30) బారెడేసి జడలుపెంచి - సింధూరంపెడుదురూ
భయపెట్టి మోసపుచ్చి
ప్రజల దోచుకుందురూ!

31) మేధావుల నాదుకోని నాయకులొకనాయకులా
విద్యార్థుల విస్మరించు - పాలకులొకపాలకులా
యువతరాన్ని గుర్తించని ప్రభుత వుండిదండగే
సమతా మమతలులేని - సమాజమే నరకమే

32) బ్రతకాలంటే భయం ఒదులుకో
దోపిడోళ్ళపై పోరునేర్చుకో!

33) రాజకీయ రంగులన్ని చూసినారుజనం
మరలమరలనమ్మరులే మాయదారిరణం

34) ఏబదేళ్ళ స్వాతంత్రం ఏమిచ్చెను గురువరా
ఇప్పపువ్వు అడివిదుంపజొన్నంబలిచాలదా
స్వర్ణోత్సవ సంబరాలసారమే మిగురువరా
స్వర్ణ సంపదున్నోళ్ళసంబరాలు డింభకా

35) సీటుఎక్కుదాక మంచినీటుఘాటుమాటలే
సీటులెక్కినామంత్రి - చీటింగులచేష్టలే!

36) చెడుపులు చిల్లంగిలంటు - చెప్పుమాయగాళ్ళను
చెప్పుదీసి బుద్ధిచెప్పి - చప్పున తరమాలిరా!


పద్యాలు

# 1. తెలుగు తిమిరం!

❖ చావుకబురుమీరు – చల్లగాచెప్పిరి
తెలుగువెలుగునడుపు – ఎలుగులారా
నాదుకవితవ్యాస – రచనలన్నింటిని
చెత్తబుట్టలోన – వేసినారా!

❖ నమస్కారంపెట్టి – మస్కానుకొట్టారు
తెలుగువెలుగునడుపు – కలుగులారా
మర్యాదగా నాదు – రచనలన్నింటిని
మట్టిలోగలిపిరా – లొట్టిలారా!

❖ తెలుగువెలుగుకొరకు – తెగవేచివీక్షించి
పత్రికకొనివిప్పి – చదివిచూడ
కాగితంబెమిన్న – ప్రింటింగు అదిమిన్న
రచనలన్నిసున్న – రసముసున్న

❖ పొడుపుకథలు – పట్టువిడుపుకథలుకొన్ని
జొనపగానెరాదు – ఘనత ఎపుడు
దిష్టిబొమ్మ సస్య – మెట్లుకాపాడును
కాపువాడులేక – కలదెరక్ష?

❖ తెలుగువెలుగుయన్న – కలకలమ్ముకలిగె
కవితకుందిమంచి – భవితఅనుచు
తెలుగువెలుగునింప – కవితల్లిపంపిస్తె
చింపిపారవేసె – గంపలోన!

❖ రామోజీపత్రికన్న – ఏమాత్రముసందియములు
ఎవరికిలేవే – గానీ పరిశీలించగ
డేమోజీకొంతకలదు – తిలకించంగా

※ ఉత్తరాలుజూడ – ఉత్తుత్తిరాళ్ళేను
కవితాకషాయంబు – కలదుసుంత
ప్రేమలేఖలపేర – కాముకులకవితల్ని
గుదిగుచ్చిరాసిన – గుత్తులవియే!

※ నలుగురుకవులను – జొనిపియు
ననయంగా ప్రేమలేఖ – లనిబొగడంగా
అనఘావెయినూటపదార్లు – గొననర్హతగలదెజూడ ఘనులొప్పంగన్

※ కవితలోనిరసము – కావ్యమ్ములోబలము
వ్యాసమందుశ్వాస – గాంచవలయు
పక్షపాతమ్ముతో – పరిశీలనముచేయ
పక్షవాతమువచ్చు – చచ్చుతుదకు

※ ※ ※ ※ ※ ※ ※ ※ ※

2) ఇంటరు చదువుతువుండే – తుంటరివాడొకడునన్ను
కంటితొపిలువన్ – తుంటిపై చాచితన్నగ
ఒంటేలునుపోసినాడు – చంటీవినవే!

3) తలరెసిరిపోయినా – పలువరుస ఊడినా
కలికివలపులకొరకు – కాచుకున్న
గుంటనక్కలుకొంద – రుందురుజాగ్రత్త
ఒంటరిగ చిక్కకూ – ఇంటనెపుడూ

4) శృంగారచూపుగని – తనకంగీకారమ్ము
దెలిపెననిమదిదలచీ – కంగారుపడుతులేస్తూ
బంగారపురింగు – పారవేసినుఎచటో!

5) నూటికి పది వడ్డీలకు – కూటికిలేనోళ్ళకిచ్చి
కోట్లు గడించీ – నూటొక్కకొబ్బరికాయలు
కోటప్పకు కొట్టగానె మేటివవుదువా!

6) విప్లవకారులమంటూ - గొప్పలు చెప్పేదరుకొంద
రెప్పటినుంచో - సప్లై డిమాండ్‌పయిమీ రిప్లయ్ ఏమం
టె - పెదవి విప్పరదేమో!

7) యోనిపూజ చేసి - యోగమంటరేమి!
శిశ్నపూజచేసి - శివుడందురేమీ
మర్మావయవములకు - మహిమలువుండునా
మూఢభక్తిచేయు - మూర్ఖులారా

8) మాతృభాషయందు - మమకారమునుబెంచ
తెలుగువెలుగుచాల - బలమునిచ్చె
మాతృభాషయందు - సాధికారతబెంచ
ముఖ్యమంత్రిమూతి - ముడుచుకొనియె

9) ఏడుకొండలవాడి - ఎదుటవేదికపైనె
ఇచ్చినట్టిమాట - పుచ్చిపోయె
తెలుగుప్రజలుగట్టి - తెగువచేయకయున్న
అమ్మభాష - అంతరించిపోదే!

10) వ్యాపారులు పాలకులూ - లోపాయ్‌కారొప్పందాల్
రూకలకొరకే - లోకులకడుపులుగొట్టీ
పాపపుసొమ్ములనుమింగు - చీకటికొడుకుల్!

11) 'ఎంఆర్ పీ' మోసాలను కమ్మగ - చెబుతాను మీరు వింటానంటే
'ఎం' అంటే మోసంరా, 'ఆర్' అంటే రేటులురా 'పి' అంటే ప్రింటురోరి పిచ్చిపుల్లన్నా!

12) అర్ధరూపాయ్ సరుకుపైన - ఎంఆర్‌పీ ముద్రవేసి
అయిదురూకలన్నకూడ - అడగలేవుగా
ఎంఆర్‌పీ రేటుపైన రూపాయ్ తగ్గించినా
అదే నీకు పదివేలని అనుకుంటావ్‌గా!



రచయిత పేరు బిళ్ళా అప్పలనారాయణరావు. జననం : 1945-04-26. తల్లిదండ్రులు అప్పలనరసమ్మ, సీతారామయ్య. స్వస్థలం నెలివాడ గ్రామం, విజయనగరంజిల్లా. 9వ తరగతివరకు చదువుకున్నారు. వృత్తి (ని)ర్వ్యాపారం. ప్రస్తుతం విశాఖపట్నంలో నివాసముంటున్నారు. సాహిత్యానికి సార్థకత సామాజిక ప్రయోజనమేనన్న విశ్వాసంతో సాహితీ అధ్యయనం చేస్తున్నారు. భావవిప్లవం వస్తేనే సమసమాజానికి మార్గం సుగమం అవుతుందని, సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

# ఎందుకు రాశానంటే?

ఈ శ్రమదోపిడీ ప్రపంచాన్ని మార్చాలంటే, మార్క్సిజమే మార్గమని నమ్మినవారిలో నేనొకడ్ని. . శ్రమదోపిడీ జరుగుతుందనీ, అందువల్లనే, సమాజంలో, ధనిక పేద వర్గాలుగా, అసమానతలతో ఈ సమాజం నడుస్తుందనీ, ఈ అసమానతలకి కారణాలేమిటో కనిపెట్టడమేగాక, అందరూ సుఖంగా, అందరూ శ్రమచేస్తూ సమానంగా బతకాలంటే ఏం చెయ్యాలో, దాని మార్గాలేమిటో, చెప్పిన సిద్ధాంతమే మార్క్సిజం. అది మార్క్స్ అనే ఆయన కనిపెట్టాడు గనుక, అది మార్క్సిజంగా పేరుగాంచింది. ఈ విషయాలు చాలామందికి పేదలకీ అవిద్యావంతులకీ తెలియకపోవచ్చు. కానీ కొంతమంది విద్యావంతులకీ, మేధావులకీ తెలిసినా, తమ స్వప్రయోజనాలకి నష్టం వస్తుందని, తెలియనట్టు వూరుకుంటారు. మరికొంతమంది తమ పురాతన అశాస్త్రీయభావాలూ, మూఢనమ్మకాల్నీ ఒదలలేక, ఒదిలేస్తే ఏం నష్టాలొస్తాయోననీ భయాలవలనా, ఈ నిజాల్ని అంగీకరించడానికి యిష్టపడరు. కోట్లాదిమంది ప్రజలు యింకా ఈ దేశంలో నిరక్షరాస్యులుగా వుండటంవలన, ఈ శ్రమదోపిడీ గుట్టును విప్పే మార్క్సిజం సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేక, దోపిడీనుంచి విముక్తికాలేక, నలిగిపోతున్నారు. కొంతమంది చదువుకున్నా, అప్పటికే ఈ దోపిడీ కర్తలు ఈ చదువునికూడా, మూఢనమ్మకాలతోనే ముంచేసి, చదువుకున్నా కూడా శ్రమదోపిడీ జరుగుతుందన్న జ్ఞానాన్ని, ఆ చదువుకున్నవారికీ కలగకుండా, వారి దోపిడీ సిద్ధాంతానికి అనుగుణంగా చదువుని కూడా మార్చేసీ, పేదరికానికి, దరిద్రానికీ కారణం తమ పూర్వజన్మల ఫలితాలేననీ, తమ ఖర్మలేననీ అందువల్లనే తాము పేదరికం అనుభవించాల్సి వచ్చిందనీ అదంతా దేవుడి రాత అని, నమ్మేటట్లుగా ఆ చదువుల్నీ పురాణాల్నీ గ్రంథాల్నీ తయారుచేసి పేదల్ని పేదరికంలో మగ్గి అణగిపోయేటట్లు తయారుచేసారు. మీ పేదరికానికీ, మీ ఖర్మలూపూర్వజన్మల ఫలితాలూ దేవుళ్ళ రాతలూ కారణం కాదనీ, మీ శ్రమను దోపిడీ చేసి, మీ కష్టార్జితాన్ని దిగమింగి వీళ్ళంతా ధనికులయారనీ, ఆ గుట్టు విప్పిచెప్పిన మార్క్సిజం సిద్ధాంతాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, శ్రమదోపిడీ నుంచి తమని తాము విముక్తిచేసే మార్గాన్ని వారికి తెలియచేసేందుకు నాకు చేతనైన విధంగా పాటలతో, కవితలతో, శ్రామిక జనగీతాలు పేరిట ఈ పుస్తకాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చాను.నా ప్రయత్నంలో ఏమేరకు ఫలితం వచ్చినా సంతోషమే!

- బి.ఏ. నారాయణరావు